ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

ఖమ్మం

: fb.com/vaartha Digital

పార్లమెంటులో బిసి బిల్లు పెట్టండి..

ముంబయి గణేశ మండపానికి రూ.474 కోట్ల ఇన్సూరెన్స్ 5

Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam


19-8-2025 మంగళవారం సంపుటి: 31 సంచిక: 199 పేజీలు: 8+16 వెల: 6.50

# ఏకగ్రీవంగా ఉపరాష్ట్రపతి?



### వివిధ విపక్షాలతో చర్చిస్తున్న ఎన్‌డిఎ నేతలు
### ఖర్గేకు ఫోన్ చేసిన రాజ్‌నాథ్
### పోటీరహితంగా ఎన్నుకొందామన్న జెపి నడ్డా
### తమిళనాడు నేత కావడంతో రాధాకృష్ణకు డిఎంకె మద్దతు?

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు18:** మహారాష్ట్ర గవర్నర్, ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థి సి.పి.రాధాకృష్ణన్ ప్రధాని మోడీని కలిశారు. సోమవారం మధ్యాహ్నం దిల్లీ చేరుకున్న రాధాకృష్ణన్ ఆ వెంటనే ప్రధాని మోదీతో భేటీ అయ్యారు. అంతకుముందు దిల్లీ విమానాశ్రయంలో ఆయనకు కేంద్రమంత్రులు రామ్మోహన్ నాయుడు, కిరణ్ రిజిజు, ప్రహ్లాద్ జోషి, భూపేంద్రయాదవ్ సహా బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వినోద్ థావడే స్వాగతం పలికారు. ఎన్డీయే తరఫున ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా దక్షిణాదికి చెందిన మహారాష్ట్ర గవర్నర్ చంద్రపురం పొన్నుస్వామి రాధాకృష్ణన్‌ను, ఆదివారం సాయంత్రం బీజేపీ పార్లమెంటరీ బోర్డు ఎంపిక చేసింది. ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ఎన్నికైనందుకు రాధాకృష్ణన్‌కు మోదీ శుభాకాంక్షలు తెలిపారు. సుదీర్ఘకాలంగా ప్రజాసేవ, వివిధ రంగాల్లో ఆయనకున్న అనుభవం దేశాన్ని సుసంపన్నం చేస్తుందని ఆయన్ని అభినందించారు. ఎల్లప్పుడూ అదే అంకితభావంతో దేశానికి ఆయన సేవలు కొనసాగించాలని కోరారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. జగదీప్ ధన్‌ఖడ్ అకస్మాత్తుగా ఉప రాష్ట్రపతి పదవికి రాజీనామా చేసిన తరుణంలో ఎన్‌డీఏ తదుపరి అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్‌ను ప్రకటించారు. బీజేపీ పార్లమెంటరీ బోర్డు ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రధానమంత్రి మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో సహా సీనియర్ నాయకులు పాల్గొని ఈ నిర్ణయం తీసుకున్నారు. కాగా ఉపరాష్ట్రపతి ఎన్నికలు సెప్టెంబర్ 9న జరగనున్నాయి. రాజ్యాంగం ప్రకారం >>2



# హలో! మోడీజీ!

### ప్రధానికి రష్యా అధ్యక్షుడు పుతిన్ ఫోన్
### ట్రంప్‌తో చర్చలపై వివరించిన వైనం

**మాస్కో, ఆగస్టు 18:** రష్యా అధ్యక్షుడు పుతిన్ సోమవారం ప్రధాని నరేంద్ర మోడీకి ఫోన్ చేశారు. ఉక్రెయిన్ యుద్ధం ముగింపు ప్రయత్నాల్లో భాగంగా ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో అలాస్కా వేదికగా జరిగిన సమావేశానికి సంబంధించిన వివరాలను పంచుకున్నారు. ప్రధాని మోడీ ఈ విషయాన్ని ధ్రువీకరించారు. 'డొనాల్డ్ ట్రంప్‌తో అలాస్కా భేటీకి సంబంధించిన వివరాలను పంచుకున్నందుకు పుతిన్‌కు ధన్యవాదాలు. ఉక్రెయిన్ వివాదాన్ని శాంతియుతంగానే పర్కి స్కరించుకోవాలని >>2

# యూరియా ఇవ్వరా?




సోమవారం పార్లమెంటు ఆవరణలో ధర్నా చేస్తున్న కాంగ్రెస్ ఎంపీలు మల్లు రవి, అనిల్, చామల కిరణ్ కుమార్, బలరామ్‌నాయక్ తదితరులు

### కేంద్రాన్ని నిలదీసిన కాంగ్రెస్ ఎంపీలు
### ఇస్తామన్న 8 లక్షల టన్నుల యూరియా ఎక్కడ?
### పార్లమెంటు లోపల, వెలుపల రగడ, రగడ
### ఉత్పత్తి రామగుండం,ఆఫీసు నోయిడాలోనా?
### రైతులకు అందుబాటులోలేని అధికారగణం
### పంటలు దెబ్బతింటున్నా కేంద్రానికి పట్టదా?: ఎంపి మల్లు రవి

**హైదరాబాద్,ఆగస్టు 18,ప్రభాతవార్త:** యూరియా కోసం తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు పోరుబాట పట్టారు. బిజెపి ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే తెలంగాణకు యూరియాను కేటాయించడం లేదని తెలంగాణ కాంగ్రెస్ ఎంపిలు ఆరోపించారు. రైతులకు అందుబాటులో ఆర్ఎఫ్‌సిఎల్ అధికారగణంల లేకుండా నోయిడాలో ఆఫీసు పెట్టారని దుయ్యబట్టారు. రామగుండంలో యూరియా తయారీ ఆఫీసు దేశరాజధానిలో ఉంటదా అని వారు నిలదీశారు. యూరియా కోటాను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పార్లమెంట్ వద్ద ప్లకార్డులు ప్రదర్శిస్తూ సోమవారం ధర్నా చేశారు. అనంతరం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. ఎంపీ మల్లు రవి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రానికి ఇస్తామని చెప్పిన 8 లక్షల టన్నుల యూరియాను ఇవ్వకుండా 5 లక్షల 32 వేల టన్నులు మాత్రమే ఇచ్చారని ఆరోపించారు. ఇంకా దాదాపు 3 లక్షల టన్నుల యూరియా కోటా ఇవ్వకుండా కేంద్రం రైతులను వేధిస్తున్నదని విమర్శించారు. వరి పంటకు రైతులు ఎక్కువగా యూరియాను వాడుతున్నారు. ప్లాన్ ప్రకారం కాకుండా తక్కువ యూరియాను ఇచ్చారు. దీనివల్ల అన్నదాతలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. యూరియా కొరత ఏర్పడింది. యూరియా కోసం రైతులు ఉద్యమం చేసే పరిస్థితి వచ్చింది. ఈ నేపథ్యంలోనే యూరియా కోసం తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలం పార్లమెంట్ ఎదుట ప్లకార్డులు ప్రదర్శించి ధర్నా చేశాం. పార్లమెంట్‌లో అర్జెన్‌మెంట్ మోషన్ ఇచ్చాం. జీరో అవర్‌లో కూడా అందరం ఎంపీలం నోట్ ఇచ్చాం. కానీ సభ సజావుగా జరగడం లేదు. 11 గంటల నుంచి 12 గంటల వరకే సభ నడిపారు. మళ్లీ 2 గంటలకు వాయిదా వేశారు. యూరియా కోసం ప్రొసీజర్ ప్రకారం ప్రయత్నాలు చేస్తున్నాం. గతంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నడ్డాను కలిసి పరిస్థితిని వివరించారు. కానీ ఆయన ఇప్పటివరకు యూరియాను కేటాయించలేదు. స్టాండింగ్ కమిటీ మీటింగ్‌లోనూ ఈ అంశాన్ని లేవనెత్తుతాం. నడ్డాను కూడా టైం >>2




## వాహనాలపై జీవిత పన్ను పెంపు

### 14 నుంచే అమల్లోకి, ఇవిలకు మినహాయింపు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు18:** తెలంగాణ ప్రభుత్వం వాహనాలపై లైఫ్ టాక్స్ పెంచింది. ఆగస్టు 14 నుంచి కొత్త రేట్లు అమల్లోకి వచ్చాయి. రవాణా, రోడ్లు భవనాల శాఖ జారీ చేసిన జీఓ నెం.53 ద్వారా మోటార్ వాహనాల పన్ను చట్టం, 1963లోని షెడ్యూల్స్‌లో మార్పులు చేసింది. ఈ మేరకు రెండు, మూడు,నాలుగు చక్రాల నాన్-ట్రాన్స్‌పోర్ట్ వాహనాలకు పెరిగిన లైఫ్ టాక్స్ వసూలు చేయనుంది. తాజా నిర్ణయం మేరకు రూ. 50వేల లోపు ధర కలిగిన రెండు చక్రాల వాహనాలపై ఇప్పుడు 9శాతం పన్ను విధించనున్నారు. రూ.50వేల నుంచి రూ.ఒక లక్ష వరకు ఉన్న బైకులపై 12 శాతం పన్ను యథాతథంగా కొనసాగుతుంది. రూ. ఒక లక్ష నుంచి రూ. రెండు లక్షల మధ్యలో ఉన్న వాహనాలపై 15 శాతం, రెండు లక్షలకు పై బడిన వాటిపై 18శాతం లైఫ్ >>2

## సినిమా కేంద్రంగా హైదరాబాద్

### నిర్మాణాలకు ప్రభుత్వం చేయూత: సిఎం రేవంత్
### ముఖ్యమంత్రితో భేటీ అయిన జాతీయ ఫిలిం అవార్డులకు ఎంపికైన ప్రముఖులు



సోమవారం ముఖ్యమంత్రితో భేటీ అయిన జాతీయ ఫిలిం అవార్డులకు ఎంపికైన సినీప్రముఖులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు18:** భారతీయ సినిమా నిర్మాణానికి కేంద్రంగా హైదరాబాద్‌ను నిలపాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. సినిమా రంగం ప్రోత్సాహకానికి అవసరమైన చేయూతనందిస్తామని ఆయన తెలిపారు. 71వ జాతీయ ఫిల్మ్ అవార్డుల్లో వివిధ విభాగాల్లో ఎంపికైన సినీ ప్రముఖులు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో సోమవారం సాయంత్రం మర్యాదపూర్వకంగా కలిశారు. సినిమా పరిశ్రమ ఎదుర్కొంటున్న సవాళ్లను సినీ ప్రముఖులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అవార్డు గ్రహీతలైన భగవంత్ కేసరి సినిమా డైరెక్టర్ అనిల్ రావిపూడి, హనుమాన్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ, హనుమాన్ సినిమాకు విజువల్ ఎఫెక్ట్‌కు సంబంధించి వెంకట్, శ్రీనివాస్, టీమ్ సభ్యులు, ఫైట్ మాస్టర్స్ నందు, పృథ్వీ, బేబి సినిమా డైరెక్టర్ సాయి రాజేశ్, సింగర్ రోహిత్‌లను సన్మానించారు. కార్యక్రమంలో హనుమాన్ సినిమా నిర్మాతలు చైతన్య రెడ్డి, నిరంజన్ రెడ్డి, బేబి సినిమా నిర్మాత ఎస్కేఎన్, భగవంత్ కేసరి నిర్మాత గారపాటి సాహు తదితరులు పాల్గొన్నారు.

**టిఫైబర్‌పై సమగ్ర నివేదిక సమర్పించండి: సిఎం**

టీ ఫైబర్ పనులు జరిగిన తీరు... ప్రస్తుత పరిస్థితి... భవిష్యత్‌లో చేపట్టనున్న పనులపై సమగ్ర నివేదిక సమర్పించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. టీ ఫైబర్ పై తన నివాసంలో సోమవారం రాత్రి ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. టీ ఫైబర్ పనులు చేసిన కాంట్రాక్ట్ సంస్థలకు నోటీసులు ఇచ్చి పనులు చేసిన తీరుపై నివేదిక కోరాలని సీఎం ఆదేశించారు. సంస్థలో ఉద్యోగుల సంఖ్య, వారి పని తీరును సమీక్షించాలన్నారు. ప్రతి పల్లెకు, ప్రతి ఇంటికి ఇంటర్నెట్ సేవలు అందించేందుకు ఉద్దేశించిన కార్యక్రమమైనందున పూర్తి స్థాయి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సీఎం ఆదేశించారు. టీ ఫైబర్ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ప్రణాళిక ఉండాలని సీఎం ఆకాంక్షించారు. ఇప్పటి వరకు చేసిన వ్యయం, పూర్తి కావడానికి అవసరమయ్యే నిధులు, వాటి సేకరణ, కార్యక్రమం విజయవంతం కావడానికి తీసుకోవాల్సిన చర్యలను నివేదికలో పొందుపర్చాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. సమీక్షలో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ వి.శేషాద్రి, >>2

## తొలగించిన 65 లక్షల ఓటర్ల పేర్లు వెల్లడి

### సుప్రీంకోర్టు ఆదేశంతో బీహార్ జాబితా ప్రకటించిన సిఇసి




**న్యూఢిల్లీ, ఆగస్టు 18:** దేశవ్యాప్తంగా బీహార్ రాష్ట్రంలో జరుగుతున్న ఎన్నికల సంఘం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) వ్యవహారం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్ ఎంపి, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఈ ప్రక్రియను 'ఓట్ల చోరీకి కొత్త ఆయుధం'గా ఆరోపించారు. ఈ నేపథ్యంలో తాజాగా ఎన్నికల సంఘం సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు బీహార్‌లో ఓటర్ల జాబితా నుంచి తొలగించబడిన 65 లక్షల మంది పేర్లను విడుదల చేసింది. పోలింగ్ బూత్‌లలోని 'ఎఎస్‌డి' (గైర్హాజరు, బదలీ చేయబడిన, మరణించిన) కేటగిరిల్లో ఉన్న ఓటర్ల వివరాలను ఆగస్టు 19లోపు బహిరంగ పరచాలని, 22వ తేదీ నాటికి సమ్మతి నివేదికను దాఖలు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. దీనికి అనుగుణంగా ఎన్నికల సంఘం ఆ వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తామని కూడా తెలిపింది. కాగా, బీహార్ ఓటర్ల భారీ తొలగింపుపై విపక్షాలు మండిపడుతున్నాయి. తొలగించిన ఓటర్ల జాబితాను వెంటనే ప్రజలకు అందుబాటులో ఉంచాలని ఇప్పటికే >>2

## మాజీ మంత్రి సబిత, కృపానందంకు హైకోర్టు నోటీసులు

### ఓఎంసి కేసు

**హైదరాబాద్, ఆగస్టు 18, ప్రభాతవార్త:** ఉమ్మడి ఎపిలో సంచలనం రేపిన ఓబు ళాపురం గనుల అక్రమ మైనింగ్ కేసులో మాజీ మంత్రి సబితా రెడ్డి, విశ్రాంత ఐఎఎస్ అధికారి కృపానందంలకు హైకోర్టు సోమవారం నాడు నోటీసులు ఇచ్చింది. ఈ కేసులో వీరిద్దరిని నిందితులుగా సిబిఐ పేర్కొనడం తెలిసిందే. అయితే నాంపల్లి కోర్టు సిబిఐ 14 ఏళ్ల పాటు సాగిన విచారణ అనంతరం వీరిద్దరిని గత మే నెలలో నిర్దోషులుగా తీర్పు చెప్పడం విదిత మే. ఈ కేసులో కర్నాటక బిజెపి ఎంఎల్ఎ గాలి జనార్ధన్ రెడ్డితో పాటు ఆయన సోదరుడు శ్రీనివాస్ రెడ్డి, వారి అనుచరుడు మెఫజ్ అలీఖాన్, నా టి గనుల శాఖ డైరక్టర్ రాజగోపాల్‌లను కోర్టు దోషులుగా చెబుతూ వీరికి జైలు శిక్షతో పాటు జరిమానాలు విధించింది. అయితే ఇదే కేసులో నింది తులుగా వున్న నాటి గనుల శాఖ మంత్రి సబితా రెడ్డి, గనుల శాఖను పర్యవేక్షించిన ఐఎఎస్ అధికారి కృపానందంలపై సిబిఐ మోపిన అభియోగాల కు ఎలాంటి ఆధారాలు లేవని సిబిఐ కోర్టు పేర్కొనడంతో పాటు వీరిద్దరిని నిర్దోషులుగా వెల్లడించింది. కాగా సిబిఐ కోర్టు తీర్పును హైదరాబాద్ సిబి ఐ విభాగం హైకోర్టులో ఇటీవలే సవాల్ చేయడం తెలిసిందే. దీనిపై >>2

## కాంగ్రెస్ అసమర్థతతో పారిపోతున్న పరిశ్రమలు

### గుజరాత్‌కు తరలిన రూ.2,800 కోట్ల కేన్స్ పెట్టుబడి
### ఢిల్లీకి ఎటిఎంలా రాష్ట్రం: కెటిఆర్



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు18:** కాంగ్రెస్ ప్రభుత్వ చేతకానితనం, నిర్లక్ష్యపు పాలనా విధానాలతోనే తెలంగాణకు రావాల్సిన భారీ పరిశ్రమలు పొరుగు రాష్ట్రాలకు తరలిపోతున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీ రామారావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎంతో శ్రమించి రాష్ట్రానికి తీసుకొచ్చిన రూ.2,800 కోట్ల పెట్టుబడి, 2 వేల ఉద్యోగాల సామర్థ్యం గల కేన్స్ టెక్నాలజీ సెమీకండక్టర్ల పరిశ్రమ కాంగ్రెస్ సర్కార్ అసమర్థత కారణంగా గుజరాత్‌కు తరలిపోవడం అత్యంత బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వరుసగా పరిశ్రమలు తరలిపోతున్నా ఇప్పటివరకు రేవంత్ రెడ్డి కనీసం స్పందించడం లేదన్నారు. గతంలో తమ ప్రభుత్వం ఎంతో శ్రమించి కర్ణాటకకు వెళ్లాల్సిన కేన్స్ పరిశ్రమను తెలంగాణకు రప్పించిందన్న కేటీఆర్, వారు కోరిన వెంటనే పది రోజుల్లోనే కొంగరకలాన్‌లో ఫాక్స్‌కాన్ పక్కనే భూములు కేటాయించామని తెలిపారు. తమ పారదర్శక పాలన, చిత్తశుద్ధితో తెలంగాణలో పెట్టుబడులు పెట్టడానికి వచ్చిన ఆ సంస్థ, నేడు కాంగ్రెస్ అవినీతి, అసమర్థ పాలన కారణంగానే రాష్ట్రం విడిచి వెళ్లిపోయిందని కేటీఆర్ విమర్శించారు. రేంవత్ సిఎం అయ్యాక తెలంగాణ ప్రగతి ఆటోడిస్ట్రక్షన్‌ఖి (స్వయం విధ్వంసక) మోడ్‌లోకి వెళ్లిపోయిందని కేటీఆర్ ఆరోపించారు. పదేళ్లపాటు కష్టపడి ఖిబ్రాండ్ హైదరాబాద్‌ఖి, ఖిబ్రాండ్ తెలంగాణఖి ఇమేజ్‌ను బీఆర్ఎస్ నిర్మిస్తే, కొద్ది నెలల్లోనే దానిని కాంగ్రెస్ ప్రభుత్వం సర్వనాశనం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. కమీషన్ల మీద తప్ప పరిశ్రమలను నిలుపుకోవడం, కొత్త పెట్టుబడులను ఆకర్షించడంలో ఈ ప్రభుత్వానికి ఏమాత్రం పట్టింపు లేదని కేటీఆర్ మండిపడ్డారు. ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలకు తెలంగాణను ఏటీఎంగా మార్చి, ఇక్కడి సంపదను వారికి తరలించడం అనే పని మాత్రమే ఇవాళ ఆటోపైలట్ మోడ్‌లో నడుస్తోందని కేటీఆర్ విమర్శించారు. కేన్స్ టెక్నాలజీ సంస్థ గుజరాత్‌కు తరలిపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థతకు ఒక హెచ్చరిక మాత్రమే అన్న కేటీఆర్, ఇప్పటికైనా రేవంత్ కళ్లు తెరిచి పారిశ్రామిక ప్రగతిపై దృష్టి సారించాలని సూచించారు.

## పండుగ వేడుకకు విద్యుత్ షాక్



విద్యుత్ షాక్‌కు గురైన రథం

### శ్రీకృష్ణ రథయాత్రలో విషాదం
### ఐదుగురు మృతి, నలుగురికి తీవ్రగాయాలు
### హైదరాబాద్‌లో దుర్ఘటన
### బాధిత కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా: మంత్రి శ్రీధర్‌బాబు

**హైదరాబాద్(ఉప్పల్),ఆగస్టు 18, ప్రభాతవార్త:** ఆట పాటలు.. డప్పు చప్పుల్లు.. సన్నాయి వాయిద్యాలు.. కళాకారుల నృత్యాలతో ఎంతో ఘనంగా ప్రారంభమైన శ్రీకృష్ణుడి రథయాత్ర.. రెప్పపాటు సమయంలో తీవ్ర విషాదాన్ని నింపింది. విద్యుత్ షాక్ రూపంలో ఐదుగురిని బలి తీసుకొని, మృతుల కుటుంబాల్లో తీరని శోకాన్ని మిగిల్చింది. రామంతాపూర్‌లోని గోఖలేనగర్‌లో ఆదివారం నిర్వహించిన శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా రథాన్ని లాగుతుండగా విద్యుత్ తీగలు తగలడంతో ఐదుగురు మృతి చెందగా.. మరో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్ రామంతాపూర్‌లోని గోఖలేనగర్ యాదవసంఘం అధ్యక్షులు సర్వ రవీందర్ యాదవ్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణా >>2

## అష్టదిగ్బంధంలో 15 అటవీ గ్రామాలు

### స్తంభించిన రవాణా..
### నిత్యావసరాలు లేక అల్లాడుతున్న ప్రజలు
### పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు

**మహాముత్తారం, ఆగస్టు 18, ప్రభాతవార్త:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలంలోని అటవీ గ్రామాలు పూర్తిగా అష్ట దిగ్బంధం అయ్యాయి. వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. నిత్యవసరాలు లేక అటవీ గ్రామాల ప్రజలు అల్లాడుతున్నారు. గత మూడు, నాలుగు రోజుల నుండి కురుస్తున్న వర్షాల నేపథ్యంలో వాగులు తీవ్రతరంగా ఉప్పొంగి పోతున్నాయి. వాగులు ఉప్పొంగడంతో మహాముత్తారం మండలంలోని అనేక గ్రామాలు జలదిగ్బంధమయ్యాయి. కొన్ని ఇండ్లు కురుస్తున్న వర్షాలకు నేలమట్టమయ్యాయి. మూగ జీవాలు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో విగతజీవులవుతున్నాయి. వరి, పత్తి చేనులు నీట మునిగి అన్నదాతలకు నష్టం చేకూర్చాయి. మండలంలోని ఉట్లపల్లి-పోలారం మధ్య గల >>2



సోమవారం శ్రీశైలం ప్రాజెక్టు గేట్లు తెరిచి దిగువకు నీటిని విడుదల చేసిన దృశ్యం

## కృష్ణమ్మ ఉగ్రరూపం

### ప్రాజెక్టులకు భారీ వరద.. శ్రీశైలం 10 గేట్లు ఎత్తివేత
### జూరాల 30 గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 18, ప్రభాతవార్త:** కృష్ణమ్మ ఉగ్రరూపం దాల్చింది. ఎగువన కురుస్తున్న వర్షాలకు భారీ వరద వచ్చి చేరుతున్నది. దీంతో ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. కర్ణాటకలోకి ఆల్మట్టి డ్యాం 123.081 టీఎంసీలకుగానూ ప్రస్తుతం 116.700 టీఎంసీలకు చేరుకున్నది. అదేవిధంగా నారాయణపూర్ జలాశయం >>2


సోమవారం న్యూఢిల్లీలో ప్రధాని మోడీతో భేటీ అయిన శుభాంశు శుక్లా

## ప్రధాని మోడీతో వ్యోమగామి
# శుభాంశు భేటీ

**న్యూఢిల్లీ, ఆగస్టు 18:** అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం యాత్రను పూర్తి చేసుకొని స్వదేశానికి చేరుకున్న భారత వ్యోమగామి శుభాంశు శుక్లా సోమవారం ప్రధాని మోడీతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా శుభాంశు తన రోదసీ ప్రయాణ విశేషాలను ప్రధాని మోడీతో పంచుకున్నారు. యాత్ర విజయవంతంపై మోడీ ఆయనను అభినందించారు. 'శుభాంశు శుక్లాతో సంభాషణ గొప్పగా సాగింది. అంతరిక్షంలో ఆయన అనుభవాలు, శాస్త్రసాంకేతిక రంగాల్లో పురోగతి, భారత్‌కు చెందిన ప్రతిష్మాత్మక 'గగన్‌యాన్' మిషన్ సహా అనేక అంశాలపై చర్చించాం. రోదసిలో శుభాంశు సాధించిన ఘనత పట్ల యావత్ దేశం గర్విస్తోంది' అని ప్రధాని మోడీ ట్వీట్ చేశారు.
యాక్సియం-4 మిషన్‌లో భాగంగా జూన్ 25 నుంచ జూలై 15 వరకు శుభాంశు శుక్లా తన బృందంతో కలిసి 'ఐఎస్ఎస్' యాత్ర నిర్వహించిన విషయం తెలిసిందే. దీని కోసం శిక్షణ పొందుతూ యేడాదిగా ఆయన అమెరికాలో ఉన్నారు. ఆదివారం తెల్లవారుజామున భారత్‌కు తిరిగొచ్చారు. శుభాంశు అంతరిక్ష యాత్ర విజయవంతంపై లోక్‌సభలో ప్రత్యేకంగా చర్చించారు.

## అష్టదిగ్బంధంలో 15 అటవీ గ్రామాలు

>> రొడ్డాము ఉప్పొంగడంతో రాకపోకలు నిలిచి పోయాయి. ట్రాక్టర్‌ల ద్వారా ప్రజలు గ్యాస్ సిలీండర్‌లను తెలచ్చుకుంటు కాలం ఏల్లదీస్తున్నారు. అదేవిధంగా సింగారం-పందిపంపుల మధ్య గల కొండోని వాగు పొంగి పోర్లుతుంది. మండలంలోని సింగారం, స్థంభంపల్లి(పీకే), రేగులగూడెం, కొత్త రేగులగూడెం, పాత బోర్లగూడెం, గాజరాంపల్లి, పెగడపల్లి, ప్రేంనగర్, కనుకునూర్, రెడ్డిపల్లి, సింగంపల్లి, యత్నారం, నర్సింగాపూర్ గ్రామాలు జల దిగ్బంధంలో ఉన్నాయి. ఎవరి ఇండ్లలో వారు బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదీస్తున్నారు. కేశవపూర్-పెగడపల్లి మధ్య గల పెద్దవాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. కాగా బోర్లగూడెంలో వరద నీరు ఇండ్లలోకి చేరింది. దీంతో ప్రజలు నిరాశ్రయులుగా మిగిలిపోయారు. బాహ్య ప్రపంచం కనపడక అటవీ గ్రామాల ప్రజలు అల్లాడుతున్నారు. ఇలాగే మరికొన్ని రోజులు ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిస్తే మరింత తీవ్రతరంగా మారే అవకాశాలు ఉన్నాయి. ఓవైపున అడదడపగా అధికారులు సహాయక చర్యలు చేపడుతున్నా కానీ అట్టి సహాయాలు 100% వారికి అందడం లేదనే చెప్పుకోవచ్చు. పంచాయతీ కార్యదర్శులు క్షేత్ర స్థాయిలో ఉండాలని జిల్లా ఉన్నతాధికారులు ఆదేశించిన కానీ కొంతమంది అట్టి ఆదేశాలను బేఖాతరు చేస్తూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. సహాయక చర్యలు అందించడంలో తమకేంటిలే అన్నట్లు వారు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికార యంత్రాంగం జలదిగ్బంధమైన 15అటవీ గ్రామాలకు సహాయక చర్యలు చేపట్టి ఆదుకోవాలని జిల్లా కలెక్టర్‌ను వేడుకుంటున్నారు.

# కృష్ణమ్మ ఉగ్రరూపం

>> 30గేట్లు ఎత్తి దిగువకు 151605 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. పూర్తి సామర్థ్యం 33.313 టీఎంసీలకు గానూ ప్రస్తుతం 30.832 టీఎంసీలకు చేరింది. ఉమ్మడి పాలమూరులోని జూరాల, కోయిల్‌సాగర్,సంగంబండ గేట్లు ఎత్తివేశారు. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు సుంకేసుల, జూరాల డ్యాంల నుంచి భారీగా వరద వచ్చి చేరుతున్నది. సోమవారం సాయంత్రం 6గంటల సమాచారం మేరకు శ్రీశైలానికి జూరాల పవర్‌హౌజ్ ద్వారా 29707క్యూసెక్కులు, స్పిల్ వే ద్వారా 2,08,530క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 87,158క్యూసెక్కుల వరద జలాశయానికి చేరుకుంటున్నది. డ్యాం 10 గేట్ల 12అడుగుల మేర ఎత్తి దిగువ సాగర్‌కు నీటిని విడుదల చేస్తున్నారు. డ్యాం పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులకుగానూ 881.60అడుగులకు చేరగా, 215.8070 టీఎంసీలకు గానూ ప్రస్తుతం 191.0114టీఎంసీలకు చేరింది. డ్యాంకు 3,00,174క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదు కాగా 329145 క్యూసెక్కుల అవుట్ ఫ్లో నమోదైంది. విద్యుత్ ఉత్పత్తి కోసం 66,099క్యూసెక్కులు విడుదల చేయగా కుడి,ఎడమ జల విద్యుత్ కేంద్రాల వద్ద విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతున్నది.

**జూరాల 30గేట్లు ఎత్తివేత..**

ఉమ్మడి పాలమూరు వరప్రదాయిని జూరాలకు ఎగువన కర్ణాటకలో కురుస్తున్న భారీ వర్షాలకు ప్రాజెక్టులకు భారీ వరద వచ్చి చేరుతున్నది. ఎగువన కురుస్తున్న వర్షాలకు జూరాలకు వరద పోటెత్తుతున్నది. దీంతో 30గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయానికి 1,95,000క్యూసెక్కుల ఇన్ ఫ్లో నమోదైంది. జూరాల పూర్తి సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం జూరాలలో 4.805టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. పవర్‌హౌస్‌కు 29,707క్యూసెక్కులు, స్పిల్ వే ద్వారా 2,08,530క్యూసెక్కులు, కుడి కాలువకు 470 క్యూసెక్కులు నీటిని విడుదల చేశారు. జూరాల నుంచి 2,38,752క్యూసెక్కుల అవుట్ ఫ్లో నమోదైంది.

## సినిమా కేంద్రంగా హైదరాబాద్

>> సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, ఐటీ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి సంజయ్ కుమార్, డిప్యూటీ కార్యదర్శి భవేష్ మిశ్రా, టీ ఫైబర్ ఎండీ వేణు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి సబిత, కృపానందంకు హైకోర్టు నోటీసులు

>> హైకోర్టు ధర్మాసనం సోమవారం నాడు మాజీ మంత్రి సబితా రెడ్డి, విశ్రాంత ఐ ఎఎస్ అధికారి కృపానందం (ఈయన మూడేళ్ల క్రితమే పదవీ విరమణ చేశారు)లకు నోటీసులు జారీ చేసింది. అనంతరం ఈ కేసు విచారణను సెప్టెంబర్ నెలకు వాయిదా వేసింది.

# ముంబయికి రెడ్ అలర్ట్

### ఢిల్లీలో యమున ప్రళయప్రవాహం

### కొండచరియలు విరిగి ఇద్దరు మృతి

**హైదరాబాద్,ఆగస్టు 18,ప్రభాతవార్త:** వర్షాలు మంబయి నగరాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. రోడ్లన్నీ జలమయం కావడంతో ట్రాఫిక్ అంతరాయాల వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని రోజులుగా కురుస్తున్న వానలకు రోడ్లు, రైల్వే లైన్లు, దిగువ ప్రాంతాలు నీటితో నిండిపోయాయి. ఆగస్టు 21 వరకు మహారాష్ట్ర, ముంబయిలోని పలు ప్రాంతాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశముందని భారత వాతావరణ సంస్థ రెడ్ అలర్ట్ జారీ చేసింది. అత్యవసరమైతే తప్ప పౌరులు ఇళ్ల నుంచి బయటకు రావద్దని బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ విజ్ఞప్తి చేసింది. ముంబయిలోని పలు ప్రాంతాలు వరద నీటిలో చిక్కుకొనే అవకాశం ఉన్నందున పలు విమానయాన సంస్థలు అడ్వైజరీ జారీ చేశాయి. రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నందువల్ల ప్రయాణికులు కాస్త ముందుగానే విమానాశ్రయానికి చేరుకోవాలని ప్రముఖ విమానయాన సంస్థలు ఇండిగో , ఆకాశఎయిర్, స్పైస్ జెట్ ప్రయాణికులకు అడ్వైజరీ జారీ చేశాయి. రోడ్లన్నీ జలమయమైనందున విమానాశ్రయానికి వచ్చే ప్రయాణికులు బయల్దేరే ముందు విమానానికి సంబంధించిన వివరాలు తెలుసుకోవడానికి తమ వెబ్సైట్ను తనిఖీ చేసుకోవాలని ఇండిగో ప్రయాణికులకు సూచించింది. ప్రయాణికులు వీలైనంత త్వరగా విమానాశ్రయానికి చేరుకోవాలని ఆకాశ ఎయిర్లైన్స్ ప్రకటించింది. ఎప్పటికప్పుడు తమతమ ఎయిర్లైన్ల నుంచి తాజా సమాచారం తెలుసుకోవాలని స్పైస్ జెట్ ప్రయాణికులకు సూచించింది మహారాష్ట్రలో కురుస్తున్న కుండపోత వర్షాల వల్ల ఆదివారం తూర్పుశివారులోని విక్రోలీ పార్క్సైట్ ప్రాంతంలో కొండ చెరియలు విరిగిపడి ఇద్దరు మృతి చెందగా, అనేకమంది గాయపడినట్లు అధికారులు తెలిపారు. మృతులను శాలు మిశ్రా(19), సురేష్ మిశ్రా(50)లుగా గుర్తించామన్నారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో శనివారం 200 మి.మీ.ల కంటే ఎక్కువ వర్షపాతం నమోదైనట్లు పేర్కొన్నారు. హిమాచల్ ప్రదేశ్లో భారీ వర్షాలు అల్లకల్లోలం సృష్టిస్తున్నాయి. రాష్ట్రంలో వందల మార్గాలు మూసుకుపోగా, 1,000కి పైగా విద్యుత్తు ట్రాన్స్ ఫార్మర్లు దెబ్బతిన్నాయి. చాలాచోట్ల మెరుపు వరదలు, కొండచరియలు విరిగిపడుతున్నాయి.

## వారం - వర్జ్యం

19-08-2025, మంగళవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
శ్రావణ మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, కృష్ణపక్షం
ఏకాదశి మ.3.35
ఆరుద్ర రా.1.09
వర్జ్యం : మ.12.49-2.22
దు.ఉ.8.25-9.16, 2) రా.11.34-12.25
శుభసమయం: ఉ.6.30-7.15
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం :** సన్నిహితుల నుండి ఆహ్వానాలు అందుకుంటారు. ప్రయాణాలు.

**వృషభం :** భూ వివాదులు కుటుంబ సమస్యలు తీరి ఊరటచెందుతారు. ధన లాభం.

**మిథునం:** రాజకీయ రంగాలలోని వారికి యోగదాయకమైన కాలం. మధ్యవర్తిత్వం లభించదు.

**కర్కాటకం :** శ్రమకు తగిన ఫలితం ఉండదు. కొత్త కార్యక్రమాలు చేపట్టినా ముందుకు సాగవు.

**సింహం:** ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉంటుంది. ఆరోగ్య విషయంలో మెలుకువ అవసరం.

**కన్య :** కుటుంబ సమస్యలు కొంతవరకు తీరతాయి. ఇంటర్వ్యూలకు హాజరవుతారు.

**తుల :** పట్టుదలతో ముందుకు సాగుతారు. బంధువులనుండి ముఖ్య సమాచారం అందుకుంటారు.

**వృశ్చికం:** వృత్తి, వ్యాపారాలలో స్వల్ప మార్పులు వుంటాయి. నూతన పరిచయాలు పెరుగుతాయి.

**ధనుస్సు:** పోటీపరీక్షలలో విజయం సాధిస్తారు. వివాహ, ఉద్యోగ యత్నాలు ఫలిస్తాయి.

**మకరం:** అప్రయత్న కార్యసిద్ధి. ఆస్తి విషయంలో నూతన ఒప్పందాలు కుదురుతాయి.

**కుంభం:** హెూదాలు, ఉన్నత పదవుల్లో ఉన్నవారితో పరిచయాలు ఏర్పడతాయి.

**మీనం :** వ్యాపారాలు లాభాలబాటలో సాగుతాయి. ఆరోగ్యంపట్ల మెలుకువ అవసరం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# యూరియా ఇవ్వరా?

>> అడిగాం. వారు సమయం ఇవ్వకపోతే.. వారి కార్యాలయం ఎదుటే ఆందోళన చేస్తాం. కేవలం తెలంగాణ ఎంపీలే కాకుండా. మరో 25 మంది ఎంపీల మద్దతు కోరాం. వారు మనకు సహకరిస్తున్నారు. 21వ తారీఖు వరకు జీరో అవర్ మోషన్ ఇస్తాం. ధర్నాలు చేస్తాం. 3 లక్షల టన్నుల యూరియాను వెంటనే విడుదల చేయాలనేదే మా డిమాండ్. మేమే కాకుండా బీజేపీ ఎంపీలకు, ఎంఐఎం ఎంపీకి కూడా దీని గురించి వివరించాం. వారితో కలిసి నడ్డా దగ్గరకు వెళ్లి యూరియా కోసం పోరాడతాం. ఉద్దేశపూర్వకంగానే తెలంగాణకు యూరియా ఇవ్వడం లేదు. తెలంగాణకు చెందిన పెండింగ్ ఇష్యూలపైనా పవర్ పాయింట్ ప్రజంటేషన్ కూడా ఇస్తామని స్పష్టం చేశారు. ఎంపీ బలరాం నాయక్ మాట్లాడుతూ నేను స్టాండింగ్ కమిటీలో ఉన్నాను. నాతోపాటు ఈటల రాజేందర్ కూడా ఉన్నారు. ఎప్పుడు మీటింగ్ జరిగినా యూరియా సమస్యను లేవనెత్తుతున్నాను అని చెప్పారు. తెలంగాణలోని రామగుండంలో యూరియా ఫ్యాక్టరీ ఉంటే నోయిడాలో ఆఫీసు పెట్టారని ఆయన తెలిపారు. 40 మంది స్టాఫ్ రామగుండంలో కాకుండా నోయిడాలో పని చేస్తున్నారు. ఇదేంటని చాలాసార్లు ప్రశ్నించాం. గతంలో సెక్రెటరీని అడిగాను.. అలహాబాద్ లోనూ ఫ్యాక్టరీ ఉంటే.. అక్కడే ఆఫీసర్లు ఉన్నారు. కానీ.. రామగుండం పరిస్థితి అలా లేదు. కుట్ర ప్రకారమే బిజెపి తెలంగాణ రైతులకు యూరియా ఇవ్వడం లేదు. రామగుండంలో తయారైన యూరియాను తెలంగాణకు ఇవ్వడం లేదు. తెలంగాణకు చెందిన బిజెపి ఎంపీలు ఏం చేస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకురావాలనే యూరియాను ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఎంపి కిరణ్ కుమార్ మాట్లాడుతూ జూన్ చివరి వారంలో సీఎం రేవంత్ రెడ్డి కేంద్రమంత్రి నడ్డాను కలిశారు. జులైలోనే మొత్తం యూరియాను కేటాయించాలని కోరారు. ఆగస్టు వరకు ఆపితే అన్నదాతలు ఇబ్బందులు పడతారని అప్పట్లోనే చెప్పారు. ఆ తర్వాత మంత్రి తుమ్మల నాగేశ్వర రావు కూడా నడ్డాను కలిసి యూరియాను కేటాయించాలని కోరారు. అప్పట్లో యుద్ధం అని సాకు చెప్పారు. మళ్లీ పట్టించుకోలేదు. ప్రస్తుతం తెలంగాణలో రైతులంతా యూరియా కోసం తిప్పలు పడుతున్నారు. ఇది ప్రజా సమస్య. తెలంగాణకు చెందిన 8 మంది బిజెపి ఎంపీలు కూడా నడ్డా దగ్గరకు రావాలి. వారిలో ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నారు. వారు వీలైనంత వరకు ప్రెజర్ పెట్టాలి. మేమంతా చిత్తశుద్ధితో యూరియా కోసం ప్రయత్నాలు చేస్తున్నామని వ్యాఖ్యానించారు.ఎంపీ సురేష్ షెట్కర్ మాట్లాడుతూకాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లోనే యూరియా కొరత ఉంది. ఈ విధంగా ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలపై వివక్షచూపుతున్నారు. తెలంగాణ, కర్ణాటక రైతుల విషయంలో ఇలాంటి ఆలోచన మంచిది కాదు. రైతులకు మంచి చేయాలనే దృష్టితో బీజేపీ ఎంపీలకు కూడా విజ్ఞప్తి చేస్తున్నామని అన్నారు. ఎంపీ అనిల్ కుమార్ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి యూరియా కొరతను ముందే ఊహించి.. కేంద్రానికి విజ్ఞప్తి చేశారని ఢిల్లీ పాలకులు నిర్లక్ష్యంచేశారని అన్నారు. ఎంపీ వంశీకృష్ణ మాట్లాడుతూ బిజెపి పార్టీ రైతుల ద్రోహి అని ఏడాది కిందట జరిగిన ఎన్నికల సమయంలో చెప్పాం. దేశంలో ఓటు చోరీ జరిగిందో లేదో తెలియదు గానీ యూరియా చోరీ జరుగుతోంది.

# పండుగవేడుకకువిద్యుత్‌షాక్


సోమవారం హైదరాబాద్ రామంతపూర్‌లో విద్యుత్‌షాక్‌తో మృతిచెందినవారు

>> జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం 7 గంటలకు రామంతాపూర్ యాదవ సంఘం నుండి ప్రారంభమైన రథయాత్ర ర్యాలీని స్థానిక ప్రజాప్రతినిధులు, యాదవ సంఘం సభ్యులు, స్థానిక ప్రజలు భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. డప్పు మేళాలు, కళాకారుల నృత్య ప్రదర్శన మధ్య వైభవోపేతంగా కొనసాగిన రథయాత్ర ర్యాలీ ఆర్టీసీ కాలనీ, ఓల్డ్ రామంతాపూర్, ఎండోమెంట్ కాలనీ, అయ్యప్ప స్వామి గుడి మీదుగా తిరిగి యాదవ సంఘం వరకు తీసుకెళ్లే క్రమంలో రాత్రి 12:30 గంటల సమయంలో గమ్యస్థానానికి కొద్ది దూరంలో రథాన్ని తీసుకెళ్లే వాహనం మొరాయించింది. దీంతో మరో వాహనం కోసం ఎదురుచూసి, అది సమయానికి రాకపోవడం.. అప్పటికే అర్ధరాత్రి కావడం, మరోవైపు వర్షం కురుస్తుండటంతో అక్కడున్న యువకులు రథాన్ని నెట్టుకుంటూ ముందుకెళ్లారు. వర్షం, గాలి దుమారానికి కిందకు వేలాడిన హైటెన్షన్ వైర్లతో కూడిన డిష్ కేబుల్ కాపర్ వైర్లు మెటల్ ఫ్రేమ్‌తో ఉన్న రథానికి తగలడంతో నిప్పు రవ్వలు చెలరేగాయి. దీంతో రథాన్ని పట్టుకొని ఉన్న వారందరూ విద్యుతాఘాతానికి గురై చెల్లచెదురుగా పడిపోయారు. ఈ ఘటనలో మొత్తం తొమ్మిది మంది విద్యుత్‌షాక్‌కు గురవడంతో వెంటనే అప్రమత్తమైన స్థానికులు కింద పడిపోయిన వారికి సీపీఆర్ చేసి వారి ప్రాణాలు కాపాడే ప్రయత్నం చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని విద్యుదాఘతానికి గురైన 9 మందిని స్థానిక ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అందులో ఐదుగురు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మరో నలుగురు ప్రాణాలతో బయటపడగా వారికి ప్రథమ చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం వివిధ ఆసుపత్రులకు తరలించారు. ఈ ఘటనలో రథంపై ఉన్న పూజారితో పాటు మరికొందరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. గాయపడిన వారిలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి గన్‌మెన్ శ్రీనివాస్ కూడా ఉన్నారు. 30 సంవత్సరాల నుంచి శ్రీ కృష్ణా జన్మాష్టమి వేడుకలు నిర్వహిస్తున్నామని.. ప్రతి సంవత్సరం ఊరేగింపు చేస్తామని.. కానీ, ఇలాంటి ఘటన ఎన్నడూ చోటుచేసుకోలేదని, ఐదుగురి ప్రాణాలు కోల్పోవడం దురదృష్టకరమని యాదవ సంఘం సభ్యులు పేర్కొన్నారు. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు. మృతదేహాలకు గాంధీ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు.

**విద్యుదాఘతంతో ప్రాణాలు కోల్పోయిన వారు..**

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మృతిచెందిన వారిలో రామంతాపూర్‌కు చెందిన 1. శ్రీకాంత్‌రెడ్డి(35), 2. సురేష్ యాదవ్(34), 3. క్రిష్ణ యాదవ్(21) అలియాస్ డైమండ్ క్రిష్ణ, హబ్సిగూడకు చెందిన 4. రాజేంద్రరెడ్డి(48), 5. రుద్ర వికాస్(39)లు ఉన్నారు. అలాగే ప్రమాదంలో గాయపడిన వారు.. రామంతాపూర్‌కు చెందిన 1. సూర్వ రవీందర్ యాదవ్, 2. మహేష్, 3. వి.శ్రీనివాస్(కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి గన్‌మెన్), 4. గణేష్ ఉన్నారు.

**రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా : మంత్రి శ్రీధర్‌బాబు**

రామంతాపూర్ ఘటనపై మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఇంచార్జ్ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పందించారు. మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ప్రమాదంలో మరణించిన ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున పరిహారం ఇవ్వనున్నట్లు శ్రీధర్ బాబు ప్రకటించారు. అంతకుముందు గాంధీ ఆసుపత్రి మార్చురీ వద్ద మృతుల కుటుంబాలను పరామర్శించారు. ఈ ఘటనలో గాయపడిన క్షతగాత్రులకు ప్రభుత్వం తరపున మెరుగైన వైద్యం అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేసి సమగ్ర నివేదిక ఇవ్వాలని జీహెచ్ఎంసీ కమిషనర్, జిల్లా కలెక్టర్‌లను మంత్రి ఆదేశించారు. ప్రమాదానికి కారణమైన విద్యుత్ తీగలను తక్షణమే తొలగించాలని సంబంధిత విభాగాల అధికారులను ఆదేశించారు.
ఉప్పల్ రామంతపూర్‌లోని గోఖలేనగర్‌లో కృష్ణాష్టమి వేడుకల సందర్భంగా జరిగిన విషాద ఘటన నేపథ్యంలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని సందర్శించడానికి వచ్చిన విద్యుత్ శాఖ సీఎండీని స్థానికులు అడ్డుకున్నారు. విద్యుత్ శాఖ నిరక్ష్యంల్ల వల్లే ఈ ప్రమాదం జరిగిందని ఆరోపిస్తూ నిరసన తెలిపారు. "విద్యుత్ శాఖ డౌన్ డౌన్" అంటూ నినాదాలు చేస్తూ ఆందోళనకారులు నిరసన ర్యాలీకి ప్రయత్నించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు రంగప్రవేశం చేసి ఆందోళనకారులను చెదరగొట్టారు. ఈ క్రమంలో పోలీసులకు, స్థానికులకు మధ్య వాగ్వాదం జరిగింది. మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ పలువురు పార్టీ నేతలు ప్రధాన రహదారిలో రాస్తారోకో నిర్వహించారు. కాగా, పోలీసులు ఆందోళనకారులను సముదాయించి ర్యాలీని విరమింపజేశారు.


బీహార్‌లోని ససారాంలో నిర్వహించిన 'ఓటరు అధికార్ యాత్ర'లో పాల్గొన్న రాహుల్ గాంధీ

# ఏకగ్రీవంగా ఉపరాష్ట్రపతి?

>> ఉప రాష్ట్రపతి పదవీకాలం ఐదు సంవత్సరాలు. పార్లమెంటు ఉభయ సభల ఎంపీలతో కూడిన ఎలక్టోరల్ కాలేజీ ద్వారా ఉపాధ్యక్షుడిని ఎన్నుకుంటారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 64, 68 నిబంధనల ప్రకారం ఎన్నికలు నిర్వహిస్తారు. ఉపరాష్ట్రపతిగా రాధాకృష్ణన్‌ను ఏకగ్రీవంగా ఎంపికయ్యేందుకు ఎన్డీయే ప్రభుత్వం తీవ్ర కృషి చేస్తోంది. పార్టీ తరఫున కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజనాథ్ సింగ్ వివిధ పార్టీల నేతలకు ఫోన్లు చేసి తమ ఎన్డీయే అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని, ఏకగ్రీవంగా ఎంపికయ్యేందుకు మద్దతు ఇవ్వాలని ఫోన్లు చేస్తున్నారు. ఎన్‌డీఏ ఉపరాష్ట్రపతి అభ్యర్థికి మద్దతివ్వాలని ఏఐసిసి మల్లి ఖార్జున ఖర్గేను రాజ్‌నాథ్ కోరినట్లు సమాచారం. రెండు సార్లు కోయంబత్తూరు నుంచి లోక్‌సభ ఎంపీగా విధులు నిర్వర్తించిన సీపీ రాధాకృష్ణన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని ఇప్పటికే విపక్షాలను నడ్డా కోరారు. మరోవైపు ఎన్‌డీఏ తరఫున ఉపరాష్ట్రపతి ఎన్నికను రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ పర్యవేక్షిస్తారని తెలిసింది. పోలింగ్ ఏజెంట్‌గా పార్లమెంటరీ వ్యవహారాలశాఖ మంత్రి కిరణ్ రిజిజు వ్యవహరిస్తారని సమాచారం. సీపీ రాధాకృష్ణన్ తమిళనాడకు చెందిన వ్యక్తి కావడం వల్ల ఆ రాష్ట్రంలోని అధికార డీఎంకే నుంచి మద్దతు లభిస్తుందని బీజేపీ భావిస్తోంది. ఈ క్రమంలోనే విపక్షాలు ఎలాంటి వైఖరిని అనుసరిస్తాయన్నది ఆసక్తికరంగా మారింది. ఈ నేపథ్యంలో భారత రాష్ట్రపతి ఎన్నిక ఉత్కంఠగా మారింది. ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్‌ను ఎంపిక చేయడం పట్ల తమిళనాడు అధికార డీఎంకె సీనియర్ నేత టీకేఎస్ ఇళంగోవన్ కీలక వ్యాఖ్యలు చేశారు. రాధాకృష్ణన్ తమిళనాడుకు చెందిన వ్యక్తి అయినప్పటికీ ఈ నిర్ణయం వల్ల తమ రాష్ట్రానికి ప్రత్యేకంగా జరిగే మంచి ఏమీ ఉండదని అభిప్రాయపడ్డారు. తమకు ఎలాంటి ప్రయోజనం లేనప్పుడు రాధాకృష్ణన్ అభ్యర్థిత్వానికి మద్దతు ఇవ్వాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. ఉప రాష్ట్రపతి ఎన్నిక విషయంలో ఇండియా కూటమి తీసుకున్న నిర్ణయానికే తమ పార్టీ కట్టుబడి ఉంటుందని తెలిపారు. ఇప్పటివరకు తమిళనాడును అన్నివిధాలుగా అవమానిస్తున్న కేంద్రం, వచ్చే ఏడాది రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు ఉన్న తరుణంలోనే తమిళులకు మేలు చేశామని చెప్పుకోవడానికి ఈ నామినేషన్ అంశాన్ని తెర పైకి తీసుకువచ్చిందని ఇళంగోవన్ ఆరోపించారు. ఉప రాష్ట్రపతి పదవిలో కొత్తగా నియమితులయ్యే వ్యక్తి ఆ హోదాలో ఐదేళ్లు కొనసాగుతారని చెప్తున్నప్పటికీ, రెండేళ్ల తర్వాత మరో వ్యక్తికి ఆ పదవిని కట్టబెడతారని వ్యాఖ్యానించారు. బీజేపీ ఎన్ని కుట్రలు పన్నినా రాష్ట్రంలో ఆ పార్టీని అధికారంలోకి రానివ్వమని అన్నారు. మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ను ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ప్రకటించడంపై శివసేన ఉద్ధవ్ వర్గం నేత సంజయ్ రౌత్ స్పందించారు. ఆయన అభ్యర్థిత్వాన్ని స్వాగతిస్తున్నామని, కానీ ఎన్డీఏ అభ్యర్థి కావడం వల్ల ఆయనకు మద్దతు ఇవ్వలేమని అన్నారు. మహారాష్ట్రకు సంబంధం ఉన్న వ్యక్తులు ఇలాంటి రాజ్యాంగ పదవులకు ఎంపిక అయితే ఆనందిస్తామని చెప్పారు. తాము ఇండియా కూటమిలో ఉన్నందున ఎన్డీఏ అభ్యర్థికి మద్దతు ఇవ్వబోమని స్పష్టం చేశారు. ఇప్పటికే ఈ అంశంపై ఉద్ధవ్ ఠాక్రేతో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ మాట్లాడారని పేర్కొన్నారు.

## 'వ్యవసాయ కార్మికుల పిల్లలకు 15శాతం రిజర్వేషన్'

**హైదరాబాద్, అగస్టు 18, ప్రభాతవార్త :** తెలంగాణలోని వ్యవసాయ కార్మికుల పిల్లలకు వ్యవసాయ కోర్సుల్లో 15శాతం రిజర్వేషన్లు అమల్లోకి రానున్నాయి. తొలిసారిగా వ్యవసాయ కార్మికుల పిల్లల కోసం బీఎస్సీ (అగ్రికల్చర్), బీటెక్ (ఫుడ్ టెక్నాలజీ) కోర్సుల్లో 15శాతం సీట్లను ప్రత్యేక కోటాగా కేటాయించినట్లు వ్యవసాయ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ విద్యాసాగర్ సోమవారం వెల్లడించారు. అగ్రికల్చర్, హార్టికల్చర్, వెటర్నరీ యూనివర్సిటీల పరిధిలోని వ్యవసాయ, అనుబంధ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఈనెల 19 నుంచి 23వ తేదీ వరకు ఫస్ట్ ఫేజ్ జాయింట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామన్నారు. హైదరాబాద్ రాజేంద్రనగర్ లోని అగ్రికల్చర్ వర్సిటీ ఆడిటోరియంలో ఆయా తేదీల్లో ఉదయం 9.30 గంటలకు కౌన్సెలింగ్ జరగనుందని చెప్పారు. ఇక నాల్గో తరగతి నుంచి 12వ తరగతి వరకు కనీసం నాలుగేళ్లు ప్రభుత్వ స్కూళ్లు, కాలేజీలు లేదా రెసిడెన్షియల్ స్కూళ్లలో చదివిన విద్యార్థులు ఈ కోటాకు అర్హులని వివరించారు. విద్యార్థి లేదా వారి తల్లిదండ్రుల పేరిట రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన గ్రామీణ ఉపాధి హామీ పథకం కార్డు ఉండాలన్నారు. అలాగే విద్యార్థి, వారి తల్లిదండ్రులు లేదా తాతల పేరిట ఎలాంటి వ్యవసాయ భూమి ఉండకూడదని స్పష్టం చేశారు. అయితే, ఒక ఎకరం భూమి ఉన్నవారు ఈ అర్హతలు కలిగి ఉంటే 15 శాతం కోటాకు అర్హులని పేర్కొన్నారు. కౌన్సెలింగ్ కు హాజరయ్యే విద్యార్థులు అర్హతలకు సంబంధించి అన్ని సర్టిఫికెట్లు తప్పనిసరిగా వెంట తెచ్చుకోవాలని రిజిస్ట్రార్ తెలిపారు.

# హాలో! మోడీజీ!

>> భారత్ మొదటి నుంచి పిలుపునిస్తోంది. ఈవిషయంలో అన్ని ప్రయత్నాలకు మద్దతు ఇస్తాం' అని ప్రధాని మోడీ ట్వీట్ చేశారు.ప్రధాని మోడీ, పుతిన్‌లు మాట్లాడుకోవడం పది రోజుల్లో ఇది రెండోసారి. ఈ నెల 8న కూడా ఇరు నేతలు ఫోన్‌లో సంభాషించారు. ఈ సందర్భంగా ఉక్రెయిన్‌కు సంబంధించి తాజా పరిస్థితులను మోడీకి పుతిన్ వివరించినట్లు తెలిసింది. ఈ సంక్షోభం ముగింపునకు శాంతియుత చర్చలే పరిష్కార మార్గమని భారత్ తన వైఖరిని మరోసారి స్పష్టం చేసినట్లు పిఎంఒ వెల్లడించింది.
ఉక్రెయిన్ యుద్ధం ఆపేందుకు అలాస్కా వేదికగా ఇటీవల ట్రంప్, పుతిన్ మధ్య రెండున్నర గంటలకుపైగా జరిగిన చర్చలు ఎటూ తేలకుండానే ముగిసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్, బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ తదితర ఐరోపా నేతలు వాషింగ్టన్ వేదికగా ట్రంప్‌తో సమావేశం కానున్నారు.

## వాహనాలపై జీవిత పన్ను పెంపు

>> టాక్స్ వసూలు చేస్తారు. రూ.1.10లక్షల బైక్ కొంటే ఇంతకు ముందు రూ.13,200 పన్ను ఉండగా, ఇప్పుడు అది 16,500కి పెరిగింది. నాన్ ట్రాన్స్‌పోర్ట్ నాలుగు చక్రాల వాహనాలపై కూడా ప్రభుత్వం భారీగా పన్ను పెంచింది. రూ.5లక్షల లోపు ధర కలిగిన కార్లపై 13శాతం, 10 నుంచి 20లక్షల మధ్య కార్లపై 18శాతం,20 నుంచి 50లక్షల మధ్య వాహనాలపై 20శాతం,50లక్షలకు పైబడిన లగ్జరీ కార్లపై 21శాతం లైఫ్ టాక్స్ అమల్లోకి తెచ్చారు. అదనంగా కంపెనీల పేరుతో కొనుగోలు చేసే వాహనాలు,రెండో వాహనంపై మరింత ఎక్కువ పన్ను విధించనున్నారు. కొన్ని కేటగిరీలలో ఇది 25శాతం వరకు ఉండొచ్చు.ఈ పెంపుతో ప్రభుత్వం 2025-26 ఆర్థిక సంవత్సరంలో సుమారు రూ.4,350 కోట్ల ఆదాయాన్ని లైఫ్ టాక్స్ రూపంలో సమీకరించనుందని అంచనా. కానీ ఈ నిర్ణయాన్ని బిఆర్ఎస్ నేత హరీశ్‌రావు తీవ్రంగా విమర్శించారు. పేద,మధ్యతరగతి వర్గాలపై ఇది మరింత భారమని, చిన్న వ్యాపారులు,రైతులు నష్టపోతారని ఆయన వ్యాఖ్యానించారు. అయితే విద్యుత్ వాహనాలపై మినహాయింపు ఇచ్చి వాటిపై ఎలాంటి లైఫ్ టాక్స్ వసూలు చేయరని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ రాయితీ 2026 డిసెంబర్ 31 వరకు కొనసాగుతుంది.

## 65 లక్షల ఓటర్ల పేర్లు వెల్లడి

>> వారు డిమాండ్ చేశారు. ఇప్పుడు ఇసి ఆ వివరాలు ప్రకటించినా, 'ఓట్ల చోరీ' ఆరోపణలను విపక్షాలు మరింత బలంగా వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్‌పై అభిశంసనకు ప్రతిపక్షాలు సిద్ధమవుతున్నట్లు సమాచారం. కాంగ్రెస్ ఎంపి ఇమ్రాన్ ప్రతాప్‌గఢీ మాట్లాడుతూ.. దీనిపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. అయితే చట్టపరంగా సిఇసిని తొలగించాలంటే పార్లమెంట్ ఉభయ సభల్లో మూడింట రెండొంతుల మెజారిటీ అవసరం. ప్రస్తుతానికి ప్రతిపక్షాలకు అంతమంది సభ్యులు లేనందున ఈ ప్రయత్నం ఎంతవరకు సాధ్యమవుతుందో అనుమానం వ్యక్తమవుతోంది. మరోవైపు ఓట్ల చోరీపై రాహుల్ గాంధీ ఆందోళన కార్యక్రమం ప్రారంభించగా.. దీనిపై స్పందించిన జ్ఞానేశ్‌కుమార్ ఆదివారం ఎన్నికల కమిషనర్లు సుఖ్బీర్‌సింగ్ సంధు, వివేక్‌జోషిలతో కలిసి మీడియా ముందుకొచ్చారు. రాహుల్ ఆరోపణలను ఖండిస్తూ, ఆయన తగిన ఆధారాలు సమర్పించాలని డిమాండ్ చేశారు. వారం రోజుల్లో ప్రమాణపత్రం రూపంలో సంతకంతో ఆధారాలు ఇవ్వాలని, లేకపోతే ప్రజల్లో క్షమాపణ చెప్పాలని హెచ్చరించారు. ఆధారాలు లేకపోతే ఆరోపణలను నిరాధారంగా పరిగణిస్తామని స్పష్టం చేశారు.

### దివంగత నటుడు కోట శ్రీనివాసరావు

## భార్య రుక్మిణి ఆకస్మిక మృతి



**హైదరాబాద్, ఆగస్టు 18 ప్రభాతవార్త:** దివంగత నటుడు కోట శ్రీనివాసరావు సతీమణి కోట రుక్మిణి హఠాన్మరణం చెందారు. అనారోగ్య కారణాలతో ఆమె మృతి చెందినట్లు సమాచారం. ఇటీవలే కోట శ్రీనివాసరావు చనిపోవడంతో అప్పటినుంచి ఆమె ఆరోగ్యం మరింతగా క్షీణించినట్లు తెలుస్తోంది. రుక్మిణి వయస్సు 75 సంవత్సరాలు.సోమవారం మధ్యాహ్నం ఒంటిగంటప్రాంతంలో రుక్మిణి కన్నుమూశారు. ఈమేరకు కుటుంబసభ్యులు అధికారికంగా ప్రకటించారు.జూబ్లీహిల్స్ మహాప్రస్థానం స్మశాన వాటికలో కోట అంత్యక్రియలు జరిగాయి. కోట శ్రీనివాసరావు, రుక్మిణి దంపతులకు ముగ్గురు సంతానం. కుమారుడు, ఇద్దరు కుమార్తెలు. కొడుకేమో ఏంటంటే..కోట శ్రీనివాసరావు దంపతులకు పుత్ర శోకం వాళ్ల బతికి ఉన్నంత కాలం ఒక చేదు జ్ఞాపకంలా మిగిలిపోయింది. 2010 జూన్ 10న కోట శ్రీనివాసరావు కుమారుడు కోట వెంకట ఆంజనేయ ప్రసాద్ హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఈ బాధతో కోట శ్రీనివాసరావు, ఆయన భార్య రుక్మిణి ఏళ్ల తరబడి కుమిలిపోయారు. కోట శ్రీనివాసరావు జీవిత చరమాంకంలో దీర్ఘకాలిక అనారోగ్యసమస్యలు ఇబ్బందిపెట్టాయి. ఆయన తన83వ పుట్టినరోజు జరిగిన మూడు రోజులకే ప్రాణాలు కోల్పోవడం ఇండస్ట్రీలోని ఆయన సన్నిహితులను, కోట నటనను అభిమానించే సినీ ప్రేక్షకులను శోక సంద్రంలోకి నెట్టేసింది. జీవిత భాగస్వామి ఈ లోకాన్ని వీడిన తక్కువ వ్యవధిలోనే కోట శ్రీనివాసరావు భార్య రుక్మిణి కూడా కాలం చేశారు.

# రేపటి నుంచి సిపిఐ రాష్ట్ర 4వ మహాసభలు

### 22 వరకు కొనసాగింపు..
### చివరి రోజు నూతన కమిటీ ఎన్నిక
### మేడ్చల్ జిల్లా గాజులరామారంలో కార్యక్రమాలు
### వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా డిసెంబర్‌లో ఖమ్మంలో లక్షలాది మందితో బహిరంగ సభ
### సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు




**హైదరాబాద్, ప్రభాతవార్త, ఆగస్టు 18:** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలు రేపటి నుంచి ప్రారంభం కానున్నాయి. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా గాజుల రామారంలోని మహారాజ గార్డెన్స్‌లో ఈ నెల 22 వరకు మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నట్లు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు తెలిపారు. హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం ముఖ్దూంభవన్‌లో సోమవారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, పశ్యపద్మ, జాతీయ కౌన్సిల్ సభ్యులు పల్లా వెంకటరెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, కార్యదర్శివర్గ సభ్యులు బి.ఎస్.బోస్, ఈటి నరసింహ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.జి. సాయిల్ గౌడ్, మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షులు ఎం.డి.యూసుఫ్, ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్, సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి బి.స్టాలిన్, కౌన్సిల్ సభ్యులు దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు. 100 ఏళ్ల ఘనమైన చరిత్ర ఉన్న సిపిఐ రాష్ట్ర 4వ మహాసభలు ఈ నెల 20(బుధవారం) ప్రారంభంకానున్నాయని... మూడు రోజుల పాటు జరిగే మహాసభల్లో 743 ప్రతి నిధులతో పాటు ప్రత్యేక ఆహ్వానితులు కలిపి 1000 మంది పాల్గొంటారని తెలిపారు. మహాసభల్లో భాగంగా బుధవారం ఉదయం 9 గంటలకు జీడిమెట్ల పోలీస్ స్టేషన్ నుండి మహాసభల వేదికైన మహారాజ గార్డెన్స్ వరకు రెడ్ ఫ్లాగ్ మార్చ్ ఉంటుందన్నారు. ప్రదర్శన అనంతరం ఉదయం 10 గంటలకు పార్టీ సీనియర్ నాయకులు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు కందిమళ్ల ప్రతాపరెడ్డి అరుణ పతాకాన్ని ఎగురవేయనుండగా 10.15గంటలకు ప్రముఖ కవి, నవ చేతన పబ్లిషింగ్ హౌస్ సంపాదకులు ఏటుకూరి ప్రసాద్ మృతవీరుల స్థూపాన్ని ఆవిష్కరిస్తారని తెలిపారు. ఉదయం 11గంటలకు రాష్ట్ర 4వ మహాసభలను పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డి రాజా ప్రారంభిస్తారన్నారు. రాష్ట్ర 4వ మహాసభల ప్రాంతానికి ఏఐటీయుసి సీనియర్ నాయకులు దివంగత పొట్లూరి నాగేశ్వరరావు నగర్‌గా నామకరణం చేసినట్లు సాంబశివరావు తెలిపారు.

అదేవిధంగా మహాసభల ప్రాంగణానికి సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దివంగత ఎన్.బాలమల్లేష్ పేరును, భోజనశాలకు మేడ్చల్ జిల్లా నాయకులు దివంగత రోయ్యాల కృష్ణమూర్తి, కె.సహాదేవ్‌ల పేర్లను పెట్టామని వెల్లడించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు మహాసభల వేదికగా ఉద్యమ కార్యాచరణను రూపొందించుకో నున్నామని కూనంనేని తెలిపారు. ముఖ్యంగా మతోన్మాద పార్టీ అయిన బిజెపి ఫాసిస్టు విధానాలను అనుసరిస్తూ మతం, కులం, జాతి, భాషా పేర్లతో చిచ్చు పెడుతూ దేశ ప్రజలను చీల్చిందుకు కుట్ర పనుతోందన్నారు. రాష్ట్రంలోకాంగ్రెస్ ప్రభుత్వంప్రభుత్వ రంగ సంస్థను నిర్వీర్యం చేసి ప్రైవేట్ పరం చేసేందుకు ప్రయత్నిస్తోందన్నారు. ఇప్పటికీ ఆర్‌టిసిలో ఎన్నికలు నిర్వహించకపోవడం అప్రజాస్వామికమని, అదేవిధంగా అసంఘటిత కార్మికులను ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఈ సమస్యలపై మహాసభల అనంతరం ఉద్యమించనున్నట్లు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి సిపిఐ, సిపిఎం పార్టీతో పొత్తు ఉంటుందని, అదేవిధంగా కాంగ్రెస్‌తో స్నేహబంధం కొనసాగుతుందని తెలిపారు.




ఆప్ కార్యకర్తలను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

## బిసి రిజర్వేషన్ల బిల్లును రాష్ట్రపతి ఆమోదించాలి

### రాజ్‌భవన్ ముట్టడికి ఆమ్ ఆద్మీ పార్టీ నేతల యత్నం

### పలువురు అరెస్ట్, పంజాగుట్ట పిఎస్‌కు తరలింపు

**హైదరాబాద్, ఆగస్టు 18,ప్రభాతవార్త:** స్థానిక సంస్థల ఎన్నికల్లో, విద్యా, ఉద్యోగ రంగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ రాష్ట్రపతి ఆమోదించాలని అలాగే ఈ బిల్లులను కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్లో చేర్చి తెలంగాణ రాష్ట్రంలోని బీసీ లకు సామజిక న్యాయం దక్కేలా చూడాలని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ డిమాండ్ చేసారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ రాష్ట్రపతి ఆమోదించాలని, కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్లో చేర్చాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్, రాజ్ భవన్ వద్ద సోమవారం ఆమ్ ఆద్మీ పార్టీ "చలో రాజ్ భవన్" కార్యక్రమాన్ని నిర్వహించింది. ఆప్ శ్రేణులు ప్లకార్డులు పట్టుకుని పెద్దఎత్తున నినాదాలు చేస్తూ రాజ్ భవన్ వైపు దూసుకరాగా, పోలీసులు అడ్డుకోవడంతో తోపులాట జరిగి పరిస్థితి ఉద్రిక్తత దారితీసింది. దీంతో బలవంతగా పోలీసులు వారిని అరెస్ట్ చేసి పంజాగుట్ట పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా డాక్టర్ దిడ్డి సుధాకర్ మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లు తెలంగాణ శాసనసభ ఆమోదించి, గవర్నర్ ద్వారా రాష్ట్రపతి ఆమోదం కోసం పంపడం జరిగిన రాష్ట్రపతి, కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. 100 వందమంది ఉన్న కాంగ్రెస్ ఎంపీలు ఈ సమస్యపై పార్లమెంట్ లో కేంద్ర ప్రభుత్వాన్ని ఎందుకు నిలదీయడంలేదని అయన ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్లపై ఆర్డినెన్స్ ను ఆమోదించే అధికారం గవర్నర్‌కు ఉన్న, అది చేయకుండా రాష్ట్రపతికి పంపించడం దేనికి సంకేతం అని ప్రశ్నించారు. బీజేపీ కపట నాటకంలో భాగంగానే గవర్నర్ రాష్ట్రపతికి పంపించాడని, బిసిలకు 42 శాతం రేజర్వేషన్లు పై బిజెపి ద్వంద వైఖరి అవలంబిస్తోందని మండిపడ్డారు. బీజేపీ కేంద్ర మంత్రులు, నేతలు 9వ షెడ్యూల్లో చేర్చాలని కేంద్ర ప్రభుత్వంపై ఎందుకు ఒత్తిడి తేవడంలేదని అయన ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకొని బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ పంపిన బిల్లులను కల్పించాలని అయన డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో ఎండి. మజీద్. డా. అన్సారీ, అబ్దుల్ ముక్తధీర్, జావేద్ షరీఫ్, సుధారాణి, రమ్యగౌడ్, జె. నాగరాజ్ , రాకేష్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎక్సైజ్‌శాఖలో బదిలీల కోసం 2 వేల మంది ఎదురు చూపులు

**హైదరాబాద్,ఆగస్టు.18,ప్రభాతవార్త:** భార్యాభర్తలిద్దరూ ఎక్సైజ్ శాఖలో ఉన్నతస్థాయి. ఉద్యోగులే. కంటి చూపులేని తల్లి. ఐదేండ్లలోపు ఇదరు చిన్నారులు.. కొన్నేండ్లుగా ఉద్యోగ విధుల్లో చెరోచోట ఉనెట్లుకొస్తూ ఉన్నారు. ఇప్పుడు వారికీ అనారోగ్య సమస్యలు తోడయ్యాయి. భార్య, భర్త శాఖ అయినా స్పౌజ్ క్యాట గిరిలో బదిలీకి దరఖలస్తు చేసుకున్నాల శాఖ పట్టించుకునే దిక్కులేదు. భార్యాభర్తలు వేర్వేరుగా విధుల్లో ఉన్నాదువు మనస్థాపంతో ఒకానొక దశలో ఆ ఉద్యోగి ఆత్మహత్యకు యత్నించడాన్ని చూసి ఆ కుటుంబం మొత్తం తల్లడిల్లిపోయింది.. ఇదీ ఎక్సైజ్ శాఖలో ఓ ఇద్దరి వ్యథ.. ఇలాంటి వారు 2,000మంది వరకూ ఉన్నారు.బదిలీల కోసం వేయికండ్లతోఎదురుచూస్తూ ఉన్నారు. మంత్రి ఆదేశాలు ఇచ్చినా, సంబంధిత అధికారులు బదిలీలు చేపట్టకపోవ డంతో ఉద్యోగుల కుటుంబాలు తీవ్ర అవస్థలు పడుతున్నాయి. ఈ శాఖలో పనిచేసే వివాహితలైన మహిళా కానిస్టేటుకు ఎండ్ల తరబడి తమ కుటుంబాలకు దూరంగానే ఉంటున్నారు. ఈ శాఖలో గడిచిన 8 సంవత్సరాలుగా కానిస్టేబుళ్లకు బదిలీలే లేవు. ఎక్సైజ్ శాఖలో బదిలీలు త్వరితగతిన పవిట్టాలకు తో శాఖ మంత్రిజూపల్లి కృష్ణయ్యలను నాలుగైదుసార్లు ఆదికారులను హెచ్చరించారు. ఆయన కిందిస్థాయి అందుకు సంబంధించిన ఏర్పాట్లన్నీ పూర్తి చేశారు. 2017లో కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన జీవో నంబర్ 143 ప్రకారం బదిలీలకు రంగం సిద్ధమైంది. దీంతో నాలుగు రోజుల్లోనే ఎక్సైజ్ శాఖలో బదిలీలు అంటూ మంత్రి ప్రచారం కూడా చేసున్నారు.అయితే ఇది జరిగి రెండు నెలలైనా అందుకు సంబంధించి ప్రక్రియ ఎక్కడవేసిన గొంగళి అక్కడే ఉన్నచందంగా మారింది. ఇందుకు సంబంధించిన ప్రక్రియపై ఆరా తీయగా అసలు 143 డియాక్టివేట్ అయిందని తేలింది. మళ్లీ పెద్దలను ప్రక్రియ చేపడితేనే ఆ జీవో ప్రకారం బదిలీలు అవుతాయి. ఆ దిశగా ఏర్పాట్లు చేయాలిస్న అధికారుల తీవ్ర నిర్లక్ష్యంతోనే మనగుడలో లేని జీవో 143 ప్రకారం బదిలీల ప్రక్రియ చేపట్ట డంపై ఎక్సైజ్ అధికారులు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు.

**మంత్రి ఒఎస్డీ అడ్డుపడుతున్నారు:రాచాల యుగందర్ గౌడ్ :** రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వంలో అన్ని శాఖల ఉద్యోగులు పదోన్నతులు, బదిలీలతో సంతోషంగా ఉంటే ఎక్సైజ్ శాఖలోని ఉద్యోగులకు పదోన్నతులు, బదిలీలు లేక తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని బిసి పొలిటికల్ జెవెసి రాష్ట్ర ఛైర్మన్ రాచాల యుగందర్ గౌడ్ ఒక ప్రకటనలో విచారం వ్యక్తం చేశారు.డిపిసి గడుపు ఈ నెల 31వ తేదీతో ముగుస్తుందని, ఈలోగా పదోన్నతులు, బదిలీలు చేయకపోతే మళ్ళీ ఒక ఏడాది పడుతుందని, మూడు డిపార్ట్మెంట్లు వెరిఫై చేసి నెల రోజులు గడిచినప్పటికి మంత్రి ఓఎస్టీ అడ్డుపడుతున్నారని ఆయన ఆరోపించారు.8 సంవత్సరాలుగా బదిలీలు జరగకపోవడంతో ఎక్సైజ్ కానిస్టేబుల్స్ తీవ్ర మనోవేదనకు గురవుతున్నారన్నారు.డిప్యూటి కమిషనర్లు జాయింట్ కమిషనర్లుగా పదోన్నతులు పొందితే..ఆమ్యామ్యాలు రావని మంత్రి సంతకం కాకుండా ఓఎస్టీతో చెప్పిస్తున్నారని, ఎక్సైజ్ సూపరిటెండెంట్, అసిస్టెంట్ కమిషనర్లు రెండు, మూడు పోస్టులలో ఇన్చార్జీలుగా పనిచేస్తున్నారని ఆరోపించారు.

## పోలీసులకు కానిస్టేబుల్ గుర్రప్ప ఆదర్శం

### - భక్తుడికి సిపిఆర్‌తో ప్రాణాలు కాపాడినందుకు సన్మానం

**తి ం ు వ ు ల , ఆ గ ్ స ్ ు 18ప్రభాతవార్తప్రతినిధి:** సమాజంలో ప్రజలకు చిన్నకష్టమొచ్చినా వెంటనే కనిపించేది పోలీసులేనని, పోలీసులు ఎక్కడ విధులు నిర్వహించినా సమయస్ఫూర్తితో వ్యవహరించాలని, పరిసరాలను గమనించాలని తిరుపతి జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు తెలిపారు. మరీ యాత్రాస్థలం,పుణ్యక్షేత్రం వంటి తిరుపతి,తిరుమలలో పనిచేసే పోలీసుకానిస్టేబుళ్ళు, అధికారులు



సేవాభావంతో, మరింత జాగరూకతతో వ్యవహరించాలని సూచించారు. నాలురోజుల క్రిందట తిరుమలలో ఆలయ పడమరమాఢవీధిలో తెలంగాణా సంగారెడ్డి జిల్లా భక్తుడు ఎం.శ్రీనివాస్(61)ఉన్నఫళంగా క్రిందపడిపోయాడు. ఆ సమయంలో అక్కడే ఉన్న తిరుమల 1టౌన్ కానిస్టేబుల్ జి.గుర్రప్ప మానవతాదృక్పథంతో సిపిఆర్ చేసి ప్రాణాలు కాపాడాడు. అందరూ ఇతనిని ఆదర్శంగా తీసుకుని సేవలందించాలని సోమవారం మధ్యాహ్నం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు పిలిచి ప్రత్యేకంగా అభినందించి, 2వేల రూపాయలు నగదు బహుమానంతో సన్మానించారు.

# యురియా సరఫరాలో కేంద్రం విఫలం

### ఆర్ఎఫ్‌సిఎల్ కంపెనీపై సిబిఐ విచారణ చేయండి

### పెద్దపల్లి, రామగుండం ఎమ్మెల్యేలు సిహెచ్. వెంకట రమణ రావు, మక్కన్ సింగ్

**హైదరాబాద్, ఆగస్టు 18,ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రానికి 9.80 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయిస్తే ఇప్పటి వరకు 5.32 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా అయ్యిందని యురియా సరఫరా లో కేంద్రం విఫలం పెద్దపల్లి రామగుండం ఎమ్మెల్యేలు సిహెచ్. వెంకట రమణ రావు,మక్కన్ సింగ్ రాజ్ టాగూర్ విమర్శించారు. సోమవారం సిఎల్‌పిలో విలేఖరులతో మాట్లాడుతూ 2.69 లక్షల మెట్రిక్ టన్నుల లోటు ఏర్పండిందని ఇద్దరు ఎమ్మెల్యేలు వివరించారు. ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు స్వదేశీ యూరియా 4.34 లక్షల మెట్రిక్ టన్నులు, దిగుమతి యూరియా 3.96 లక్షల మెట్రిక్ టన్నులు మొత్తంగా 8.30 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేయాలని కేంద్రపాలకులు నిర్ధేశించుకొన్నారని తెలిపారు. ఇందులో స్వదేశీ యూరియాలో 3.27 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా, దిగుమతి యూరియాలో 2.05 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా మాత్రమే అయిందని వారు చెప్పారు.స్వదేశీ యూరియాలో ప్రధానంగా రాష్ట్రానికి ఆర్ఎఫ్‌సిఎల్ నుండి సరఫరా కావాల్సి ఉండగా ఎప్రిల్ నుండి ఆగస్టు వరకు 145 పనిదినాలకు గాను, 78 రోజులు ఉత్పత్తి జరగకపోవటం వలన రాష్ట్రానికి సరఫరా కావాల్సిన యూరియాలో పెద్ద లోటు ఏర్పడిందని అన్నారు. కేంద్రానికి ఎన్ని లేఖలు రాసినా,ఢిల్లీ కి వెళ్లి ప్రధానికి,కేంద్ర మంత్రి కి విన్నవించినా ఫలితం లేదని ఆవేదన చెందారు.మధ్యప్రదేశ్,రాజస్థాన్,కర్ణాటక,తమిళనాడు,ఏపీ,బీహార్,హర్యానా,పంజాబ్ రాష్ట్రాల్లో కూడా యూరియా కొరత ఉందని వారు తెలిపారు.యూరియా దారి మళ్ళకుండా టాస్కోఫ్బర్స్ తో ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టింని చెప్పారు. రాష్ట్రంలో రైతుల కష్టాలకు బిజెపి దే బాధ్యత రాష్ట్రం లో ఇద్దరు కేంద్ర మంత్రులు ఉండి ఏమి చేయలేక పోతున్నారు మతం,కులం పేరుతో ప్రజలను రెచ్చగొట్టడం తప్ప మంత్రులు ఏమీ చేయరు అని నిష్ఠూరాలు పలికారు. బండి సంజయ్,కిషన్ రెడ్డి కి దమ్ముంటే ముందు యూరియా కోసం ప్రధాని ని నిలదీయాలని వారు డిమాండ్ చేశారు బిజెపి ఎంపిలు 8 మంది నోరుమూసుకొని ఉన్నారని దుయ్యబట్టారు ఢిల్లీ లో జంతర్ మంతర్ దగ్గర బిజెపి నాయకులు ధర్నా చేయాలని కోరారు.బిజెపి,బిఆర్ఎస్ నాయకులు కుమ్మక్కై మా ప్రభుత్వాన్ని బదనాం చేస్తున్నారని రైతులను బిఆర్ ఎస్ నాయకులు రెచ్చగొడుతున్నారని విమర్శించారు. బిఆర్ ఎస్ వాళ్ళు రైతుల పేరుతో ధర్నాలు చేస్తున్నారు సోషల్ మీడియా లో ప్రచారం కోసం యూరియా బస్తా పేరు తో డ్రామాలు ఆడుతున్నారు బిఆర్ఎస్ నాయకులు ఎందుకు కేంద్రాన్ని,బిజెపి నాయకులను ఎందుకు నిలదీయడం లేదు? అన్నారు. ఆర్ఎఫ్‌సిఐఎల్ కంపెనీ ప్రైవేట్‌కు బిజెపి అప్పగించడంతో రాష్ట్రానికి ఇవ్వాల్సిన 40శాతం ఉత్పత్తిని కూడా ఇవ్వలేదని ఇప్పటి వరకు 15శాతం మాత్రమే ఇచ్చారని దీనిపై సిబిఐతో విచారణ జరుపాలని ఠాగూర్ మక్కాన్‌సింగ్ డిమాండ్ చేశారు.

## సైబర్ నేరగాళ్ల నుంచి రూ.5489 కోట్ల నగదు స్వాధీనం

### కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్

**హైదరాబాద్, ఆగస్టు 18, ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా ఈ ఏడాది ఇప్పటి వరకు సైబర్ నేరగాళ్ల నుంచి 5489 కోట్ల రూపాయల నగదును జప్తు చేశామని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తెలిపారు. ఢిల్లీలో సైబర్ నేరాల నివారణపై సైబర్ అండ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ డివి జన్ (సిఐఎస్) కార్యకలాపాలపై నిర్వహించిన సమీక్షలో బండి సంజయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాల నివార ణకు హోం శాఖ ఆయా రాష్ట్రాలతో కలిసి పక్కా గా పనిచేస్తోందని తెలిపారు. ఇందులో భాగంగా సైబర్ నేరగాళ్ల నుంచి నగదు జప్తు చేయడంతో పాటు వారికి సంబంధించిన 12 లక్షలకు పైఅ సెల్‌ఫోన్లను బ్లాక్ చేశామని, 13 లక్షలకు పైగా బ్యాంకు ఖాతాలను నిలిపివేశామని ఆయన తెలిపారు . కాగా సైబర్ నేరగాళ్ల నుంచి జప్తు చేసిన నగదును వీలైనంత త్వరలో బాధితులకు అందజేయాలని బండి సంజయ్ అధికారులను కోరారు. మహిళలు, చిన్నారులను లక్ష్యంగా సాగే ఆన్‌లైన్ నేరాలపై పోలీసులు మరింత దృష్టి సారించాలని ఆయన కోరా రు. ఇండియన్ సైబర్ క్రైం కో ఆర్డినేషన్ సెంటర్ ప్రాధాన్యతను బండి సంజయ్ అధికారులకు వివరించారు. సైబర్ మోసాలపట్ల స్థానిక భాషల్లో విస్తృతంగా ప్రచారం చేసి, ప్రజలకు అవగా హన కల్పించాలని ఆయన కోరారు. కీలకమైన కేసుల్లో సైబర్ కమాండోల సేవలను వాడుకోవాలని ఆయన పోలీసులను కోరారు. ఇండియన్ సైబర్ క్రైం కో ఆర్డినేషన్ సెంటర్‌లో భాగంగా సైబర్ క్రైం రిపోర్టింగ్ పోర్టల్, సిటిజన్ ఫైనాన్సియల్ సైబర్ ఫ్రాడ్ రిపోర్టింగ్ అండ్ మానిటరింగ్ సిస్టం, సై బర్ మల్టీ ఏజెన్సీ సెంటర్, రిపోర్ట్ అండ్ చెక్ సస్పెక్ రిజిస్ట్రీ, సైబర్ ఫ్రాడ్ మిటిగుషన్ సెంటర్‌ల ద్వారా సైబర్ నేరాల నివారణకు విస్తృతంగా సే వలు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. సైబర్ నేరాలకు సంబంధించి అన్ని రాష్ట్రాలు జీరో ఎఫ్ఐఆర్‌లు వెంటనే నమోదు చేయాలని ఆయన ఆదే శించారు. సైబర్ నేరాలపై ప్రజల్లో మరింత అవగాహనకు వెబ్‌సైట్ల ద్వారా ప్రచారం చేయాలని ఆయన కోరారు.

# సచివాలయంలో మన ఊరు- మన బడి కాంట్రాక్టర్ల మెరుపు ధర్నా

### వివిధ శాఖల పేర్లపై పాసులు తీసుకున్న కాంట్రాక్టర్లు

### డిప్యూటీ సీఎం ఛాంబర్ ముందు ధర్నా.. అనంతరం వినతిపత్రం సమర్పణ

### పెండింగ్ బిల్లులు చెల్లించకపోతే ఆత్మహత్యలే శరణ్యమన్న కాంట్రాక్టర్లు



**హైదరాబాద్, ప్రభాతవార్త, ఆగస్టు 18:** తెలంగాణ సచివాలయంలో కాంట్రాక్టర్లు సోమవారం మెరుపు ధర్నాకు దిగారు. మన ఊరు- మన బడికి నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు సోమవారం సచివాలయంలో మెరుపు ధర్నాకు దిగారు. ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి అయిన మల్లు భట్టి విక్రమార్క కార్యాలయం ముందు తమ పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నాకు దిగారు. గత ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మన ఊరు- మన బడి కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో వివిధ నిర్మాణ, మరమ్మత్తు పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు తమ పెండింగ్ బిల్లుల కోసం సచివాలయం చేరుకున్నారు. అయితే అందరూ ఒకే శాఖ పేరు మీద పాసులను తీసుకోకుండా.. వివిధ శాఖల పేర్ల మీద సచివాలయంలోనికి వెళ్లడానికి పాసులను తీసుకున్నారు. అనంతరం లోపలికి వెళ్లిన తరువాత వారందరూ ఒక్కసారి ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. సెకండ్ ఫ్లోర్‌లో ఉన్న ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా ఛాంబర్ ముందు బైఠాయించి తమ నిరసనను తెలిపారు. పనులు చేసి మూడు సంవత్సరాలు అయినా బిల్లులు చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మూడేళ్లుగా మన ఊరు- మన బడి బిల్లులు రాక ఇబ్బందులు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి తమకు నిధులు విడుదల చేయలేదన్నారు. కానీ మేఘా కంపెనీకి మాత్రం బిల్లులను ప్రభుత్వం చెల్లించిందని ఆరోపించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కాంట్రాక్టులను కూడా బడా కంపెనీలకు ఇచ్చారని.. ప్రభుత్వం నుంచి రూ. 380 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కకు వినతిపత్రం సమర్పించారు. సమస్య పరిష్కరించడానికి ప్రయత్నిస్తానని ఉపముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్టు కాంట్రాక్టర్లు తెలిపారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన మన ఊరు మన బడి కార్యక్రమంలో పాఠశాలల పనులను నిర్వహించిన కాంట్రాక్టర్లు పెండింగ్‌లో ఉన్న తమ బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేస్తూ గతంలో పాఠశాల విద్య డైరెక్టర్ కార్యాలయం ముందు ధర్నాకు దిగారు. పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు తరగతిగదులు, మరుగుదొడ్లు, ప్రహారీగోడలు, భోజన శాలలు, విద్యుత్ బిగింపు పనులను చేపట్టినట్టు కాంట్రాక్టర్లు తెలిపారు. తమకు పెండింగ్ బిల్లు లను చెల్లించకపోతే ఆత్మహత్యలే శరణ్యమని కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేశారు.

## పటిష్టంగా రిటైనింగ్ గోడల నిర్మాణం

**తిరుమల,ఆగస్టు 18ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతినుండి తిరుమలకు చేరుకునే రెండోఘాట్‌లో కాంక్రీట్‌తో రీటైనింగ్ గోడల నిర్మాణం నాణ్యతగా ఉండాలని, పటిష్టంగా చేపట్టాలని టిటిడి ఇఒ జె.శ్యామలరావు ఆదేశించారు. ప్రమాదాల నివారణకు రెండోఘాట్‌లో జరుగుతున్న రోడ్ల నిర్మాణ పనులతోబాటు రీటైనింగ్ వాల్ నిర్మాణపనులను ఆయన సోమవారం మధ్యాహ్నం తనిఖీ చేశారు. తిరుమలకు వచ్చే భక్తులకు సురక్షితమైన ప్రయాణం కోసం ఘాట్‌రోడ్ల నిర్మాణం పనులు త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. రెండోఘాట్‌లో అక్కడక్కడ తొట్టెలు ఏర్పాటుచేసి నీటిని నింపాలన్నారు.

## నాలుగురోజులు వందవాహనాలకు ఫాస్టాగ్ సౌకర్యం

**తిరుమల,ఆగస్టు 18ప్రభాతవార్తప్రతినిధి:** దేశంనలుమూలల నుండి తిరుమలకు వచ్చే యాత్రికులు వాహనాలకు ఫాస్టాగ్ తప్పనిసరి చేయడంతో అలిపిరిలో టిటిడి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కేంద్రం సేవలందిస్తోంది. ఈనెల 15వతేదీ నుండి అమలులోకి వచ్చిన అలిపిరి టోల్‌గేట్‌లో "ఫాస్టాగ్"తప్పనిసరి ఆదేశంతో ఈ సౌకర్యం లేని వాహనాలకు అలిపిరి వద్ద ఐసిఐసిఐ బ్యాంకు సాయంతో సౌకర్యం కల్పిస్తున్నారు.

## గ్యాస్ సిలిండర్ పేలి ముగ్గురు మృతి

### ఏడాకులపల్లిలో అలుముకున్న విషాదం



**ఝరాసంగం, ఆగస్టు 18, ప్రభాతవార్త:** గ్యాస్ సిలెండర్ పేలిన సంఘటనలో ముగ్గురు మృత్యువాత పడ్డారు. ఈ నెల 6వ తేదీన ఏడాకులపల్లిలో గ్రామానికి చెందిన గొర్రెకంటి శంకరమ్మ నివాసంలో వంటలు చేసుకుంటున్న తరుణంలో గ్యాస్ లీకై మంటలు చెలరేగండంతో శంకరమ్మ (65), శంకరమ్మ పెద్ద కుమారుడు ప్రభు (38), చిన్న కుమారుడు విఠల్ (30)లు ప్రమాదాలకు గురి కాగా చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శంకరమ్మ ఈ నెల8న, పెద్ద కుమారుడు ఈ నెల 15న, సదా శివపేట ఆసుపత్రిలో చికిత్స అందుకుంటున్న చిన్న కుమారుడు విఠల్ సోమ వారం మృతిచెందారు. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఒకరి తరువాత ఒకరు మృతి చెందడంతో ఆ కుటుంబంతో పాటు గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి. భాదిత కుటుంబ సభ్యులను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## కేంద్రం పరిశీలనలో రామకృష్ణాపురం రైల్వే బ్రిడ్జి నిర్మాణం

**హైదరాబాద్,ఆగస్టు18, ప్రభాతవార్త:** ఖమ్మం జిల్లా రామకృష్ణాపురం 107 రైలు క్రాసింగ్ వద్ద బ్రిడ్జి నిర్మాణం ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం పరిశీలనలో ఉందని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ అన్నారు. ముఖ్యంగా రైతులు, తమ పొలాలకు వెళ్లాలన్నా, ఇతర పనుల కోసం వెళ్లాలన్నా తరచుగా రైల్వేగేట్లు మూసి ఉండడం వల్ల తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఇటీవల రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర లేఖ రాశారు. అయితే ఓవర్ బ్రిడ్జి నిర్మాణనికై స్థానిక ప్రజలు, నాయకులు పలుమార్లు విన్నవించారని తెలిపారు. రైల్వే మంత్రి సానుకూలంగా స్పందించారు. ఓవర్ బ్రిడ్జి నిర్మాణం కోసం సమగ్ర నివేదికను సిద్ధం చేయాలని రైల్వే ఉన్నతాధికారులను ఆదేశించామని ఆయన ఎంపీకి రాసిన లేఖలో పేర్కొన్నారు. దీంతో భవిష్యత్ కార్యాచరణ ఉంటుందని తెలిపారు.

## 11వేల ప్రైవేటు స్కూల్స్‌లో చేరిన 37.50 లక్షల మంది

### 964 కార్పొరేట్ స్కూల్స్‌లో 4.66 లక్షల మంది చేరిక

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఆగస్టు 18:** తెలంగాణ రాష్ట్రంలో కొనసాగుతున్న 11,165 ప్రైవేటు పాఠశాలల్లో 37 లక్షల మందికి పైగా విద్యార్థులు చేరినట్టు అధికారులు చెబుతున్నారు. అందులో ప్రధానంగా కార్పొరేట్ స్కూల్స్‌లోనే ఎక్కువ మంది విద్యార్థులు చేరినట్టు తెలిసింది. రాష్ట్రంలో ఉన్న 964 కార్పొరేట్ స్కూల్స్‌లో 4,66 లక్షల మంది విద్యార్థులు చేరారు. రాష్ట్రంలో కొనసాగుతున్న 26,109 ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో 16.70 లక్షల మంది విద్యార్థులు చేరారు. వీరు కాకుండా కేజీబీవి(కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు)లు, మోడల్ స్కూల్స్, గురుకులాలతో కలిపితే ప్రభుత్వ స్కూల్స్‌లో 23.50 లక్షల మంది విద్యార్థులు చేరారు.

## రేపటితో ముగియనున్న ఇంటర్ అడ్మిషన్ల గడువు

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఆగస్టు 18:** తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్, ఎయిడెడ్ కాలేజీల్లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో చేరడానికి అడ్మిషన్ల ప్రక్రియ రేపటి(బుధవారం)తో ముగియనుంది. ఇంటర్ అడ్మిషన్ల కోసం మే 1న అడ్మిషన్ల షెడ్యూల్‌ను జారీ చేసిన ఇంటర్ బోర్డు పలు దఫాలుగా గడువును పొడిగిస్తూ వచ్చింది. జులై 31 వరకు ఉన్న గడువును కాస్త ఈ నెల 20 వరకు పొడిగిస్తున్నట్లు జులై 31న ఇంటర్ బోర్డు కార్యదర్శి ప్రకటన జారీ చేశారు. అదికాస్త రేపటితో ముగియనుంది. మే 31తో మొదటి విడత అడ్మిషన్ల ప్రక్రియ ముగిసింది. ఈ నేపథ్యంలో మే 31 వరకు జరిగిన అడ్మిషన్ల ప్రక్రియను జూన్ 30తో పూర్తి చేయాలని మే 1న జారీ చేసిన మొదటి విడత షెడ్యూల్‌లో ఇంటర్ బోర్డు కార్యదర్శిపేర్కొన్నారు. జూన్ 27న ఎస్ఎస్‌సి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు వెలువడిన నేపథ్యంలో జులై 31 వరకు రెండో విడత అడ్మిషన్ల ప్రక్రియకి ఇంటర్ బోర్డు షెడ్యూల్‌ను జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సుమారు 1300ప్రైవేటు,కార్పొరేట్ కాలేజీల్లో సుమారు 4.50లక్షలకిపైగా అడ్మిషన్లు పూర్తయ్యాయి.

ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY (APCRDA)
Lenin Center, Governorpet, Vijayawada - 520 002 (A.P.)
Dt:14/08/2025
E PROCUREMENT TENDER NOTICE
Name of Work: APCRDA - [illegible]
The bid can be downloaded on AP e-procurement portal from 18.08.2025 to 04.09.2025 up to 14.00 Hrs. [illegible] 04.09.2025 up to 15.00 Hrs. Technical bid opening 04.09.2025 @ 16.00 Hrs. For further details please refer to www.apeprocurement.gov.in and www.crda.ap.gov.in
E PROCUREMENT TENDER NOTICE
NIT No. 73/MAU01-ADMN0/5/APVG/23/2025-E. Dated: 16/08/2025
Name of Work: APCRDA - RFP for Selection of System Integrator for Implementation and Operation of Construction Command Centre (CCC) for Real Time Monitoring of Construction Activities of APCRDA & ADCL for the period of 2 years
The bid can be downloaded on AP e procurement portal from 18.08.2025 to 04.09.2025 up to 14.00 Hrs. The date for submission of Bid is 04.09.2025 up to 15.00 Hrs. Technical bid opening 04.09.2025 @ 16.00 Hrs. For further details please refer to www.apeprocurement.gov.in and www.crda.ap.gov.in
Sd/- Commissioner
APCRDA, Vijayawada

వార్త

కఠినంగా ఉన్నదాన్ని సరళంగానూ, సరళంగా ఉన్నదాన్ని అలవాటుగానూ, అలవాటుగా ఉన్నదాన్ని ఆహ్లాదంగానూ తయారు చేసుకో.

- కె. స్టాన్ స్లావిస్కి

# పాఠశాల విద్యలో మాతృభాష తప్పనిసరి!

*నిజానికి ఆల్ ఇండియా సర్వీసు కోసం జరిపే పరీక్షల్లో కూడా మాతృభాష వినియోగించుకొని ఉద్యోగాలు సంపాదించుకుంటున్నారు. ఏ భాష అయినా అవసరాలకు ఉపయోగ పడే ఆయుధంగా మారిన ఈ ఆధునిక కాలంలో మాతృ భాష ప్రాముఖ్యతను వాడకాన్ని ఎవ్వరూ కాదనలేరు కానీ దురదృష్టవశాత్తు తెలుగు భాషను స్కూలు విద్యావిధానంలో తెలుగు రాష్ట్రాలలో వెనక్కి నెట్టేసే ప్రమాదం కాలక్రమేణా ఏర్పడుతున్నది. ప్రభుత్వాలు ఆ పరిణామాన్ని గమనించి మాతృభాష స్థానాన్ని కాపాడాల్సిన బాధ్యత తీసుకొన్న నాడే మాతృభాష సజీవంగా ఉండిపోతుంది. ఇంగ్లీషును హిందీని ఎవరూ కాదనరు కానీ తెలుగు మన మాతృభాష మరుగునపడే పరిస్థితులు మనం కానీ, ప్రభుత్వం కానీ గమనిస్తున్న దాఖలాలు కనపడకపోవడం అత్యంత బాధాకరం. హిందీని ఇంగ్లీషును విద్యావిధానంలో ప్రోత్సహించండి కానీ మాతృ భాషను అవసరాల నిమిత్తం పరాయి భాషగా చూడకండి! రాజకీయ కారణాల వల్ల తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలు 'భాష'ను అడ్డంపెట్టి కేంద్రంపై పోరాడుతున్నా అనుకోకుండా మాతృభాష ప్రాముఖ్యతను పైకి తెస్తున్నారు. అది అందరూ గుర్తించక తప్పదు.*



రావులపాటి సీతారాం రావు

ఈ మధ్య దేశంలో విద్య విషయంలో అసలు సమస్యలు ప్రక్కకు నెట్టేసి భాషను టార్గెట్‌గా పెట్టుకొని కేంద్రం, రాష్ట్రాలు గొడవలకు దిగుతున్న వైనం పాత రోజులను జ్ఞప్తికి తెస్తున్నాయి. హిందీ, ఇంగ్లీషు రెండు భాషలు సమస్యకు కేంద్ర బిందువుగా మారాయి! చాలా సంవత్సరాల క్రిందట తమిళనాడు ప్రభుత్వం ప్రజలూ 'హిందీ'ని మూడు భాషల ఫార్ములాగా ఉంచటాన్ని బాహాటంగా ఒప్పుకోకపోవటమే కాకుండా కేంద్రంతో హిందీకి వ్యతిరేకంగా వీధి పోరాటాలే చేశారు. రాజకీయాలు విచిత్రంగా పాతవాటినే కొత్త సమస్యలుగా తెరమీదికి తెస్తుంటాయి. కారణాలు అందరికీ తెలిసినవే! తమిళనాడు కేంద్రంలో ఉన్న ప్రభుత్వాన్ని సపోర్టు చేసినంత కాలం భాషమీద యుద్ధం కనుమరుగవుతుంది. కేంద్రం, రాష్ట్రం, విభిన్న దారులు తొక్కి రాజకీయంగా శత్రువులుగా మారగానేభాషో, మరో సమస్యో పైకి లేస్తుంది. నిజానికి రాజకీయ నాయకులే వారి స్వలాభం కోసం అధికారం నిలుపుకోటానికి ఏదో ఒక సమస్యను రాజేసి నిప్పుగా మార్చి, మంటలు మండిస్తారు. అది భారత్‌లో ప్రతి అయిదు సంవత్సరాలకో, పది సంవత్సరాలకో జరిగే తతంగమే. పాఠశాల విద్యలో ఏయే భాషలను ప్రత్యేకంగా గుర్తించిపిల్లలకు విద్య నేర్పాలన్నది చాలా చిన్న సమస్యగానే బయటకు కనపడ్తుంది కానీ నాయకులు ఆ సమస్యలో రాజకీయ కోణాన్ని ప్రవేశపెట్టిన ప్పుడు పెద్ద సమస్యగా మారి తీరుతుంది. మాతృభాష స్థానాన్ని ఎవరూ కాదనలేరుగా! మాతృభాష ఫస్ట్ లాంగ్వేజి' స్థానాన్ని కల్పించిన తరువాత మిగిలినవి ప్రత్యేకంగా అందరి దృష్టిలో ఉన్నవి హిందీ, ఇంగ్లీషు ఆధునిక విద్యావిధానంలో ఇంగ్లీషు ఉంటేనే అంతర్జాతీయంగా ఏ దేశమైనా ప్రత్యేకతను నిలబెట్టుకుంటుంది. చైనా, తదితర దేశాలు పైకి ఏది చెప్పినా ఇంగ్లీషును విస్మరించకుండా, నిష్ణాతను సంపాదించుకొనే ప్రయత్నంలో ఎప్పుడూ ఉంటూనే ఉంటారు. పైకి మాత్రం మా దేశంలోని భాషలకే చోటు ఉంది. ఇంగ్లీషుకు లేదు అన్న ధోరణిలో తమ ప్రత్యేకత నిల్పుకోవటానికి అధికారికంగా భాష విషయం వచ్చినప్పుడు ప్రకటిస్తుంటారు. ఎవరు అవునన్నా, కాదన్నా సాంకేతిక నైపుణ్యంతోపాటు అంతర్జాతీయంగా గుర్తింపు పొందాలంటే ఇంగ్లీషు తప్పనిసరిగా ప్రతి దేశంలోని ప్రజలూ నేర్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వాలు అధికారికంగా ఒప్పుకున్నా, ఒప్పుకోకపోయినా, ఇంగ్లీషు వాడకాన్ని కాదనలేని పరిస్థితి దాదాపు అన్ని దేశాల్లోనూ ఉన్నమాట బహిరంగ రహస్యమే. భారత్‌లోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులలో తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలు రెండు భాష ఫార్ములా (టూ లాంగ్వేజి ఫార్ములా)ను స్కూలు విద్యలో అమలు చేయాలన్న సంకల్పంతో బలంగా ఉన్నట్లు కనపడుతున్నది. ఇది ఒక విధంగా నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ 2020 (ఎన్.ఇ.పి)ని అంటే త్రీ లాంగ్వేజి ఫార్ములాను కాదనటానికి అన్నట్లు వ్యూహరచన చేస్తున్న అభిప్రాయం సర్వత్రా వినపడుతున్నది. రెండు రాష్ట్రాలూ తమిళం, కన్నడం అంటే



లోకల్ లాంగ్వేజెస్‌కు ప్రాధాన్యత ఇవ్వటానికే. దానితోపాటు ఇంగ్లీషును కూడా స్కూలు విద్యలో మరో భాషగా ఉంచే విధానంతో ముందుకు వెళ్తున్న సూచనలుకన్పడుతున్నాయి. మూడు భాషల ఫార్ములా బదులు రెండు భాషల ఫార్ములాను స్కూలు విద్యావిధానంలో ప్రవేశపెట్టడానికి సిద్ధమవుతున్నారు. తమిళనాడు ఇప్పటికే స్టేట్ ఎడ్యుకేషన్ పాలసీని ప్రకటించింది. కర్ణాటకలో ఒక కమిషన్,అక్కడి ఎస్.ఇ.పికి తమ ప్రతిపాదనలు పంపించింది. నిజానికి తమిళనాడులో ద్విభాషా ఫార్ములా అమలు చేస్తుండటం చేత మరొక్కసారి ఆ విధానాన్నే బహిర్గతపర్చింది. కర్ణాటక మాత్రం తీ-లాంగ్వేజీ పాలసీని అమలు చేయడం లేదన్నట్లు సూచనాప్రాయంగా తెలపకనే తెల్పుతున్నది. కర్ణాటకలో ఏర్పడిన కమిషన్ కన్నడ గానీ, పిల్లవాడి మాతృభాషకానీ అయిదవ తరగతి వరకు మీడియం ఆఫ్ ఇన్‌స్ట్రక్షన్‌గా ఉండాలి. పన్నెండవ తరగతి వరకూ అదే ఉన్నా లాభమే అన్న రీతిలో సూచించినట్లుగా తెలుస్తున్నది. ఇంగ్లీషు మాత్రం రెండవ కంపల్సరీ లంగ్వేజీగా ఉండాలని కూడా చెప్పింది. ఒకవేళయిది జరిగితే హిందీ మూడవ కంపల్సరీ లాంగ్వేజిగా ఉన్న ఫార్ములా అమలులో ఉండకపోవచ్చు. కర్ణాటకలోని కమిషన్ మరికొన్ని ప్రతిపాదనలు కూడా ప్రభుత్వం ముందుంచింది. ఎన్.సి.ఇ.ఆర్.ఐ (నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రిసెర్చి అండ్ ట్రయినింగ్) టెక్ట్స్‌బుక్స్ కాకుండా కర్ణాటకకు సంబంధించిన పాఠ్య ప్రణాళిక (కరికులమ్)తోపాటు రెండు భాషల్లోనూ బోధనా పద్ధతులను ప్రవేశపెట్టాలి అన్నది ఒక ప్రతిపాదన! తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ఆ రాష్ట్ర ఎడ్యుకేషన్ పాలసీ ప్రకటనలో పదవ తరగతి వరకు మీడియం ఆఫ్ ఇన్‌స్ట్రక్షన్‌గా తమిళం కంపల్సరీ అని తేల్చారు. మహారాష్ట్రలో స్కూలు ఎడ్యుకేషన్‌లోమరాఠీ, ఇంగ్లీషులతోపాటు హిందీ ఉన్నా మాండేటరీ కాదు, జనరల్‌గా నేర్చుకోవచ్చు అన్నవిధానం రూపుదిద్దుకోవటంతో మహారాష్ట్రతో పాటు కొన్ని రాష్ట్రాలలో కూడా ఒక విధంగా త్రీ-లాంగ్వేజీ ఫార్ములా మార్పులకు లోనవుతున్నదని చెప్పక తప్పదు. 'హిందీ' కంపల్సరీ అని కేంద్రం ఎక్కడా ఒత్తిడి చేయటం లేదు కానీ, కేంద్ర ప్రభుత్వంలోని కొందరు పెద్దలు నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీని వారు ఇష్టమొచ్చిన రీతిలో హిందీకి అనుకూలంగా అన్వయించటంతో ఈ అనవసరపు అపోహలకు తావిచ్చినట్లయింది. నిజానికి ఎక్కువ మంది ప్రజలు ఈ దేశంలోని ఇంగ్లీషుతోపాటు హిందీని కూడా వారి జీవన విధానంలోకి ఆహ్వానించారు. ఇంగ్లీషు ఉన్నత ఉద్యోగాలు పొందటానికి, దేశమంతటా ముఖ్యంగా దక్షిణాది ప్రజలు సందర్శిస్తున్నప్పుడు హిందీని దాదాపు వాడుక భాషగా చేసుకున్నారు. సర్వీసు కమిషన్ ఉద్యోగాలలో ఎక్కువ మార్కులు సంపాదించుకోటానికి సంస్కృత భాషలో కూడా పరీక్షలు రాస్తున్నారు. అంత మాత్రాన దేశమంతటా సంస్కృతం ప్రాచుర్యం పొందిందని చెప్పలేము. నిజానికి ఆల్ ఇండియా సర్వీసు కోసం జరిపే పరీక్షల్లో కూడా మాతృభాష వినియోగించుకొని ఉద్యోగాలు సంపాదించుకుంటున్నారు. ఏ భాష అయినా అవసరాలకు ఉపయోగపడే ఆయుధంగా మారిన ఈ ఆధునిక కాలంలో మాతృభాష ప్రాముఖ్యతను వాడకాన్ని ఎవ్వరూ కాదనలేరు కానీ దురదృష్టవశాత్తు తెలుగు భాషను స్కూలు విద్యావిధానంలో తెలుగు రాష్ట్రాలలో వెనక్కి నెట్టేసే ప్రమాదం కాలక్రమేణా ఏర్పడుతున్నది. ప్రభుత్వాలు ఆ పరిణామాన్ని గమనించి మాతృభాష స్థానాన్ని కాపాడాల్సిన బాధ్యత తీసుకొన్న నాడే మాతృభాష సజీవంగా ఉండిపోతుంది. ఇంగ్లీషును హిందీని ఎవరూ కాదనరు కానీ తెలుగు మన మాతృభాష మరుగున పడే పరిస్థితులు మనం కానీ, ప్రభుత్వం కానీ గమనిస్తున్న దాఖలాలు కనపడకపోవడం అత్యంత బాధాకరం. హిందీని ఇంగ్లీషును విద్యావిధానంలో ప్రోత్సహించండి కానీ మాతృ భాషను అవసరాల నిమిత్తం పరాయి భాషగా చూడకండి! రాజకీయ కారణాల వల్ల తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలు 'భాష'ను అడ్డంపెట్టి కేంద్రంపై పోరాడుతున్నా అనుకోకుండా మాతృభాష ప్రాముఖ్యతను పైకి తెస్తున్నారు. అది అందరూ గుర్తించక తప్పదు. ●

## చిక్కుల్లో ఎన్నికల సంఘం!

సమయం, సందర్భమూ ఒకటే. కానీ వాటిపై స్పందించేవారు వేర్వేరు. ఒక ఔనంటే, మరొకరు కాదంటారు. అది రాజకీయపక్షాల నైజం. కానీ ఇక్కడ ఇద్దరూ ప్రజాస్వామ్యబద్ధంగా మెలగాల్సినవాళ్లే ! అయినా ఎవరి తీరు వారిదే, ఎవరి వాదన వారిదే .మధ్యన ఓటరు హక్కులకు చిక్కొచ్చిపడింది. బీహార్ లో ఓటర్ సమగ్ర జాబితా సవరణ ప్రక్రియ తదనంతర పరిణామాలలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ బీహార్లో 'ఓటు అధికార్ యాత్ర'కి శ్రీకారం చుట్టడంతో కేంద్ర ఎన్నికల సంఘం అత్యవసరంగా మీడియా సమావేశం ఏర్పాటు చేసి 'ఓట్ చోర్' అనడమే రాజ్యాంగ వ్యతిరేకమన్నారు. రాజకీయులు ఎవరు ఏం చేసినా విపక్షం వారు ఖచ్చితంగా దానిని కాదనడం ఇప్పుడున్న రాజకీయాల్లో ధోరణి. కానీ స్వయం ప్రతిపత్తి ఉన్న సర్వస్వతంత్రంగా వ్యవహరించాల్సిన ఎన్నికల సంఘం సవాళ్లతో ముందుకొచ్చింది. ఓటర్ జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ (ఎస్ఐఆర్) జరిగిన విశేషాలను, అంతకు ముందు కర్ణాటకలోని మహదేవపురం నియోజకవర్గంలో జరిగిన దొంగ ఓట్ల తంతును విశ్లేషిస్తూ పలుమార్లు దేశమంతా యాగీ చేస్తున్నారని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై కేంద్ర ఎన్నికల సంఘం ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. నిజానికి రాహుల్ గాంధీ ఇంత క్రితం చేపట్టిన అన్ని కార్యక్రమాలు కన్నా మిన్నగా ఓట్ అధికార యాత్రకు మంచి స్పందన లభిస్తోంది. రెండేళ్ల క్రితం జరిగిన కర్ణాటక ఎన్నికలనాటి నకిలీ దొంగ ఓట్ల విశేషాలను ఇన్నాళ్లకు పూర్తి సాక్ష్యాలతో కనుగొని ప్రచారంలోకి తేవడం ఎన్నికల సంఘానికి చికాకు కలిగించింది. త్వరలో జరగబోవు బీహార్ ఎన్నికలకు ఓటర్ల సవరణలతో ఎన్నికలకు సంసిద్ధమవుతున్న తీరును రాహుల్ గాంధీ చర్చలోకి తెచ్చారు. ఇవన్నీ ఎన్నికల కమిషనర్‌కు రుచించినట్లుగా లేదు. ఏకంగా ఎన్నికల కమిషన్ రాహుల్ గాంధీకి అల్టిమేటం జారీ చేసే స్థాయికి వెళ్లిపోయింది. ఆదివారం జరిగిన ఎన్నికల సంఘం విస్తృత మీడియా సమావేశంలో చీఫ్ ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ స్వయంగా పాల్గొన్నారు. సాధారణంగా ఇలాంటి వివరణలకు ఇతర కమిషనర్లు పాల్గొంటారు. కానీ ఈసారి ఎన్నికల సంఘంపై వచ్చిన ఆరోపణలకు స్వయంగా ప్రధాన ఎన్నికల కమిషనరే నడుం కట్టారు. అందరి ఓటు హక్కు కాపాడటమే తమ ప్రధాన విధి అని బీహార్‌లో ఓటరు జాబితా సమగ్ర సవరణ అత్యంత పారదర్శకంగా కొనసాగుతోందని సిఇసి స్పష్టం చేశారు. అంతేకాదు సాదాసీదా వివరణలతో సరిపెట్టకుండా రాహుల్ గాంధీ మీద తీవ్ర ఆరోపణలు కూడా చేశారు. విపక్షాల ఆరోపణలకు అధికారపక్షాల నుంచి వివరణలొస్తుంటాయి. అందులో ప్రత్యారోపణలు కూడా ఉంటుంటాయి. "మా భుజంపై తుపాకీ పెట్టి రాజకీయాలు చేయొద్దని పరోక్షంగా రాహుల్ గాంధీని ప్రస్తావిస్తూ సీఈసీ హెచ్చరించారు. అలాంటి వారి ఆటలు సాగనివ్వబోమని అన్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా ఓటర్లపై నకిలీలనే ముద్ర వేస్తే ఎత్తుగడలను తాము అంగీకరించబోమని కూడా హెచ్చరించారు. ఓటర్లలో చైతన్యానికి బీహార్‌లో రాహుల్ గాంధీ యాత్రకు శ్రీకారం చుట్టిన సందర్భంలో అదే రోజు ఆదివారం ఇతర ఎన్నికల కమిషనర్లతో కలిసి ప్రధాన ఎన్నికల కమిషనర్ జాతీయ మీడియాతో మాట్లాడారు. ఒక పక్క ఓటు హక్కు ఉండి కూడా మృతుల జాబితాలో చేర్చబడిన కొందరు ఓటర్లతో రాహుల్ గాంధీ భేటీ అయిన వార్తలు విస్తృతంగా మీడియా కెక్కాయి. తద్వారా తాము ఆధార పూరిత ఆరోపణలే చేశామని రాహుల్ గాంధీ చెప్పజూసారు. కాగా అలాంటి విషయాలనే మీ ఎన్నికల సంఘం పరిగణనలోకి తీసుకున్నట్లు లేదు. తమ వద్దనున్న ఆరోపణలకు ఆధారాలుంటే వారం రోజుల్లో ప్రమాణ పత్ర రూపంలో సంతకంతో సమర్పించాలని లేని పక్షంలో అలాంటి ఆరోపణలను నిరాధారంగా పరిగణిస్తామని వివరించారు. అనుమానాలు ఉన్నచోట ఆధారాలు తప్పుకాదు. కానీ విపక్షాలు రాజకీయం చేస్తున్నారంటూ ఆరోపించడం, సవాళ్లు విసరడం ఎన్నికల సంఘానికి అంతగా నప్పని పని. ఎన్నికల సంఘ వ్యవహార శైలి హేతుబద్ధంగా ఉండాలి. భవిష్యత్ తరాలకు అనుసరణీయంగా ఉండాలి. అందుచేత రాజకీయ పక్షాల ఆరోపణలు ఎలాంటివైనా వ్యక్తిగతంగా తీసుకోరాదు. వాటికి వివరణలిచ్చేటపుడు అనుకోకుండా జరిగిన లోపాలను సరిదిద్దే ప్రక్రియలా కాకుండా సాగతీత వ్యవహారంలా ఉండనీయరాదు. కాగా తీవ్ర ఆరోపణలు చేసిన రాహుల్ గాంధీ ప్రమాణ పత్రాలు దాఖలు చేయలేని పక్షంలో దేశానికి క్షమాపణలు చెప్పాలని హుకుం జారీ చేశారు. ఈ రెండూ తప్ప మరో ప్రత్యామ్నాయమే లేదని స్పష్టం చేశారు. 'ఓట్ల చోరీ' అనే పదాన్ని విపక్ష నేత ఉపయోగించడం రాజ్యాంగాన్ని అవమానపరచడమేనని ప్రధాన ఎన్నికల కమిషనర్ ఆగ్రహం వెలిబుచ్చారు. దొంగ ఓట్లు, నకిలీ ఓట్లు, డబుల్‌ఓట్లు పేరిట ఓటర్లను అవమానిస్తే ఎన్నికల సంఘం మౌనంగా ఉండదని మరో హెచ్చరిక. చివరికి ఈ విషయం సిఇసి జ్ఞానేశ్‌కుమార్‌పై ఇండియా కూటమి అభిశంసన తీర్మానం పెట్టేంతవరకు వెళ్లింది. ఇలాంటి పరిణామాలు దురదృష్టకరం. ఇరువర్గాలు చెబుతున్నట్లు 'ఒక వ్యక్తికి ఒకే ఓటు' అన్న మౌలిక ప్రాథమిక హక్కు లక్ష్యంగా రాజకీయ పక్షాలు, ఎన్నికల సంఘం కలిసి ప్రయాణం సాగిస్తే పది కాలాలపాటు ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుంది.!

ఒక వ్యక్తి గుణగణాలు పరీక్షించి చూడాలంటే అతనికి అధికారం ఇచ్చి చూడాలి.



అబ్రహాంలింకన్

భయం వలన పొందే ఆధిపత్యం కన్నా, అభిమానంతో పొందే బానిసత్వం మిన్న.



మహాత్మా గాంధీ

# ప్రకృతి విపత్తులకు మూలం మానవ తప్పిదాలే

డి జె మోహన రావు

ఉత్తరాఖండ్‌లోని ధారాలీ గ్రామంలో సంభవించిన ఆకస్మిక వరదలకు మొదట్లో మేఘవిస్ఫోటనం (క్లౌడ్‌బరస్ట్) కారణమని అందరూ భావించారు. అయితే శాస్త్రీయ పరిశీలన, వాతావరణ, ఉపగ్రహ డేటా ఆధారంగా ఒక భిన్నమైన, మరింత ఆందోళన కలిగించే వాస్తవం వెలుగులోకి వచ్చింది. ఈ వరదలకు ప్రధాన కారణం మేఘవిస్ఫోటనం కాదు. హిమనీనదం సరస్సు విస్ఫోటనం (గ్లేసియల్ లేక్ ఔట్‌బర్స్ట్ ఫ్లడ్ గ్లోఫ్) లేదా ఒక భారీ హిమనీనదం కూలిపోవడమే. ఇది ప్రకృతి విసిరిన సవాలు మాత్రమే కాదు, మన స్వయంకృత తప్పిదాల వల్ల ఏర్పడిన విలయం. ఈ వాదనకు బలమైన ఆధారాలు ఉన్నాయి. హిమాలయాల్లోని మంచు పర్వతాలు (గ్లేసియర్స్) కరిగినప్పుడు ఆ నీరు ఒక సరస్సులాగా పేరుకుపోతుంది. ఈ సరస్సు చుట్టూ మట్టి, రాళ్లు, మంచుతో ఏర్పడిన సహజ సిద్ధమైన గట్టుఉంటుంది. ఈ గట్టును మోరైన్ డ్యామ్ అంటారు. ఈ గట్టు బలహీనంగా ఉన్నప్పుడు లేదా ఏదైనా కారణంతో విరిగిపోయినప్పుడు, సరస్సులోని నీరు ఒక్కసారిగా, చాలా వేగంగా కిందకు ప్రవహిస్తుంది. దీనినే హిమనీనదం సరస్సు విస్ఫోటనం అంటారు. దీనికి ప్రధాన కారణం వాతావరణ మార్పులు. భూమి వేడెక్కడం వల్ల హిమాలయాల్లోని మంచు గడ్డలు చాలా వేగంగా కరిగిపోతున్నాయి. మంచు కరగడం వల్ల కొత్తగా చాలా సరస్సులు ఏర్పడుతున్నాయి. ఈ సరస్సుల చుట్టూ ఉన్న గట్లు చాలా బలహీనంగా ఉంటాయి. కొత్తగా ఏర్పడిన సరస్సులలో నీరు ఎక్కువగా చేరడం వల్ల, బలహీనమైన గట్లపై ఒత్తిడి పెరిగి, అవి సులభంగా విరిగిపోతున్నాయి. ఈ కారణాల వల్ల గ్లోఫ్లు ఎక్కువగా సంభవిస్తున్నాయి. ఎత్తైన మంచు పర్వతాల మధ్య నుంచి అకస్మాత్తుగా నీరు, మట్టి, రాళ్లు భారీగా విడుదలయ్యాయి. హిమానీనదం కూలిపోయినా లేదా మంచు సరస్సు పేలిపోయినా ఇలాంటి జల ప్రళయమే సంభవిస్తుందని నిపుణులు అంటున్నారు. భారత వాతావరణ శాఖ తెలిపిన వివరాల ప్రకారం, ఆ రోజుల్లో ఉత్తరకాశీలో కేవలం 27 మిల్లీమీటర్ల స్వల్ప వర్షం మాత్రమే పడింది. ఇంత తక్కువ వర్షం పడితే ఇంత పెద్ద వరద రావడం అసంభవం. ఇది క్లౌడ్‌బర్స్ట్ కాదనేది నిర్ధారించింది. ఉపగ్రహ చిత్రాలు,ధరాలీ గ్రామానికి పైన రెండు పెద్ద మంచు సరస్సులున్నాయని చూపిస్తున్నాయి. ఆ సరస్సులు పేలిపోవడం వల్లనే ఈ వరద వచ్చిందని శాస్త్రవేత్తలు నమ్ముతున్నారు. ఈ వరద సాధారణంగా కనిపించేనీటి ప్రవాహం కాదు. అది ఒక బురద,రాళ్లు,మంచు శిథిలాలతో కూడిన వరద.అంచనాల ప్రకారం 360 మిలియన్ క్యూబిక్ మీటర్ల పదార్థం అంటే 1.4 లక్షల ఒలింపిక్ స్విమ్మింగ్ పూల్స్‌కు సరిపడా మట్టి, రాళ్ల పర్వతాలపై నుంచి కిందకు జారిపడ్డాయి. ధరాలీ విపత్తు కేవలం ఒకే కారణం వల్ల జరగలేదు. దీనికి ఇంకా అనేక అంశాలు తోడయ్యాయి. ధరాలీ గ్రామం ఉన్న ప్రాంతం భౌగోళికంగా చాలా బలహీనమైనది. భూకంపాలు, కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఎక్కువ ఉన్న ప్రాంతం. వరదలకు తక్షణ కారణం ప్రకృతిదే అయినప్పటికీ, విపత్తు ఇంత పెద్దదిగా మారడానికి మనుషులే కారణం. సహజసిద్ధమైన కారణంతో విపత్తు మొదలైనా దాని తీవ్రత ఇంతగా పెరగడానికి కారణం మానవ తప్పిదాలే. హిమాలయ పర్వతాల్లో మనం సృష్టించిన సున్నితత్వం ఈ విలయానికి దారితీసింది. పర్యావరణపరంగా సున్నితమైన భగీరథి ఎకో సెన్సిటివ్ జోన్లో కూడా నిబంధనలకు విరుద్ధంగా నదీ పరీవాహక ప్రాంతాల్లోని భూములపై ఇష్టానుసారం నిర్మాణాలు చేపట్టారు. ఈ నిర్మాణాలవల్ల నది సహజ ప్రవాహ మార్గం కుంచించుకుపోయింది. భారీ స్థాయిలో నీరు,శిథిలాలు కిందకు దూసుకొచ్చినప్పుడువాటికి వ్యాపించడానికి స్థలం లేకపోయింది. ఆ నీరు మరింత వేగవంతమైన ప్రవాహంగా మారి దారిలో ఉన్న నిర్మాణాలను నాశనం చేసింది. అంతేకాకుండా రోడ్లవిస్తరణ వంటి ప్రాజెక్టుల కోసం భారీగా అడవులను నరికివేయడం వల్ల కొండ వాలులు బలహీనపడ్డాయి. చెట్ల వేళ్లు నేలను పట్టి ఉంచి, కొండచరియలు విరిగిపడకుండా నిరోధిస్తాయి. వాటిని తొలగించడం వల్ల కొండలు మరింత సులభంగా కూలిపోయే పరిస్థితి ఏర్పడింది. దీనికితోడు, ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న వాతావరణ మార్పులు కూడా ఈ విపత్తుకు పరోక్షంగా కారణమయ్యాయి. మానవ కార్యకలాపాల వల్ల పెరుగుతున్న ఉష్ణోగ్రతలు హిమనీనదాలు వేగంగా కరిగిపోవడానికి కారణమవుతున్నాయి. మనం కేవలం సురక్షితం కాని నిర్మాణాలే కాకుండా ఈ విపత్తులకు కారణమయ్యే శక్తులకు కూడా ఊతమిస్తున్నాం. ఇలాంటి విషాదాలు పునరావృతం కాకుండా ఉండాలంటే మన ఆలోచనా విధానాల్లో సమూలమైన మార్పులు అనివార్యం. కేవలం విపత్తు జరిగిన తర్వాత స్పందించడం కాకుండా ముందుగానే నివారణ చర్యలు తీసుకోవాలి. ఎకోసెన్సిటివ్ జోన్‌లలో ఉన్న నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలి. నదీ పరీవాహక ప్రాంతాల్లో కొత్త నిర్మాణాలకు అనుమతులు నిలిపివేయాలి. ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి, అక్కడ నిర్మాణాలను పూర్తిగా నిషేధించే 'నోగో జోన్' విధానాన్ని రూపొందించాలి. ●

## ప్రజావాక్కు



### చిన్నారులపై లైంగిక దాడులను అరికట్టాలి

సమాజంలో చిన్నారులు భవిష్యత్తు పౌరులు మాత్రమే కాదు, నేటి బాధ్యతగా కూడా భావించాలి. కానీ ఇటీవల చిన్నారులపై లైంగిక దాడులసంఖ్య ప్రమాదకరంగా పెరుగుతోంది. యునిసెఫ్ నివేదికప్రకారం, ప్రపంచవ్యాప్తంగా 53శాతం బాలికలు లైంగిక వేధింపులకు గురవుతుండగా, వాటిలో 90శాతందాడులు కుటుంబసభ్యులు లేదా పరిచయస్తులచే జరుగుతుండటం మన మానవత్వాన్ని కలవరపెడుతోంది. ఇలాంటి దాడులు పిల్లల శారీరక, మానసిక ఆరోగ్యాన్ని బాగా దెబ్బతీస్తున్నాయి. బాధితులు భయంతో మౌనంగా ఉంటూ జీవితాంతం ఆ గాయాలతోనే బతకాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. అంతేకాదు, మత్తు పదార్థాలు, అసభ్యవీడియోలు, సోషల్ మీడియా వల్లనూ బాలబాలికలు ప్రమాదంలో పడుతున్నారు. పోక్సో చట్టం వంటి చట్టాలున్నా అమలు లోపం వల్ల నేరగాళ్లకు శిక్షలు పడటం అరుదు .న్యాయవ్యవస్థ వేగంగా స్పందించాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### ప్యాసింజర్ రైళ్లను పునరుద్ధరించాలి

కరోనా వైరస్ కన్న ముందు నడిచిన ప్యాసింజర్ రైళ్లను తిరిగి పునఃప్రారంభించాలి. రైలు కొన్నిరోజులు నిలుపుదల చేసి తిరిగిప్రారంభించడం జరిగింది. కానీ ఎక్కువగా ప్యాసింజర్ రైళ్లు అప్పటిలాగా తిరిగి ప్రారంభించలేదు. కొన్ని ఎక్స్‌ప్రెస్ రైలు కూడా ప్రతి రైల్వేస్టేషన్లలో వచ్చేటప్పుడు పోయేటప్పుడు తప్పనిసరిగా ఆగాలి. గతంలో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేవు. కొన్ని రైళ్లు నడవకపోవడంతో పేద ప్రయాణికులు చాలా ఇబ్బందులు పడుతున్నారు.కరోనా వైరస్‌కన్నా ముందు గతంలో ప్రతి రైల్వే స్టేషన్లలో ఆగిన ప్రతి రైలు ఇప్పుడు కూడా నడిచే విధంగా రైల్వే ఉన్నత అధికారులు కృషి చేయాలి.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా

### మాదకద్రవ్యాలపై నియంత్రణ అవసరం

మాదకద్రవ్యాలు ఊరూరా విచ్చలవిడిగా లభిస్తూ నవతరాన్ని దారితప్పిస్తున్నాయి. వీటిని అణచివేసేందుకు ఉక్కుపాదం మోపాలి. మద్యం,మాదకద్రవ్యాలు యువతకు అందకుండా ప్రభుత్వం నిఘాఏర్పాటుచేయాలి. ఎవరైనా వీటిని అమ్మినట్లు తెలిసినా, చూసినా వారిని వెంటనే అదుపులోకి తీసుకొని కఠిన శిక్షలు విధించాలి.

- మా.శ్రీ.రాజు, పాల్వంచ

### అభివృద్ధికి దూరం చేయడం తగదు

రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా ప్రజలందరిని సమానంగా చూడమని రాష్ట్రమంత్రులు, ఎమ్మెల్యేలు, గ్రామ పంచాయతీ అధికారులను హెచ్చరించాలి. పక్షపాత ధోరణితో గ్రామాల్లో రాజకీయ కక్ష్యలు,కార్పణ్యాలు ఎక్కువవుతున్నాయి. మనుషులంటే సరేసరి. ఆ రాజకీయ కక్ష్యలు, కార్పణ్యాలు గత ప్రభుత్వం నాటిన చెట్లు, మొక్కలపై కూడా చూపిస్తున్నారు. గ్రామంలో ఎవరు ఎవరికి ఓటు వేసినా, వేయకపోయినా అధికారంలో ఉన్న ప్రభుత్వాలు తన, మన అనే భేదం లేకుండా మనకు ఓటు వేయమని వారిని ఏ ప్రభుత్వ పథకాలు ఇచ్చి వారిని ఆ ప్రభుత్వంపై మంచి అభిప్రాయం తీసుకురావాలని ఆలోచించాలి. కానీ అలాకాకుండా వారిని ఎత్తిపొడుస్తే ప్రభుత్వానికి చెడ్డ పేరు రావడంతోపాటు, వారిని అభివృద్ధికి దూరం చేయడం తగిన పని.

-పద్మపుత్ర మల్లికార్జున్, గద్వాల్ జిల్లా

### అకాల వర్షాలతో అన్నదాత ఆగమాగం

రాష్ట్రంలో కురుస్తున్న అకాల వర్షాలతో అన్న దాతలు ఆగం అవుతూ వున్నారు. బహుళ సమస్యలతో సతమతం అవుతున్న రైతన్నలను చెడ గొట్టు వానలు నిండా ముంచుతూ వున్నాయి వారం రోజుల నుండి వివిధ జిల్లాలలో గాలి వాన అలజడి చేస్తుంది ఈదురు గాలులు వడ గండ్ల తో కురుస్తున్న వర్షాల వల్ల పొలాల్లో పంటలే కాక తోటలకు నష్టం కలుగుతూ వుంది విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి రేకుల ఇల్లు కూలాయి మామిడి మునగ బొప్పాయి తోటలు నష్టం కలుగుతూ వుంది పిడుగు పాటుకు జీవాలు మరణిస్తూ వున్నాయి అకాల వర్షాల వల్ల నష్టపోయిన వారిని ఆదుకోవాలి సర్వే చేసి వారికి పంట నష్టం అందచేయాలి.

-కె. సతీష్ రెడ్డి, భూపాల్ పల్లి జిల్లా

### విద్యావ్యవస్థపై రాజకీయ నాటకం

రాష్ట్రంలో రాజకీయ నాయకుల పిల్లలు విదేశాలలో చదువుతారు. కానీ వీళ్లు మన ఎడ్యుకేషన్‌ని మారుస్తాం అని బూటకపు మాటలు చెప్తారు. మనం కూడా అదే నమ్ముతాము. ఎందుకని వాళ్ల పిల్లల్ని మన ప్రాంతంలోనే చదువుపించరు. అంటే విద్య వ్యవస్థను వారు మార్చరు అనే భావనతోనే కదా! ఎందుకని ఇన్ని విన్యాసాలు పదవుల కోసమేకదా ! పార్టీలకు అతీతంగా ఏ ఒక్క రాజకీయ నాయకులు ఎందుకు చేయడం లేదు. వారు చేర్పించి అందరిని ఇన్స్పైర్ చేయచ్చుకదా.

- సునీల్ కుర్రే, ఆరేపల్లి,భూపాలపల్లి

మన వి ఎడిట్ పేజీకి..


ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ఏఐతో పర్యావరణ హననం.. ఉన్నదా పరిష్కారం!


ఫిరోజ్ ఖాన్

చాట్ జీపీటీలో అడిగే ప్రతి ప్రశ్నకు ఒక చుక్క నీరు ఖర్చవుతుంది. ఇటీవల ఒక సమావేశంలో ఓపెన్ ఏఐ సీఈఓ సామ్ ఆల్ట్ మాన్ చెప్పిన మాటలివి. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి రోజు చాట్ జీపీటీకి 2.5 బిలియన్లు అంటే 250 కోట్ల క్వరీస్ వస్తాయి. ఈ లెక్కన తీసుకున్నా ప్రతి రోజు లక్షల లీటర్ల నీరు ఒక్క చాట్ జీపీటీ వంటి ఏఐకు అవసరం. అయితే ఇది సామ్ ఆల్ట్ మాన్ చెప్పిన అతి తక్కువ లెక్క మాత్రమే. దీనికి పది రెట్లు ఎక్కువ నీరు ఖర్చవుతుందని ఒక అంచనా. ఈ ప్రకారం చూసుకున్నా.. ఏఐ వల్ల మనుషుల ఉద్యోగం, ఉపాధి మీద ప్రభావం పడడమే కాదు భూమిపై పర్యావరణానికి తీవ్ర హాని కలుగుతున్నది. గ్లోబల్ వార్మింగ్‌కు ఇది కారణమవుతున్నది. అయితే ఏఐ వల్ల నష్టాలను పక్కనపెడితే శాస్త్ర, సాంకేతిక, వైద్య, విద్య, వాతావరణ మార్పుల అంచనా, ఖగోళ పరిశోధన రంగాలు ఏఐ వల్ల దూసుకుపోతున్నాయి. క్యాన్సర్ వంటి రోగాలు పూర్తిస్థాయిలో నయమయ్యేలా సమీప భవిష్యత్తులో వ్యాక్సిన్, మందులు ఏఐ వల్ల సాధ్యమయ్యే అవకాశాలున్నాయి. విద్యారంగంలోనూ సమూల మార్పులు చోటుచేసుకోనున్నాయి. ఈ నేపథ్యంలో అనేకసమస్యలకు, రోగాలకు పరిష్కారమార్గాలు చూపుతున్న ఏఐ.. తన వల్ల ఏర్పడుతున్న పర్యావరణ సమస్యకు కూడా పరిష్కారం వెతికే ప్రయత్నం చేయాలి. ఆయా కంపెనీలు ముందుగా అటువైపు దృష్టిసారించాలి. ఏఐ వెనక ఊహించని విధ్వంసం జరుగుతున్నదని అనేక మంది పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా చాట్ జీపీటీ (ఓపెన్ ఏఐ), గ్రోక్ (ఎక్స్), జెమినీ (గూగుల్), డీప్ సీక్, మైక్రోసాఫ్ట్, అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఏడబ్ల్యూఎస్), మెటా, ఎన్‌విడియా, ఇంటెల్, సిస్కో, ఎక్స్ వంటి కంపెనీలు ఏఐని అభివృద్ధి చేస్తూ వినియోగంలోకి తీసుకువస్తున్నాయి. ఇంకా అనేక కంపెనీలు ఈ రంగంలో తమ సత్తా చాటుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. అయితే ఏఐ కోసం ఇలాంటి కంపెనీలకు డేటా సెంటర్లు అత్యంత ప్రాముఖ్యం కలిగి ఉంటాయి. ఏఐ విస్తృత వినియోగం వల్ల ఈ డేటా సెంటర్లలో ఉండే సర్వర్లు, సూపర్ కంప్యూటర్లు నిరంతరం వేడెక్కుతాయి. వీటిని చల్లబర్చడానికి ప్రతి రోజు కోట్ల లీటర్ల నీరు అవసరమవుతున్నది. ప్రపంచవ్యాప్తంగా డేటాసెంటర్లు ప్రస్తుతం 560 బిలియన్ లీటర్ల నీటిని వినియోగిస్తున్నా



యి. సమీప భవిష్యత్తులో ఇది 1200 బిలియన్ లీటర్లకు పెరగవచ్చు. ఒక సాధారణ డేటా సెంటర్ రోజుకు 5 మిలియన్ గ్యాలన్ల నీటిని వాడుతుంది. ఇది 10,000 నుండి 50,000 మంది నివసించే ఒక పట్టణ ప్రజల నీటి వినియోగానికి సమానం. 2027 నాటికి ఏఐ కోసం 6.6 బిలియన్ క్యూబిక్ మీటర్ల నీరు అవసరమవుతుందని అంచనా. గూగుల్, మైక్రోసాఫ్ట్, మెటా కంపెనీలు 2022లోనే 580 బిలియన్ గ్యాలన్ల నీటిని వాడాయి. ఈ నేపథ్యంలో ఏఐ కంపెనీలు వినియోగించే డేటా సెంటర్లు ఉన్నఅమెరికా, ఐరోపా, సింగపూర్, సౌదీ అరేబియా, యూఏఈ వంటి దేశాల్లో నీటి కొరత ఏర్పడుతున్నట్లు తెలుస్తున్నది. ఏఐకి నీటి కేటాయింపులు చేస్తుండడంతో స్థానిక ప్రజల తాగు నీరు, వ్యవసాయ అవసరాలకు కేటాయింపులు తగ్గుతున్నాయనే విమర్శలు వస్తున్నాయి. అనేక రకాలుగా పర్యావరణంపై ప్రభావం..ఓపెన్ ఏఐ లాంటి సంస్థలు లాంగ్ ఏఐ మోడల్స్ శిక్షణ కోసం వేలకొద్దీ గ్రాఫిక్ ప్రాసెసింగ్ యూనిట్లను ఉపయోగించాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియలో విపరీతమైన విద్యుత్ ఖర్చవుతుంది. 2023లో యూఎస్‌లోని డేటా సెంటర్లు ఆ దేశ వినియోగంలో ఉన్న విద్యుత్‌లో 4.4 శాతం కరెంట్‌ను వాడాయి. 2028నాటికి ఇది 12 శాతానికి పెరిగే అవకాశముంది. అయితే ఆ విద్యుత్ ఉత్పత్తి కోసం వినియోగించే బొగ్గు, ఇతర శిలాజ ఇంధనాల వల్ల వందల టన్నుల కర్బన ఉద్గారాలు విడుదలవుతున్నాయి. ఏఐ కోసం వినియోగించే చిప్‌ల వల్ల కూడా పర్యావరణానికి హాని ఏర్పడుతున్నది. చిప్‌ల తయారీ కోసం వేల గ్యాలన్ల శుద్ధి చేసిన నీరు అవసరం. అంతేకాకుండా సిలికాన్, బంగారం, ప్లాటినం వంటి ఖనిజాలను భూమి నుంచి వెలికి తీయడానికి భారీగా మైనింగ్ చేయాల్సి ఉంటుంది. దీనికోసం అడవులను నిర్మూలిస్తున్నారు. భూమి సైతం కోతకు గురవుతున్నది. అంతేకాకుండా పాడైపోయాక ఆ చిప్‌లను పారేస్తుండడం వల్ల పర్యావరణానికి మరింత నష్టం జరుగుతున్నది. ముందుగా పరిష్కారం వెతకాల్సింది దీనికే. అనేక రంగాల్లోని క్లిష్టమైన సమస్యలకు పరిష్కార మార్గాలు వెతుకుతున్న ఏఐ ముందుగా తన వల్ల జరిగే పర్యావరణ హననానికి పరిష్కారాన్ని వెతకాలి. సౌర, పవన శక్తి ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను మాత్రమే వినియోగించేలా చర్యలు తీసుకోవాలి. తక్కువ శక్తిని వినియోగించే ఏఐ అల్గారిథమ్స్‌ను రూపొందించుకోవాలి. తమ కంపెనీల వల్ల కలిగేపర్యావరణ ప్రభావాన్ని ముందుగా ఈ కంపెనీలు ప్రజలకువివరించాలి. ప్రజలు కూడా ఏఐ వినియోగంలో జాగ్రత్తలు తీసుకోవాలి. అనవసర ప్రశ్నలకు, ఏఐలో హలో, హాయ్, ధన్యవాదాలు వంటి పదాలకు దూరంగా ఉండాలి. ఏఐ వల్ల అనేక సమస్యలకు పరిష్కారాలు దొరుకుతున్నాయనుకొని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రపంచం ముందు పర్యావరణానికి సంబంధించి మరో పెద్ద సమస్య ఏర్పడే ప్రమాదముంది. ●

# పార్లమెంటులో బిసి బిల్లు పెట్టండి



## బిసిలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ అవసరం

### ఢిల్లీలో భారీ ప్రదర్శన జరిపిన జాతీయ బిసి సంక్షేమ సంఘం

### మోడీ నాయకత్వంలోనే రిజర్వేషన్లు సాధిస్తాం: ఎంపి ఆర్ కృష్ణయ్య

**హైదరాబాద్, ఆగస్టు 18 ప్రభాతవార్త:** పార్లమెంట్‌లో బి.సి బిల్లు పెట్టి చట్టసభలలో బి.సిలకు 50 శాతం రిజర్వేషన్లు పెట్టాలని, కేంద్రంలో బిసిలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ పెట్టాలని, బి.సి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని, ప్రైవేటు రంగంలో ఎస్సీ,ఎస్టీ, బిసిలకు రిజర్వేషన్లు పెట్టాలని జాతీయ బి.సి సంక్షేమ సంఘం అధ్వర్యంలో ఢిల్లీలోని పార్లమెంట్ వద్ద భారీ ప్రదర్శన జరిపారు. ఈ మహాప్రదర్శనలో పార్లమెంట్ సభ్యుడు ఆర్ కృష్ణయ్య, రాష్ట్ర బిసి సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నీలా వెంకటేష్, జిల్లపల్లి అంజి,పగిళ్ల సతీష్ తదితర బిసి సంఘాల నాయకులు పెద్ద ఎత్తున పార్లమెంట్‌కు రావడంతో జంతర్ మంతర్ దద్దరిల్లిపోయింది. ఈ సందర్భంగా ఎంపి ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ 'కేంద్రంలోని ప్రభుత్వం తొలిసారిగా జనగణనలో కులగణన చేపడుతుంది. కుల గణన తర్వాత బిసిలకు చట్టసభలలో 50 రిజర్వేషన్లు, కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖ, జనాభా ప్రకారం విద్య, ఉద్యోగ రిజర్వేషన్లుపెంపు వంటి నిర్ణయాలు కూడా తీసుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. బి.సి.లు అన్ని రంగాలలో అభివృద్ధి మోడీ ద్వారానే జరుగుతుందన్నారు. బిసిలకు రిజర్వేషన్లను జనాభా గ్రూపులుగా వర్గీకరణ చేయడానికి జస్టిస్ రోహిణి అధ్యక్షతన కమిటీ నియమించారని, ఆ రిపోర్ట్ ప్రకారం గ్రూపులు చేస్తున్నారు. అలాగే ప్రత్యేక సంక్షేమ పథకాల రూపకల్పన, అవసరమైన బడ్జెటు కేటాయింపు, కార్యాచరణ ప్రణాళిక అమలులో ముందడుగు వంటివాటికి మార్గం సుస్పష్టం అవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. పంచాయతీరాజ్ సంస్థలో బి.సి. రిజర్వేషన్లను 22శాతం నుంచి 50 శాతంకు పెంచాలి. ఈ రిజర్వేషన్లకు రాజ్యాంగ భద్రత కల్పించాలని కోరారు. బిసిల విద్యా, ఉద్యోగ, రిజర్వేషన్లపై ఉన్న క్రిమిలేయర్‌ను తొలగించాలని, బిసిలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలి. బిసిల అభివృద్ధికి ప్రత్యేక స్కీములను రూపొందించాలని, ఎస్సీ,ఎస్టీ అట్రా సిటీ యాక్ట్ మాదిరిగా బిసిలకు సామాజిక రక్షణ, భద్రత కల్పించడానికి బిసి యాక్ట్ తీసుకురావాలని కోరారు. జడ్జీల నియామకాలలో ఎస్సీ,ఎస్టీ బిసిలకు రిజర్వేషన్లు పెట్టాలని, కేంద్రంలో బిసిలకు పోస్ట్ మెట్రిక్స్ స్కాలర్ షిప్,ఫీజు రియంబర్స్‌మెంట్ స్కీము విధానం సాచురేషన్ పద్ధతిలో ప్రవేశపెట్టాలి. రాష్ట్రాలకు 80 మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వాలని, కేంద్ర ప్రభుత్వ శాఖలలో, ప్రభుత్వ రంగ సంస్థలలో ఖాళీగా ఉన్న 16 లక్షల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. కేంద్ర స్థాయిలో 2 లక్షల కోట్ల బడ్జెట్ బిసిసబ్ ప్లాన్ ఏర్పాటు చేయాలని కృష్ణయ్య డిమాండ్ చేశారు.



సోమవారం న్యూఢిల్లీలో ప్రధాని మోడీతో భేటీ అయిన రాధాకృష్ణన్

# ప్రధాని మోడీతో రాధాకృష్ణన్ భేటీ

### రేపు నామినేషన్ వేసే అవకాశం

**న్యూఢిల్లీ, ఆగస్టు 18:** మహారాష్ట్ర గవర్నర్, ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థి సిపి రాధాకృష్ణన్ ప్రధానమంత్రి నరేంద్రమోడీని సోమవారం కలుసుకున్నారు. ఎన్డీయే సమావేశాల్లో పాల్గొనేందుకు, పలువురు నేతలను కలుసుకునేందుకు రాధాకృష్ణన్ ఢిల్లీకి వచ్చారు. రాధాకృష్ణన్‌తో భేటీ తర్వాత ప్రధాని మోడీ ఆ వివరాలను సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో తెలిపారు. 'రాధాకృష్ణన్‌ను కలుసుకున్నాను. ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ఆయనకు నా అభినందనలు తెలియజేశాను. సుదీర్ఘ ప్రజాసేవ, అనుభవంతో ఆయన దేశ కీర్తిని పెంచారు. అదే అంకితభావంతో దేశానికి సేవలు కొనసాగించాలని కోరుకుంటున్నాను' అని ఆ ట్వీట్‌లో మోడీ పేర్కొన్నారు. కాగా, ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ఈ నెల 20న రాధాకృష్ణన్ నామినేషన్‌వేసే అవకాశం ఉంది. మంగళవారం జరిగే ఎన్డీయే పార్లమెంటరీ సమావేశంలో ఆయనను సన్మానించనున్నట్లు పార్టీ వర్గాల సమాచారం. ఆదివారం జరిగిన పార్టీ పార్లమెంటరీ బోర్డు సమావేశం తర్వాత రాధాకృష్ణ పేరును సమావేశంలో ఎంపిక చేసినట్లు బిజెపి అధ్యక్షుడు జెపి నడ్డా ప్రకటించారు. ఏకగ్రీవంగా యానకు విపక్షాలు మద్దతు తెలపాలని కోరారు. గత వారంరోజులుగా విపక్ష నేతలతో బిజెపి నేతలు మాట్లాడుతున్నారని, తిరిగి వారిని కలుస్తారని చెప్పారు. సెప్టెంబరు 9న ఉపరాష్ట్రపతి ఎన్నిక జరుగనుంది. ఈ నెల 21వ తేదీతో నామినేషన్ల గడువు ముగుస్తుంది.

## అలాస్కా భేటీకి ఆ సూట్‌కేస్ తీసుకెళ్లిన బాడీగార్డులు!

**వాషింగ్టన్, ఆగస్టు 18:** తమ ఆరోగ్యానికి సంబంధించిన విషయాలు బయటకు చిక్కకుండా ప్రపంచ నేతలు జాగ్రత్తలు పాటిస్తుంటారు. ఉక్రెయిన్‌తో యుద్ధం ముగింపుపై చర్చించేందుకు ఇటీవల అలాస్కాలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో భేటీ అయిన సందర్భంగా రష్యా అధ్యక్షుడు పుతిన్ ఇలాంటి జాగ్రత్తే తీసుకున్నారట. పుతిన్ మలవ్యర్థాలను తీసుకెల్లడానికి ప్రత్యేకంగా ఓసూట్‌కేసును ఆయన బాడీగార్డులు మోసుకెళ్లారట. ఆ పూప్ సూట్‌కేసులో వాటిని సేకరిస్తారని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. పుతిన్ ఎప్పుడు విదేశాల్లో పర్యటించినా ఇలావాటినిసేకరించి స్వదేశానికితీసుకెళతారని గతంలోనూవార్తలు వచ్చాయి.

**ఎందుకు సేకరిస్తారు?**

పుతిన్ విదేశాల్లో పర్యటించినప్పుడు ఆయన రక్షణ బాధ్యత ఫెడరల్ ప్రొటెక్షన్ సర్వీస్ నిర్వహిస్తుంది. పుతిన్‌తోపాటు ఇతర ప్రభుత్వ అధికారుల సంరక్షణనూ ఈ ఎఫ్‌పిఎస్ చూసుకుంటుంది. పుతిన్ కాలకృత్యాలకు వెళ్లిన ప్రతిసారి ఓ ఎఫ్ఎస్ఒ ఏజెంట్ (ఫెడరల్ గార్డ్ సర్వీస్) వ్యర్థాలను సేకరించి ఓ ప్రత్యేకమైన ప్యాకెట్‌లో భద్రపరుస్తారు. తర్వాత వాటిని ఓ సూట్‌కేసులో ఉంచి రష్యాకు తీసుకెళ్తారు. గతంలో ఫ్రాన్స్ పర్యటనలో పుతిన్ బాత్‌రూమ్‌కు వెళ్లినప్పుడు ఆయన వెంట ఆరుగురు బాడీగార్డులు తోడుగా ఉన్నారు. అందులో ఒక వ్యక్తి చిన్న సూట్‌కేసును తీసుకొని బాత్‌రూమ్ నుంచి బయటకు వచ్చినట్లు ఉన్న విడియో గతంలో వైరల్‌అయింది. వ్లాదిమిర్ పుతిన్ ఆరోగ్య రహస్యాలు విదేశీ గూఢచారులకు చిక్కకుండా ఉండేందుకు క్రెమ్లిన్ ఇటువంటి జాగ్రత్తలు తీసుకుంటుందని పలు కథనాలు వెల్లడించాయి.

# యుద్ధం ముగింపు నమ్మేటట్లు ఉండాలి

### ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ



**కీవ్, ఆగస్టు 18:** రష్యాతో జరుగుతున్న యుద్ధాన్ని ప్రపంచం నమ్మేలా ముగించాలి అని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ వ్యాఖ్యానించారు. అమెరికా అధ్యక్షుడితో శిఖరాగ్ర సమావేశంలో పాల్గొనేందుకు ఆయన సోమవారం సాయంత్రం వాషింగ్టన్ డిసికి చేరుకొన్నారు. ఈ సందర్భంగా ట్రంప్, ఐరోపా నేతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. 'యుద్ధం ముగియాలనే బలమైన మా ఆకాంక్షను తెలియజేశాం. ఉక్రెయిన్‌ను రక్షించుకొంటానన్న నమ్మకం నాకుఉంది. అదే సమయంలో మా భద్రతకు హామీ కూడా పొందుతానేభావిస్తున్నాను. రష్యా ప్రారంభించిన యుద్ధాన్ని అదే ఆపేయాలి' అని జెలెన్‌స్కీ వ్యాఖ్యానించారు. గతంలో అంతగా ప్రయోజనం లేని సెక్యూరిటీ గ్యారెంటీ కాకుండా.. ఈసారి భద్రతకు బలమైన హామీ ఇవ్వాలని జెలెన్‌స్కీ కోరారు. ఉక్రెయిన్‌వాసులు వారి భూమి, స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్నారన్నారు. అమెరికా, ఐరోపా నుంచి వచ్చే ఒత్తిడితో రష్యా శాంతి ఒప్పందం వైపు మళ్లుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

**వాటిని మర్చిపోవాల్సిందే.. : ట్రంప్**

అంతకుముందే ట్రంప్ జెలెన్‌స్కీకి పూర్తిగా భిన్నమైన ప్రకటనచేశారు. ఈ మేరకు ఆయన ట్రూత్‌లో పోస్టుచేశారు. 'ఉక్రెయిన్ అధినేత జెలెన్‌స్కీ తక్షణమే యుద్ధం విరమించవచ్చు లేదా కావాలనుకుంటే కొనసాగించవచ్చు. కానీ, ఒబామా ఇచ్చేసిన క్రిమియాను మాత్రం తిరిగి పొందలేరు. మరో విషయం ఉక్రెయిన్ నాటో సభ్యత్వం పొందలేదు. కొన్నివిషయాలను మార్చలేము' అని కుండబద్దలు కొట్టినట్లు చెప్పారు. జెలెన్‌స్కీ-ట్రంప్ మధ్య గతంలో వివాదం జరిగిన నేపథ్యంలో ఈసారి భేటీకి పెద్దఎత్తున ఐరోపా, నాటో నేతలు తరలివచ్చారు. బ్రిటన్ ప్రధాని స్టార్మర్, ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్, ఇటలీప్రధాని మెలోని, ఫిన్లాండ్ ప్రధాని అలెగ్జాండర్ స్టబ్, ఐరోపా కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్‌డెర్, నాటోచీఫ్ మార్క్ రుట్టె పాల్గొననున్నారు.

**మాకూ సెక్యూరిటీ గ్యారెంటీ కావాలి: రష్యా**

భవిష్యత్తులో జరగబోయే శాంతి ఒప్పందంలో తమకు కూడా సెక్యూరిటీ గ్యారెంటీ కావాలని రష్యా పేర్కొంది. ఈ మేరకు రష్యా ప్రతినిధి మిఖాయిల్ ఉల్యానోవ్ ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. 'చాలా ఐరోపా దేశాలు భవిష్యత్తు శాంతి ఒప్పందంలో ఉక్రెయిన్ శాంతికి హామీ ఇవ్వాలని కోరుకుంటున్నారు. దీనికి రష్యా అంగీకరిస్తుంది. కానీ, అదే రక్షణ హామీ మా దేశానికి కూడా అవసరమే' అని పేర్కొన్నారు.

## ఇండియా కూటమి అభ్యర్థిగా డిఎంకె నేత, ఎంపి తిరుచ్చి శివ!

### ఉపరాష్ట్రపతి ఎన్నిక

**చెన్నై, ఆగస్టు 18:** వచ్చే నెల 9న జరిగే ఉపరాష్ట్రపతి ఎన్నికకు సంబంధించి ఎన్‌డిఎ కూటమి తమ అభ్యర్థిని ప్రకటించిన విషయం తెలిసిందే. మహారాష్ట్ర గవర్నర్ సిపి రాధాకృష్ణన్ (67)ను తమ అభ్యర్థిగా బిజెపి పార్లమెంటరీ బోర్డు సమావేశంలో ఎంపిక చేసినట్లు కూటమికి నేతృత్వం వహిస్తున్న బిజెపి వెల్లడించింది. అయితే విపక్ష ఇండియా కూటమి కూడా తమ అభ్యర్థిని బరిలోకి దింపేందుకు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. ఇందులో భాగంగానే ఇవాళ విపక్ష కూటమిపార్టీలు సమావేశమయ్యాయి. ఈ సమావేశంలో ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా డిఎంకె పార్టీకి చెందిన రాజ్యసభ ఎంపి తిరుచ్చి శివ పేరును ఆ పార్టీ ప్రతిపాదించినట్లు సమాచారం. ప్రస్తుతం డిఎంకె కీలక భాగస్వామిగా ఉన్న విషయం తెలిసిందే. దీంతో రాజ్యసభ ఎంపి తిరుచ్చి శివను ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా 'ఇండియా' కూటమి ప్రకటించే అవకాశాలున్నాయని విశ్వసనీయ వర్గాలుతెలిపాయి. తమిళనాడు నుంచి ఉపరాష్ట్రపతి అభ్యర్థిని ఎన్‌డియే ప్రకటించడంతో అదే తమిళనాడు నుంచి డిఎంకె అభ్యర్థిని దించడం ద్వారా బిజెపి వ్యూహాన్ని తిప్పికొట్టాలని విపక్ష కూటమి భావిస్తోంది. అయితే దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

## కాశ్మీర్‌లో భద్రతా బలగాలకు సవాల్ విసురుతున్న బెడ్‌రూం జిహాదీలు

**హైదరాబాద్, ఆగస్టు 18, ప్రభాతవార్త:** కాశ్మీర్‌లో ఉగ్రవాదులతో పోరాడుతున్న భద్రతా బలగాలకు కొన్నిరోజులుగా కొత్తసమస్య వచ్చి పడింది. ఫలానా ప్రాంతంలో రెండు వర్గాల మధ్య గొడవలు తలెత్తాయని, ఈ గొడవల్లో కొందరు చనిపోయారని, మరికొందరు తీవ్రంగా గాయపడ్డారని, గొడవలను అదుపు చేయడంలో పోలీసులు విఫలమయ్యారని సోషల్ మీడియాలో వస్తున్న వరుస కథనాలు కాశ్మీర్‌లో విధులు నిర్వహిస్తున్న పోలీసులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. సోషల్ మీడియాలోవస్తున్న ఈ కథనాలను పాక్‌ప్రేరితఉగ్రవాదులకు సానుభూతి పరులుగా వుంటున్న కొందరు యువకులు తమ ఇంట్లో కూర్చుని వ్యాపింప చేస్తున్నట్లు భద్రతా బలగాలు గుర్తించాయి. ఈ క్రమంలోనే వీటికి బెడ్‌రూం జిహాదీలుగా పేరు ఏర్పడింది. కాశ్మీర్ అంతటా ఈతరహా కార్యక్రమం పెరిగే అవకాశాలున్నాయని గుర్తించిన నిఘావర్గాలు పోలీసులను అప్రమత్తం చేశాయి. ఇందుకోసం ఉగ్రవాద సానుభూతిపరులు నకిలీ ఖాతాలను తెరిచి వాటి ద్వారా తప్పుడు కథనాలను వ్యాపింప చేస్తున్నట్లు నిఘా వర్గాలు నిర్ధారణకు వచ్చాయి. ఉగ్రవాదులకు సానుభూతి పరులుగా వున్న యువకులకు పాక్‌లోని ఉగ్రవాద సంస్థల నుంచి నిధులు అందుతున్నట్లు నిఘా వర్గాలు గుర్తించాయి, దాదాపు రెండు నెలలుగా కాశ్మీర్‌లో కొనసాగుతున్న బెడ్‌రూం జిహాదీ ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపాలని భద్రతా బలగాలకు కేంద్ర హోంశాఖ ఆదేశించింది. వేల సంఖ్యలో సోషల్ మీడియాలో వస్తున్న తప్పుడు కథనాలను వెంటనే నియంత్రించాలని భద్రతా బలగాలకు కేంద్ర హోం శాఖ ఆదేశించింది. వీరికి పాక్‌లోని హ్యాండర్లకు సంబంధం వుందని కేంద్ర హోం శాఖకు ఆధారాలు లభించాయి. కంప్యూటర్లు స్మార్ట్ ఫోన్ల సహాయంతో జిహాదీలు ఎక్కడపడితే అక్కడి నుంచి సోషల్ మీడియాలో పోలీసులను టార్గెట్‌చేస్తూ ఆయా ప్రాంతాలలో అల్లర్లు చెలరేగాయని, అశాంతి నెలకొందని తప్పుడు కథనాలను ప్రసారం చేస్తున్నారు.

# కొనుగోలుదార్లను వెతుక్కుంటూ రష్యా సహజవాయువు నౌకలు



### అమెరికా ఆంక్షల నేపథ్యం

**మాస్కో, ఆగస్టు 18:** అమెరికా ఆంక్షలకు గురైన రష్యాలోని ఓ సహజవాయువు కేంద్రం నుంచి రెండు ట్యాంకర్లు కొనుగోలుదార్లను వెతుక్కుంటూ ఆసియాకు బయల్దేరాయి. ఓవైపు వాషింగ్టన్‌లో శాంతిచర్చల వేళ.. ఈ ద్రవీకృత సహజవాయువు (ఎల్ఎన్‌జి) సరఫరా చేస్తున్న భారీ నౌకలు ఆసియ వైపు రావడం చర్చనీయాంశంగా మారింది. ది ఐరిస్, వోస్కోడ్ నౌకలు సైబీరియాలోని ఆర్కిటిక్ ఎల్ఎన్‌జి-2 ప్లాంట్ నుంచి ఉత్తర ఆసియాకు బయల్దేరాయి. ఉత్తర సముద్ర మార్గంలో ప్రయాణం మొదలుపెట్టాయని బ్లూమ్‌బెర్గ్‌షిప్ ట్రాకింగ్ డేటా వెల్లడిస్తోంది. వాస్తవానికి ఈ ట్యాంకర్లు కొన్ని నెలలపాటు సముద్రంలో ఖాళీగా ఉన్నాయి. ఆర్కిటిక్-2 ప్లాంట్‌ను నోవాటెక్ పిజెఎస్‌సి నిర్వహిస్తోంది. 2030 నాటికి రష్యా గ్యాస్ ఎగుమతులను మూడింతలు చేయాలన్న లక్ష్య సాధనకు ఈ కంపెనీ అత్యంత కీలకమైంది. ఐరోపా నుంచి పైప్‌లైన్‌లో గ్యాస్ కొనుగోళ్లు తగ్గాక ప్రత్యామ్నాయాలను అన్వేషిస్తూ మాస్కో ఈ లక్ష్యాన్ని ఎంచుకుంది. ఆర్కిటిక్-2 ప్లాంట్ గత వేసవిలో దాదాపు ఎనిమిది కార్గోలను ఎగుమతి చేసింది. కానీ, అక్టోబర్ నాటికి మంచు తీవ్రం కావడంతో కొనుగోలుదారులు దొరక్క ఉత్పత్తి నిలిపివేసింది. ఈ ప్లాంట్‌పై బైడెన్ కార్యవర్గం ఆంక్షలు విధించింది. ఆర్కిటిక్-2 ఈ యేడాది జూన్‌లో తిరిగి నౌకల్లో ఎల్ఎన్‌జి నింపడం మొదలుపెట్టింది. ఇప్పటివరకు అక్కడి నుంచి బయల్దేరిన నౌకలు ఏ పోర్టులోనూ ఆగలేదు. ఇక్కడి నుంచి ఆసియాకు బయల్దేరిన నాలుగు నౌకలు కొనుగోలుదారులను వెతుక్కుంటూ ఆసియాకు బయల్దేరాయి. మంచులో ప్రయాణించే మరో డజన్ నౌకలను ఆర్కిటిక్-2 కోసం సిద్ధంగా ఉంచారు. రష్యా నుంచి చమురు, సహజవాయువు అత్యధికంగా కొనుగోలు చేస్తున్న దేశాల్లో భారత్, చైనా ముందు వరుసలో ఉన్నాయి. ఇప్పటికే న్యూఢిల్లీపై వాషింగ్టన్ పెనాల్టీలు విధించిన విషయం తెలిసిందే.

# ముంబయి గణేశుడి మండపానికి రూ.474 కోట్ల ఇన్సూరెన్స్!



**ముంబయి, ఆగస్టు 18:** యావత్ భారతదేశం గణపతి నవరాత్రి ఉత్సవాలకు సిద్ధమవుతోంది. విభిన్న ఆకృతుల్లో కొలువుదీరే వినాయకుల కోసం అంతటా మండపాలను ముస్తాబు చేస్తున్నారు. ప్రతియేటా ఖరీదైన గణేశుడి విగ్రహాలు, భారీ సెట్టింగ్‌లతో ఏర్పాటయ్యే తాత్కాలిక మండపాలు ఆకర్షణగా నిలుస్తుంటాయి. ఏదైనా జరిగితే భారీగా నష్టపోకుండా కొన్ని మండపాలకు ఇన్సూరెన్స్ చేస్తారు. ఈ నేపథ్యంలోనే ముంబైలోని ఓ గణేశుడి మండపానికి కూడా ఏకంగా రూ.474.46 కోట్లకు ఇన్సూరెన్స్ చేయించారు. ఈ మేరకు ఓ జాతీయ మీడియా సంస్థ కథనాన్ని ప్రచురించింది. ముంబై శివారులోని మతుంగా ప్రాంతంలో గత ఏడు దశాబ్దాలుగా జిఎస్‌బి సేవామండల్ వినాయక చవితి వేడుకలను ప్రత్యేకంగా నిర్వహిస్తున్నది. ఈసారి 71వ వార్షికోత్సవం జరగనుంది. దేశంలోనే సంపన్న వినాయకుడిగా పేరొందిన ఈ విఘ్నేశ్వరుడి వేడుకలకు ఈ ఏడాది ఏకంగా రూ.474.46 కోట్లతో బీమా చేయించారు. ఇక్కడి విగ్రహాన్ని భారీ ఎత్తున బంగారం, వెండి ఆభరణాలతో అలంకరించనుండటమే అందుకు కారణం.

గత ఏడాది సైతం ఈ గణేష్ మండపానికి రూ.400.58 కోట్లతో బీమా చేయించినట్లు నిర్వాహకులు మీడియాకు వెల్లడించారు. ఇప్పుడు బంగారం, వెండి ధరలు పెరగడంతో బీమా విలువను కూడా పెంచారు. అందులో పూజారులు, నిర్వాహకులు, సహాయకులు, భద్రతా సిబ్బందికి రూ.375 కోట్లతో వ్యక్తిగత ప్రమాద బీమా తీసుకున్నారు. గణపయ్యకు అలంకరించే బంగారం, వెండి ఆభరణాలకు రూ.67 కోట్లతో బీమా చేయించారు. 2023, 2024 సంవత్సరాల్లో గణపయ్య ఆభరణాలకు వరుసగా రూ.38 కోట్లు, రూ.43 కోట్లు బీమా కవరేజ్ తీసుకున్నారు. అంతేగాక అగ్నిప్రమాదం, భూకంపం ముప్పు వంటి వాటికోసం ప్రత్యేకంగా మరో రూ.2 కోట్ల బీమా చేయించారు. అక్కడి ఫర్నీచర్‌కు, కంప్యూటర్‌లు, సిసిటివిలు, స్కానర్‌లు ఇన్సూరెన్స్ పరిధిలో ఉన్నాయి. పబ్లిక్ లయబిలిటీ ఇన్సూరెన్స్ కింద రూ.30 కోట్లు కేటాయించారు. భక్తుల సౌలభ్యంకోసం క్యూఆర్ కోడ్, డిజిటల్ లైవ్ సేవలను కూడా నిర్వాహకులు అందుబాటులోకి తెచ్చారు. భద్రతా చర్యల్లో భాగంగా ఫేషియల్ రికగ్నిషన్ కెమెరాలను కూడా ఏర్పాటు చేశారు.

## సంక్షిప్తంగా..

### నిరుపయోగంగా 13 కోట్ల జనధన్ ఖాతాలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 18:** దేశవ్యాప్తంగా 56.04 కోట్ల పిఎం జన్‌ధన్ ఖాతాల్లో దాదాపు 23 శాతం నిరుపయోగంగా ఉన్నట్లు కేంద్ర ఆర్థిక శాఖ సహాయమంత్రి పంకజ్‌చౌదరీ వెల్లడించారు. ఈ యేడాది జూలై 31 నాటికి 13.04 కోట్ల జన్‌ధన్ ఖాతాలు ఇన్‌ఆపరేటివ్‌లో ఉన్నట్లు లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానంలో తెలిపారు. ఇటువంటి ఖాతాలు అత్యధికంగా ఉత్తరప్రదేశ్‌లో (2.75 కోట్లు) ఉన్నట్లు చెప్పారు. బీహార్ (1.39 కోట్లు), మధ్యప్రదేశ్ (1.07 కోట్లు) రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. ఆర్బీఐ నిబంధనల ప్రకారం.. ఒక పొదుపు ఖాతాలో వినియోగదారుడి తరపు నుంచి రెండేళ్లకుపైగా ఎలాంటి లావాదేవీలు జరగకపోతే వాటిని ఇన్‌ఆపరేటివ్ ఖాతాగా పరిగణిస్తారు. 'యుపిఐ సేవలు సజావుగా సాగేందుకు కేంద్ర ప్రభుత్వం గత నాలుగు ఆర్థిక సంవత్సరాలల్లో దాదాపు రూ.8,730 కోట్ల ప్రోత్సహకాలు అందించింది' అనిచెప్పారు. 2014లో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిరుపేద భారతీయులకు సైతం బ్యాంకు బ్యాంకు ఖాతా సౌకర్యంకల్పించడానికి ప్రధానమంత్రి జన్‌ధన్‌పథకాన్ని ప్రారంభించారు. ఈ పథకాన్ని ప్రారంభించి పదేళ్లు పూర్తయిందని, పెద్ద సంఖ్యలో ఖాతాలకు రీ-కెవైసి చేయాల్సి ఉందని ఇటీవల గవర్నర్ సంజయ్‌మల్హోత్రా వెల్లడించారు. రీ-కెవైసికి ఈయేడాది సెప్టెంబరు 30వరకు గడువు ఉందన్నారు.

### ఢిల్లీలో పలు స్కూళ్లకు బాంబు బెదరింపులు

**న్యూఢిల్లీ, ఆగస్టు 18:** దేశ రాజధాని ఢిల్లీలో బాంబు బెదరింపులు మరోసారి కలకలం రేపాయి. సోమవారం ఉదయం నగరంలోని పలు విద్యాసంస్థలకు ఇలాంటి బెదరింపులే వచ్చాయి. ద్వారకా ప్రాంతంలోని రెండు పాఠశాలలు, ఓ కళాశాలకు ఉదయం బాంబు బెదరింపులు వచ్చినట్లు పోలీసులు తెలిపారు. ఇ మెయిల్ ద్వారా ఆయా విద్యా సంస్థలకు బెదరింపులు వచ్చాయి. దీంతో అప్రమత్తమైన యాజమాన్యం వెంటనే పోలీసులకు సమాచారం అందించింది. సోమవారం ఉదయం 7:24 గంటల సమయంలో బాంబు బెదరింపులకు సంబంధించిన సమాచారం తమకు అందినట్లు ఢిల్లీ ఫైర్ డిపార్ట్‌మెంట్ తెలిపింది. సమాచారం అందగానే ఢిల్లీ పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఆయా విద్యాసంస్థల వద్దకు చేరుకుని తనిఖీలు చేపట్టారు. బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ సాయంతో పాఠశాలలు, కళాశాల ప్రాంగణంలో విస్తృతంగా సోదాలు నిర్వహించారు. అయితే ఈ తనిఖీల్లో ఎలాంటి పేలుడు పదార్థాలు, అనుమానాస్పద వస్తువులు లభించలేదు.

### ఫుడ్‌పాయిజనింగ్: 100 మంది సినీకార్మికులకు అస్వస్థత

**లేహ్, ఆగస్టు 18:** జమ్ముూకశ్మీర్‌లోని లేహ్‌లో కలుషిత ఆహారం తిని 100 మంది సినీ కార్మికులు అస్వస్థత గురయ్యారు. ప్రస్తుతం ఆ ఫిల్మ్ యూనిట్ వర్కర్ల ఆరోగ్యం స్థిరంగా ఉన్నట్లు అధికారులు చెప్పారు. ఆదివారం రాత్రివేళ ఎస్ఎన్ఎం ఆస్పత్రికి ఆ పేషెంట్లకు తీసుకువచ్చారు. తీవ్రమైన కడుపునొప్పి, తలనొప్పి, వాంతులు అవుతున్నట్లు ఆ వర్కర్లు ఫిర్యాదు చేశారు. బాలీవుడ్ సినిమా షూటింగ్ కోసం ఆ బృందం లేహ్‌లో ఉన్నది. ఆ కార్మికులు ఎవరూ స్థానికులుకాదు. ఆ లొకేషన్‌లో సుమారు 600 మంది భోజనం చేసినట్లుతెలుస్తోంది. ఘటన జరిగిన ప్రదేశంనుంచి ఆహార శ్యాంపిళ్లను విశ్లేషణ కోసం సేకరించారు. ఫుడ్ పాయిజనింగ్ జరిగినట్లు ఆస్పత్రి డాక్టర్లు చెబుతున్నారు.

### రైలు ఢీకొని ముగ్గురు మహిళలు మృతి

**డిస్‌పూర్, ఆగస్టు 18:** అస్సాంలో షాకింగ్ ఘటన చోటు చేసుకుంది. ఉదయం నడకకు వెళ్లిన ముగ్గురు మహిళలను రైలు ఢీ కొట్టింది ఈ ప్రమాదంలో వారు ప్రాణాలు కోల్పోయారు. అస్సాంలోని బామునిగావ్ రైల్వే స్టేషన్ సమీపంలో ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బోకో గ్రామానికి చెందిన ముగ్గురు మహిళలు ఇవాళ ఉదయం మార్నింగ్ వాక్‌కు వెళ్లారు. ఈ క్రమంలో రైలు పట్టాలు దాటుతున్న సమయంలో పూరి ఎక్స్‌ప్రెస్ రైలు వారిని బలంగా ఢీ కొట్టింది. ఈ ఘటనలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. బాధిత మహిళలను రూమి దాస్ (55), కొరాబి మాలు (60), ఉత్తర దాస్ (60)గా గుర్తించారు. ఈ ఘటనపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

### కేరళలోని పద్మనాభస్వామి ఆలయ కంప్యూటర్లు హ్యాక్

**తిరువనంతపురం, ఆగస్టు 18:** కేరళలోని శ్రీపద్మనాభస్వామి ఆలయం సైబర్ దాడికి గురైంది. ఆలయానికి చెందిన కంప్యూటర్ వ్యవస్థ, సర్వర్ డేటాబేస్ హ్యాకైంది. ఆలయ నిర్వాహణ అధికారి.. సైబర్ పోలీసులకు ఈ అంశంపై ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేశారు. జూన్ 13న హ్యాకింగ్ జరిగినట్లు ఎఫ్ఐఆర్‌లో ఉన్నది. టెంపుల్ ఆపరేషన్స్‌ను దెబ్బతీయాలన్న ఉద్దేశంతో కంప్యూటర్లను హ్యాక్ చేసినట్లు పేర్కొన్నారు. కంప్యూటర్లలో స్టోర్‌చేసిన కీలక సమాచారాన్ని ట్యాంపర్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అంతర్గత వివాదాల వల్ల హ్యాకింగ్ ఘటన జరిగి ఉంటుందని ప్రాథమిక విచారణ ద్వారా తెలుస్తోంది.

# హెచ్‌సిఎ అక్రమాలలో కెటిఆర్, కవిత పాత్రపై నిగ్గు తేల్చాలి

## సిఐడిని కోరిన టిసిఎ కార్యదర్శి గురువారెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 17, ప్రభాతవార్త:** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సిఎ) అక్రమాలలో మాజీ మంత్రి, బిఆర్ఎస్ నాయకుడు కెటిఆర్‌తో పాటు ఆయన సోదరి కవిత పాత్రపై లోతుగా విచారించి నిగ్గు తేల్చాలని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి గురువా రెడ్డి సిఐడిని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం నాడు మీడియాతో మాట్లాడుతూ హెచ్‌సిఎ అక్రమాలలో క్విడ్‌ప్రోకో జరిగిందని తెలిపారు. అన్ని రాష్ట్రాల క్రికెట్ సంఘాలకు నిబంధనలు పాటించాలని బిసిసిఐ చెప్పిందని, అయితే హెచ్‌సిఎ మాత్రం కోర్టుల్లో కేసులు వేసుకుంటూ గోల్‌మాల్ వ్యవహారాల కు పాల్పడిందని ఆయన అన్నారు. హెచ్‌సిఎకి సంబంధించిన కమిటీల్లో మంత్రులెవరూ వుండవద్దని బిసిసిఐ స్పష్టంగా చెప్పినా ఇన్ఫర్మేషన్ టెక్నా లజి సబ్ కమిటీలో కెటిఆర్ కొనసాగారని, ఇది పూర్తిగా నిబంధనలకు విరుద్దమని గురువా రెడ్డి తెలిపారు. దీంతో పాటు కెటిఆర్ బావమరిది రాజ్ పాకాలకు హెచ్‌సిఎలో టికెట్ల కాంట్రాక్ట్ ఇచ్చారని ఆయన వెల్లడించారు. హెచ్‌సిఎ పెద్దలు ఆడిట్ రిపోర్టుల్లోనూ అనేక అవకతవకలకు పాల్పడ్డారని, పదేళ్ల నుంచి ఒకే ఆడిట్ రిపోర్టును ప్రతీసారి కాపీ పేస్ట్ చేసి పాస్ చేస్తూ వచ్చారని ఆయన ఆరోపించారు. ఏటా హెచ్‌సిఎ పరిధిలోని క్లబ్బులకు 6.10 కోట్ల రూపాయలను ఇస్తున్నారని, అయితే టీంలు లేని క్లబ్బులకు కూడా డబ్బులు చెల్లించడం జరిగిందని, ఇది కూడా నిబంధనలకు విరుద్ధ మని ఆయన తెలిపారు.

హెచ్‌సిఎ పరిపాలనా వ్యవహారాలకు కూడా ప్రతీనెల 12 కోట్ల రూపాయలను కేటాయించేవారని, అయితే ఖర్చులకు సంబ ంధించిన లెక్కలు మాత్రం వెల్లడయ్యేది కాదని ఆయన చెప్పారు. వీటన్నిం టిపై సిఐడి క్షుణ్ణంగా విచారించాలని, హెచ్‌సిఎ అక్రమాలలో అప్పటి బిఆ ర్ఎస్ సర్కారులో కీలకంగా వ్యవహరించిన కెటిఆర్, కవితలకు భాగస్వామ్యం వుందని, దీనిపై అన్ని వివరాలు బయటకు రావాలని ఆయన డిమాండ్ చేశారు.

# అభివృద్ధిని అడ్డుకొంటున్న బిజెపి, బిఆర్ఎస్

## ఎమ్మెల్యే ఆర్ భూపతిరెడ్డి

**హైదరాబాద్,ఆగస్టు 18,ప్రభాతవార్త:** బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు రెండు ఒకటై తెలంగాణలో కాంగ్రెస్ చేస్తున్న అభివృద్ధినీ అడ్డుకోవాలని చూస్తున్నారని ఎఎమ్మెల్యే ఆర్ భూపతిరెడ్డి ఆరోపించారు.గాంధీ భవన్‌లో సోమవారం టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ సూచన మేరకు అందుబాటులో ప్రజా ప్రతినిధుల కార్యక్ర మంలో ఆర్ భూపతిరెడ్డి పాల్గొని మాట్లాడుతూ కెసిఆర్ ఫ్యామిలిని మెంటల్ ఆసుపత్రిలో జాయిన్‌చేయాలని విమర్శించారు. కెసిఆర్ బిడ్డ బిసి అవతారం ఎత్తిందని బిసిలపై ప్రేమ ఉంటే జంతర్ మంతర్‌వద్ద ధర్నాచేయాలని కోరారు. హరిష్‌రావు అబద్దాలు ఆడకు బుద్ధితెచ్చు కో అని సలహా ఇచ్చారు. ప్రజల నుంచి దాదాపు 40 కి పైగా వినతులు స్వీకరించి పరిష్కారం కోసం ఆయా అధికారులతో మాట్లాడాని భూప తిరెడ్డి తెలిపారు.

సీఎం రేవంత్ నేతృత్వంలో ప్రజా సంక్షేమం దిశగా పాలన సాగుతోందని సంతృప్తి వ్యక్తంచేశారు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులతో పాటు వివిధ సమస్యలకు సంబంధించిన అప్లికేషన్స్ ఎక్కువగా వచ్చాయని చెప్పారు.

# జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న పేరు పెట్టాలి

## మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

**హైదరాబాద్, ఆగస్టు 18 ప్రభాతవార్త:** అన్ని కులాల కోసం పోరాడిన బహుజన విప్లవ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న అని మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ అన్నారు. బహుజన రాజ్య స్థాపన కోసం ఆయన చేసిన కృషి చిరస్మరనీయం అన్నారు. సోమవారం చిక్కడపల్లిలో తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో సమన్వయ కమిటీ చైర్మన్ బాలగౌని బాలరాజ్ గౌడ్ అధ్యక్షతన సర్దార్ సర్వాయి పాపన్న 375వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీనివాస్ గౌడ్ పాపన్న విగ్రహానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ట్యాంక్ బండ్‌పైన పాపన్న విగ్రహ ప్రతిష్టకు భూమి పూజా చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నట్లు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఎన్నో పోరాటాల ఫలితంగానే విగ్రహ ప్రతిష్ట జరుగుతుందన్నారు. మా ప్రభుత్వ హాయాంలోనే విగ్రహ ప్రతిష్ట కొరకు జివోను తీసుకొచ్చామని కొన్ని అనివార్య కారణాల వల్ల విగ్రహాన్ని ఏర్పాటు చేయలేకపోయం అన్నారు. బీసీలు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని అదే విధంగా జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న పేరు పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈకార్యక్ర మంలో మాజీ ఎంపి వి. హనుమంతరావు, బీసీ మేధావుల ఫోరం చైర్మన్ టి. చిరంజీవులు, డాక్టర్ విశారదన్ మహారాజ్ గౌడ జన హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు యెలికట్టే విజయ కుమార్ గౌడ్, సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్న గౌడ్, ఎస్.దుర్గయ్య గౌడ్, గౌడ ఐక్య సాధన సమితి అధ్యక్షులు అంబాల నారాయణ గౌడ్, బీసీ కమీషన్ మాణ సమ్యులు జోతి కిషోర్ లాడ్, అంవి. రమణ, గడ్డ మీది విజయ కుమార్ గౌడ్, వి.నాగా భూషణం. బాలగౌని వెంకటేష్ గౌడ్, సింగం నగేష్ తదిత రులు పాల్గొని మాట్లాడారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలకు సముచిత స్థానం

## టిపిసిసి-చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్,ఆగస్టు 18,ప్రభాతవార్త:** స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళ కాంగ్రెస్ కార్యకర్తలకు సముచిత స్థానం కల్పిస్తామని టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు.సోమవారం టిపిసిసి మహిళ కాంగ్రెస్ కార్య వర్గ సమావేశం అధ్యక్షురాలు సునీతా రావ్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో పాల్గొన్న టిపిసిసి అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ కష్టపడి పనిచేసే కార్యకర్తలకు గుర్తింపు ఉంటుం దని అన్నారు.మహిళ కాంగ్రెస్ నేతలకు అండగా ఉంటామని పదవులు రాలేదని నిరాశ చెందకు దదని అన్నారు. కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలనికోరారు. ఈ సమావేశంలో తెలం గాణ పరిశీలకురాలు కమలాక్షి

# వరదలతో పంచాయితీరాజ్‌శాఖకు భారీ నష్టం

**హైదరాబాద్,ఆగస్టు 18, ప్రభాతవార్త:**గత కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు రోడ్డు,భవనాలకు పెద్ద ఎత్తున నష్టం వాటిల్లినట్లు పంచాయితీరాజ్‌శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.వరదల కారణంగా పంచాయతీరాజ్ రోడ్లు, భవనాలకు ఇప్పటి వరకు జరిగిన నష్టం వివరాలుమొత్తం 96.55 కిలోమీటర్ల పంచాయతీరాజ్ రోడ్లు వరదల కారణంగా దెబ్బతిన్నట్లు పేర్కొన్నారు. రోడ్ల ఉపరితల నష్టం 75 ప్రాంతాల్లో జరగ్గా పునరుద్ధరణ వ్యయం: రూ. 340.80 లక్షలు,శాశ్వత పునరుద్ధరణ వ్యయం: రూ. 4940.00 లక్షలు అవుతుందని అంచనా వేసినట్లు తెలిపారు,సిడి వర్క్స్ 88 ప్రాంతాల్లో నిర్వహించాల్సి ఉందని, వీటికి తాత్కాలిక మరమ్మత్తుల కింద రూ. 164.55 లక్షలు,శాశ్వత పునరుద్దరణ వ్యయం కింద రూ.8774.00లక్షల వ్యయం అవుతుందన్నారు. 60 ప్రాంతాల్లో బ్రీచులు దెబ్బతినగా తాత్కాలికి వ్యయం రూ.108.40 లక్షలు, శాశ్వతర ప పునరుద్దరణ వ్యయం రూ.557.00 లక్షలు ఉంటుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 223 ప్రాంతాల్లో రోడ్లు దెబ్బతినగా తాత్కాలిక పునరుద్ధరణ వ్యయం రూ.613.75 లక్షలు, శాశ్వత పునరుద్ధరణ వ్యయం రూ.14271 లక్షల వ్యయం అవుతుందని అంచనా వేసినట్లు తెలిపారు. వరదల కారణంగా సూర్యాపేట జిల్లాలో 35 భవనాలు శిథిలావస్థలో ఉన్నట్లు గుర్తించామని వీటిలో 14 భవనాలు వాడుకలో లేవని తెలిపారు. మిగిలిన 21 భవనాలకు సంబంధిత అధికారులు ఖాళీ చేయాలని నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు.అదే విధంగా ఖమ్మంలో 11 జడ్‌పి కార్వర్టర్ భవనాలు శిథిలా వస్తలో ఉన్నట్లు గుర్తిం వాటిని వెంటనే ఖాళీచే యాల్సిందిగా సంబంధిత అధికారులకు నోటీ సులు జారీ చేసినట్లు ఒక ప్రకటనలో పం చాయితీరాజ్‌శాఖ ఉన్నతాధికారులు తెలిపారు.

# సిపిజెట్‌లోని 32 సబ్జెక్టుల ప్రాథమిక కీ విడుదల

## నేటి నుంచి 21 వరకు అభ్యంతరాల స్వీకరణ

## ఒక్కో అభ్యంతరానికి రూ. 200 చెల్లించాలి

## సిపిజెట్ కన్వీనర్ పాండురంగారెడ్డి

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఆగస్టు 18:** తెలంగాణ రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీల్లో పోస్టు గ్రాడ్యుయేషన్(పిజి) కోర్సులు, 5 సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ కోర్సుల్లో చేరడానికి నిర్వహించిన కామన్ పిజి ఎంట్రన్స్ టెస్ట్(సిపిజెట్)-2025లో 32 సబ్జెక్టులకి సంబంధించిన ప్రాథమిక కీని సోమవారం విడుదల చేసినట్టు సిపి జెట్-2025 కన్వీనర్ ప్రొఫెసర్ ఐ పాండురంగారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 32 కోర్సుల్లో చేరడానికి 51,965 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 45,477 మంది పరీక్షలకు హాజరయ్యారని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారిలో 87.51 శాతం మంది హాజరైనట్టు తెలిపారు. మొత్తం 44 పిజి కోర్సుల్లో 51 సబ్జెక్టుల్లో ప్రవేశాలకు సిపిజెట్-2025ను నిర్వహించారు. వాటిలో ఇప్పటికే కొన్ని సబ్జెక్టులకి సంబంధించిన ప్రాథమిక కీని విడుదల చేయగా.. సోమవారం 32 సబ్జెక్టుల ప్రాథమిక కీని విడుదల చేశారు. ప్రాథమిక కీపై అభ్యంతరాలు ఉంటే రూ. 200 చెల్లించి అభ్యంతరాలను ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యంతరం సరైనదే నని రుజువైతే అభ్యర్థి చెల్లించిన రూ. 200 తిరిగి అభ్యర్థికి ఇవ్వనున్నట్టున ప్రకటించారు.

### ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీసు రూల్స్‌ను రూపొందించి

# ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

## 23న హైదరాబాద్‌లో మహాధర్నా

### వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించిన యుఎస్‌పిసి




**హైదరాబాద్, ప్రభాతవార్త, ఆగస్టు 18:** తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ, స్థానిక సంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఏకీకృత సర్వీస్ రూల్స్‌ను రూపొందించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ(యుఎస్‌పిసి) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. రాష్ట్రంలోని విద్యా రంగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిం చాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 23న హైదరాబాద్‌లోని ధర్నాచౌక్‌లో మహాధర్నా చేపట్టనున్నట్టు యుఎస్‌పిసి నేతలు తెలిపారు. ఇందుకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను యుఎస్‌పిసి నేతలు సోమవారం టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో ఆవిష్కరించారు. అనంతరం యుఎస్‌పిసి నేతలు మీడియాతో మాట్లాడారు. చావ రవి, ఎ వెంకట్(టిఎస్ యుటిఎఫ్),ఎన్ తిరుపతి(టిపి టిఎఫ్), ఎం సోమయ్య, టి లింగారెడ్డి (డిటిఎఫ్), కొమ్ము రమేష్ (బిటిఎఫ్), ఎస్ హరికిషన్(టిటిఎ), వై విజయకుమార్ (ఎస్సీ ఎస్టీయుయస్), పి మాణిక్ రెడ్డి, ఎ సింహాచలం మీడియా సమావేశంలో పాల్గొన్నారు. యుఎస్‌పిసి స్టీరింగ్ కమిటి నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 20 నెలలు గడిచినప్పటికి ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను పరిష్కరిం చడంలో తీవ్రమైన జాప్యాన్ని ప్రదర్శిస్తుం దన్నారు. మేనిఫెస్టోలో పొందుపరచిన ఎన్నికల హామీలను అమలు పరచడం లేదన్నారు. నూతన జిల్లాలకు డిఈఓ పోస్టులను, ప్రతిరెవెన్యూ డివిజన్‌కు డిప్యూటీ ఈఓ, నూతన మండలాలకు యంఈఓ పోస్టులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీసు రూల్స్ ను రూపొందించి, ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయలన్నారు. ఉపాధ్యాయుల, పెన్షనర్ల వివిధ రకాల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలన్నారు. ప్రాథమిక పాఠశాలలకు 5571 పియస్ హెచ్‌యం పోస్టులను మంజూరు చేయాలని, డిఎడ్, బిఎడ్ అర్హతలున్న ప్రతి యస్‌జిటికి పియస్‌హెచ్‌యంగా ప్రమోషన్‌కు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. పండిట్, పిఈటిల అప్ గ్రేడేషన్ ప్రక్రియ పూర్తి అయినందున జిఓ 2,3,9,10 లను రద్దుచేసి జిఓ 11,12ల ప్రకారం పదోన్నతులు కల్పిం చాలన్నారు. అలాగే ఉపాధ్యాయుల సర్దుబాటు మార్గదర్శకాలను సవరించాలని, వివిధ జిల్లాల్లో జరిగిన పైరవీ డిప్యూటేషన్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గురుకులాల టైం టేబుల్‌ను సవరిం చాలని, కెజిబివి, మోడల్ స్కూల్స్, గిరిజన సం క్షేమ, ఎయిడెడ్ టీచర్ల సమస్యలను పరిష్కరిం చాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కా రానికి ప్రభుత్వానికి అనేక మార్లు ప్రాతినిధ్యం చేసినప్పటికి మంత్రులు, ఆఫీసర్ల కమిటీలు వేసినా సమస్యలు పరిష్కారం కాక పోవడంతో గత నెలలో దశలవారీ ఉద్యమ కార్యాచరణ చేపట్టాలని యుఎస్‌పిసి నిర్ణయించి దన్నారు.

జులై 23, 24, 25 తేదీల్లో మండల తహసీల్దార్ల ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మెమోరాండాలు సమర్పించామని, రెండవ దశలో ఆగస్టు 5న జిల్లా కేంద్రాల్లో ధర్నాలు నిర్వహించి జిల్లా కలెక్టర్ ద్వారా వినతిపత్రాలు అందజేశామని అయినా ప్రభుత్వం నుంచి స్పందనలేదన్నారు. ఈ నేపథ్యంలో అనివార్యంగా ఈ నెల23న హైదరాబాద్‌లో రాష్ట్ర స్థాయి మహాధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా చొరవ చూపి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

# పాఠశాలల్లో హమారా విద్యాలయ, స్వాభిమాన్ కార్యక్రమానికి అనుమతించండి

## పాఠశాల విద్య డైరెక్టర్‌కి తపస్ విజ్ఞప్తి


**హైదరాబాద్, ప్రభాతవార్త, ఆగస్టు 18:** సెప్టెంబర్ 1న అఖిల భారతీయ రాష్ట్రీయ శైకిక్ మహాసంఘ్ (ఏబిఆర్ఎస్ఎం) ఆధ్వర్యంలో నిర్వహించనున్న హమారా విద్యాలయ హమారా స్వాభిమాన్ అనే కార్యక్రమానికి అనుమతించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(టిపియుఎస్) పాఠశాల విద్య డైరక్టర్ నవీన్ నికోలస్‌కి విజ్ఞప్తి చేసింది. ఏబిఆర్ఎస్ఎంకి అనుబంధంగా తెలం గాణ రాష్ట్రంలో పనిచేస్తున్న తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) ఆధ్వర్యంలో పాఠశాలల్లో ప్రార్థన సమయంలో "మన పాఠశాల- మన ఆత్మగౌరవం" అనే కార్యక్రమ ము ప్రతి పాఠశాలలో నిర్వహించే విధంగా అనుమతి ఇవ్వాలని సంఘం రాష్ట్ర అధ్యక్షులు హన్మంత రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాత్ సురేష్ సోమవారం పాఠశాల విద్య డైరక్టర్‌కి విజ్ఞప్తి చేశారు. పాఠశాలను పరిశుభ్రంగా, క్రమశిక్షణతో, ఆకుపచ్చగా, స్ఫూర్తిదాయకంగా ఉంచుతామని.. పాఠశాల ఆస్తి, వనరులను జాతీయ సంపదగా పరిగణిస్తామని, వాటిని కాపాడుతామని, వాటిని వివేకవంతంగా ఉపయోగిస్తామని పేర్కొంటూ ప్రతిజ్ఞ చేయించనున్నట్టు తెలిపారు. విద్యను జ్ఞాన మాధ్యమంగా మాత్రమే కాకుండా, వ్యక్తిత్వ నిర్మాణం, స్వీయ అభివృద్ధి, సామాజిక సేవకు సాధనంగా పరిగణించడం ద్వారా పని చేస్తామని, పాఠశాలలో వివక్షత లేని వాతావరణాన్ని సృష్టిస్తామని.. అందరం సమాన స్ఫూర్తితో నేర్చుకోవడం, బోధించడం అనే మార్గంలో ముందుకు సాగుతామని ప్రతిజ్ఞ చేయించనున్నట్టు చెప్పారు. పాఠశాలను కేవలం ఒక సంస్థగా కాకుండా, సంస్కృతి, సేవ, అంకితభావంతో కూడిన ఒక కేంద్రంగా పరిగణిస్తామని దాని కీర్తిని పెంచడానికి నిరంతరం కృషి చేస్తామనే ప్రతిజ్ఞను రాష్ట్రంలోని ప్రతి పాఠశాలలో నిర్వహిస్తున్నామని అందుకు అనుమతించాలని పాఠశాల విద్య డైరక్టర్‌ని సంఘం రాష్ట్ర అధ్యక్షులు హనుమంతరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాత్ సురేష్ కోరినట్టు తెలిపారు.

# ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఆగస్టు 18:** తెలంగాణ రాష్ట్రంలోని ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ప్రైమరీ స్కూల్స్ హెడ్మాష్టర్స్ అసోసియేషన్(పిఎస్‌హెచ్ ఎంఎ) డిమాండ్ చేసింది. ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సంఘం తెలంగాణ రాష్ట్ర స్థాయి సర్వ సభ్య సమావేశం సోమవారం కె. ప్రభాకర్ రెడ్డి అధ్యక్షతన జరిగినది.హైదరాబాద లోని జీడిమెట్లలో జరిగిన సమావేశంలో రాష్ట్రం లోని 33 జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శు లతోపాటు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. సోమవారం జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది. పూర్తి కార్యవర్గాన్ని అందరి ఆమోదంతో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు పిఎస్‌హెచ్‌ఎంఎ రాష్ట్ర అధ్యక్షులు బి మురళీధర్ గౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రచ్చ మురళీ తెలిపారు. రాష్ట్ర ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సంఘం తెలంగాణ నూతన అధ్యక్షులు గద్వాల్ జిల్లాకి చెందిన డి. మొరళీదర్ గౌడ్ ఎన్నిక కాగా.. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నిజామాబాద్ జిల్లాకి చెందిన రచ్చ మురళీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర ఆర్థిక కార్యద ర్శులుగా ఇలిటం గాలయ్య, కె. శ్రవణ్ రెడ్డితోపాటు మిగిలిన రాష్ట్ర కార్యవర్గ సభ్యులను అందరి ఆమోదముతో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు తెలిపారు. నూతనంగా ఎన్నికైన రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ.. ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమస్యలను పరిష్కరించుటకు, వారి ఆత్మగౌరవాన్ని కాపాడుటకు అవసరమైన కార్యక్రమాలను నిర్వహిస్తూ, రాష్ట్ర స్థాయి అధికారులతో సమన్వయ పర్చుకుంటూ సంఘ సభ్యులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలియజేశారు. త్వరలో పిఎస్‌హెచ్‌ఎంల సమస్యలపై ప్రభుత్వానికి శ్వేత పత్రం సమర్పించనున్నట్టు తెలిపారు.

# ఇంట్లో ఒంటరిగా ఉన్న పన్నెండేళ్ల బాలిక హత్య

## హైదరాబాద్‌లో దారుణం



సహస్ర (ఫైల్)

**మూసాపేట్, ఆగస్టు 18, ప్రభాతవార్త:** కూకట్‌పల్లి లో దారుణం చోటు చేసుకుంది. పన్నెండేండ్ల బాలికను గుర్తు తెలియని దుండగులు హత మార్చారు. ఈ విషాదకర సంఘటన కూకట్ పల్లిలోని సంగీత్‌నగర్‌లో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే బాలిక సహస్ర తల్లిదండ్రులు ఇద్దరు ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నారు. కాగా, సహస్ర ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో గుర్తు తెలియని దుండగలు ఇంట్లోకి చొరబడిని బాలికను హత్య చేశారు. సమాచారం అందు కున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సహస్ర తల్లిదండ్రులు రేణుక, కృష్ణ ప్రైవేట్ ఉద్యోగులు. కొన్నాళ్లుగా కూకట్‌పల్లిలో నివసిస్తున్నారు. బాలిక తల్లిదండ్రులు ఉద్యోగ నిమిత్తం ఆఫీస్‌కు వెళ్లిన సమయంలో ఈ హత్య జరిగిందని తెలిపారు. కాగా, చిన్నారి మృతి పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విగతజీవిగా ఉన్న తమ చిన్నారిని చూసి గుండెలవిసేలా రోధిస్తున్నారు. ఇంట్లో ఒకవేళ తమ కొడుకు కూడా ఉండి ఉంటే అతన్ని కూడా చంపేసేవారేమోనని చిన్నారి తల్లిదండ్రులు కన్నీరు మున్నీరవుతున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంతో పోలీసులు ఆధారాలు సేకరిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి అదనపు సమాచారం అందాల్సి ఉంది.

# పతంజలికి ఎఇఓ టైర్ 2 సర్టిఫికెట్

## ఈ సర్టిఫికేట్ దేశ గౌరవాన్ని పెంచుతుంది

## పతంజలికి వ్యవస్థాపకుడు రామ్‌దేవ్‌బాబా




**హైదరాబాద్,ఆగస్టు 18, ప్రభాతవార్త:** దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్ల పూర్తయిన సందర్భంగా, భారతదేశంలోని ప్రతి ఇంటిలోనూ నమ్మకానికి చిహ్నంగా నిలిచిన పతంజలి ఫుడ్స్ లిమిటెడ్, స్వదేశీ చరిత్రకు మరో సువర్ణ అధ్యాయాన్ని జోడించింది.ప్రపంచ కస్టమ్స్ సంస్థ (డబ్ల్యూసివో),భారత ప్రభుత్వ ఆర్థిక మంత్రిత్వ శాఖ ఇండియన్ కస్టమ్స్ పతంజలికి ఏఈవో (ఆథరైజ్డ్ ఎకనామిక్ ఆపరేటర్) టైర్2 సర్టిఫికెట్‌ను ప్రదానం చేశాయి.ఈ సర్టిఫికెట్ ప్రపంచ వాణిజ్యంలో నిజాయితీ, పారదర్శకత, సరఫరా, భద్రత యొక్క అత్యున్నత ప్రమాణాలను సూచిస్తుంది. భారతదేశంలోని అగ్రశ్రేణి కంపెనీలలో కొన్ని కంపెనీలకు మాత్రమే ఈ హోదా ఉంది.ఎఫ్ఎంజి రంగంలో, కొన్ని కంపెనీలు మాత్రమే ఈ ప్రతిష్టాత్మక సర్టిఫికెట్‌ను పొందాయి. ఇప్పుడు పతంజలి పేరు ఈ జాబితాలో సువర్ణాక్షరాలతో చేర్చింది.ఈ ఏఈవో టైర్2 సర్టిఫికెట్‌తో, పతంజలి ఫుడ్స్ డ్యూటీ డిఫర్డ్ పేమెంట్, బ్యాంక్ గ్యారెంటీ మినహాయింపు, డైరెక్ట్ పోర్ట్ డెలివరీ(డిపిడి) 24 బై 7 7 క్లియరెన్స్ సౌకర్యం మొదలైన వాటితో పాటు 28 కంటే ఎక్కువ రకాల అంతర్జాతీయ వాణిజ్య ప్రయోజనాలను పొందుతుంది.ఈ సర్టిఫికేట్ కంపెనీ నాణ్యత, సమగ్రత, పారదర్శకత, జాతీయ ప్రయోజనాలకు తోడ్పడేందుకు ఎంతగానో ఉపయోగపడుతుంది. పతంజలి నాణ్యత ప్రామాణికత, అంకితభావం, స్వదేశీ స్ఫూర్తి ఆధారంగా ఈ ప్రత్యేక ప్రమాణాన్ని సాధించింది.ఇది కేవలం ఒక సర్టిఫికెట్ కాదు, భారతదేశ ఆర్థిక స్వాతంత్ర్యాన్ని మరింత బలోపేతం చేసే గౌరవం.ఈ సందర్భంగా పతాంజలి వ్యవస్థాపకుడుముఖ్యమైన రామ్‌దేవ్ బాబా మాట్లాడుతూ. సంస్థకు 2 టైర్ సర్టిఫికేట్ రావడం, పతంజలి కుటుంబానికి మాత్రమే కాదని, ప్రతి భారతీయుడికి గర్వకారణమైందన్నారు. విశ్వసనీయత, ప్రామాణికత, పోటీ, నాణ్యత రంగంలో పతంజలి ప్రతిరోజూ కొత్త వేగంతో ముందుకు సాగుతోందని, వ్యాపార రంగంలో వ్యవస్థాపకతకు కొత్త ప్రమాణాలను నిర్దేశిస్తోందన్నారు.భారతదేశం ఆర్థికంగా ప్రపంచ నాయకుడిగా ఎదగాలని, ఈ సర్టిఫికేట్ దేశాన్ని నిర్మించాలనే మా సంకల్పాన్ని మరింత బలపరుస్తుందన్నారు.ఇది దేశ ఎగుమతి, దిగుమతి కార్యకలాపాలను పెంచడం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తుందని,ఈ గౌరవం దేశ సరిహద్దులలోనే కాకుండా ప్రపంచంలోని ప్రతి మూలలో కూడా మమ్మల్ని గర్వపడేలా చేస్తుందన్నారు.దేశ సంస్కృతి, ఆయుర్వేదం ,స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహిం చడంలో ఇది సహాయకారిగా ఉంటుందన్నారు.

# యూరియా కొరత లేకుండా చర్యలు చేపట్టాలి

## రైతు ఐక్యవేదిక అధ్యక్షుడు నర్సారెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 18, ప్రభాతవార్త:** రాష్ట్రంలో యూరియా కొరత లేకుండా తక్షణమే తగు చర్యలు చేపట్టాలని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు రైతు ఐక్యవేదిక అధ్యక్షుడు శేర్ నర్సారెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈమేరకు హైదరాబాద్ లోని సచివాలయంలో సోమవారం మంత్రికి వినతి పత్రం సమర్పిం చారు. యూరియా కొరత తీవ్రంగా ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. వ్యవసాయ అవసరాలకు అనుగుణంగా సరిపడా యూరియాను కేటాయించాలని కోరారు. రాష్ట్రానికి ఎరువుల విషయంలో కేంద్రం వివక్ష చూపుతోందని విమర్శించారు. వ్యవసాయ పంటలకు సరైన సమయంలో యూరియా వేయకపోతే పంటల దిగుబడి తగ్గే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

# రైతులకు యూరియా సరిపడా అందించలేకపోతున్నాం

## రాష్ట్రంలో 2.98 లక్షల టన్నుల లోటు: వ్యవసాయ మంత్రి తుమ్మల



**హైదరాబాద్, ఆగస్టు 18, ప్రభాతవార్త:** రాష్ట్రంలో 2.98 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా లోటు ఏర్పడటంతో రైతులకు పంటకు సరిపడా యూరియాను ఒకేసారి అందించలేకపోతున్నామని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు తెలిపారు. కేటాయింపుల ప్రకారం యూరియాను రాష్ట్రానికి సరఫరా చేయక పోవటంతో లోటు ఏర్పడింన్నారు. హైదరాబాద్ సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో కలిసి సోమవారం జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ యూరియా కొరను దృష్టిలో పెట్టుకొని జిల్లా కలెక్టర్లకు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుత నిల్వలపై పటిష్టమైన పర్యవేక్షణ ఉండాలని స్పష్టం చేశారు. హోల్ సేల్, రిటైల్ డీలర్లు, సహకార సంఘాల గోదాములలో రోజువారి యూరియా స్టాక్ పర్యవేక్షించాలన్నారు. జిల్లా స్థాయిలో సమన్వయం చేసుకొని మండలాల వారీగా అవసరానికి సరిపడా కేటాయింపు చేయాలని సూచించారు. యూరియా సరఫరాలో చిన్న, సన్నకారు రైతులకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. పెద్ద రైతులకు విడతల వారిగా సరఫరా చేసే అవకాశాలను పరిశీలించాలని చెప్పారు. అవసరమైతే పట్టాదారు పాసుపుస్తకాలు అనుసంధానం చేసి, టోకెన్లతో ఎలాంటి గందరగోళం లేకుండా యూరియా సరఫరా చేయాలన్నారు. టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసి అక్రమ నిల్వలు, అధిక ధరలకు అమ్మకం, బ్లాక్ మార్కెటింగ్, అక్రమ రవాణా అడ్డుకునేలా కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇతర అవసరాలకు యూరియా మళ్లించే అవకాశమున్న యూనిట్లపై తనిఖీలు చేసి నిల్వల్లో తేడాలుంటే కేసులు నమోదు చేయాలన్నారు. యూరియా సరఫరా సాధారణ స్థితికి చేరేవరకు కఠినంగా పర్యవేక్షణ కొనసాగించాలని కలెక్టర్లకు సూచించారు. ఇందులో వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, డైరెక్టర్ గోపి తదితరులు పాల్గొన్నారు.

### యూరియాకు కాంప్లెక్స్ లింక్

**హైదరాబాద్, ఆగస్టు 18, ప్రభాతవార్త:** రాష్ట్రంలో యూరియాకు కొరత ఏర్పడిన నేపథ్యంలో కొందరు వ్యాపారులు అడ్డగోలుగా రైతులను దోచుకుంటున్నారు. కాంప్లెక్స్ ఎరువులు కొంటేనే యూరియా ఇస్తామని ఈ రెంటికీ కంపెనీలు లింక్ పెడుతున్నారు. అంతే కాకుండా ఎరువుల విక్రయాల్లో కొత్త కొత్త నిబంధనలు తీసుకొస్తూ రైతులపై భారం మోపుతుండటంతో ఇక వాటిని అడ్డం పెట్టుకుని కొందరు వ్యాపారులు రైతులపై అదనపు భారాలు మోపుతున్నాయనే అరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఫలితంగా డీలర్లు బస్తా ఎరువుపై రూ.30కు పైగా అదనపు చార్జీని రైతుల నుంచి వసూలు చేస్తుండటం వివాదాస్పదమవుతోంది.

### రామగుండం యూరియా ఉత్పత్తి బ్రేక్‌పై

### రాష్ట్ర సర్కార్ అంతర్గత విచారణ

**హైదరాబాద్, ఆగస్టు 18, ప్రభాతవార్త:** రామగుం డం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్ఎఫ్‌సీఎల్) తరచూ షట్ డౌన్ అయి, యూరియా ఉత్పత్తికి ఆటంకం ఏర్పడు తుండటంపై రాష్ట్ర సర్కార్ దృష్టిసారించింది. షట్ డౌన్ ఎందుకు అవుతుందనే విషయమై ప్రభుత్వం అంతర్గత విచారణ చేయిస్తున్నట్లు సమాచారం. ప్లాంట్ ద్వారా ఈ నెలాఖరు వరకు రాష్ట్రానికి 65 వేల టన్నుల యూరి యా రావాల్సి ఉండగా, ఇప్పటి వరకు 20 వేల టన్నులు మాత్రమే సరఫరా అయ్యింది. జూలై నుంచి వరి సాగవుతున్న సమయంలోనే ఒక్కసారిగా యూరియా కొరత ఏర్పడింది. ఇందుకు కారణం ఆర్ఎఫ్‌సీఎల్‌తరచూ షట్‌డౌన్ అవుతుండడమేనని తెలుస్తున్నది. ఈ ఏడాది మే 8 నుంచి జూన్ 15 వరకు, జూలై 16 నుంచి ఆగస్టు 4 వరకు ఉత్పత్తి నిలిచిపోయింది. మళ్లీ ఆగస్టు 14న అమ్మోనియా లీకేజీతో ప్లాంట్ షట్‌డౌన్ అయ్యింది. ఈ వరుస వైఫల్యాలతో తెలంగాణకు లక్ష టన్నులకు పైగా యూరియా సరఫరాకు ఆటంకం ఏర్పడింది. ఈ నెలలో 65 వేల టన్నులు సరఫరా జరగాల్సి ఉంది. యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కావాలనే పరిశ్రమను షట్ డౌన్ చేస్తున్నారా, లేక అమ్మోనియా లీక్‌తోనే షట్‌డౌన్ అవుతున్నదా అనేవిషయాలతో పాటు, పరిశ్రమలో త్వరితగతిననిర్ణయాలుతీసుకోవడంలో జాప్యం తోనే తరచూ లీకేజీలు తలెత్తు తున్నాయా అనే కో ణంపైసమాచారం సేకరిస్తున్నట్లు తెలియవచ్చింది.

## ఎల్ఐసి ఆధ్వర్యంలో 18 నుంచి అక్టోబర్ 17 వరకు
# బీమా పునరుద్ధరణ స్పెషల్ డ్రైవ్

**హైదరాబాద్,ఆగస్టు 18, ప్రభాతవార్త:** ఎల్ఐసి పాలసీదారులు గడువు తీరిన(ల్యాప్స్ అయిన) బీమాను పునరుద్ధరించేందుకు ఎల్ఐసి దేశ వ్యాప్తంగా పునరుద్ధరణ( రివైవల్ పాలీసీ)ని అందుబాటులోకి తీసుకువచ్చింది. అగస్టు18 నుంచి అక్టోబర్17 వరకు ఉంటుందని పేర్కొంది. ఇందులో భాగంగా ఎల్ఐసి పీమ్రియం మొత్తం గరిష్టంగా రూ.5వేల వరకు ఆలస్యమైన రుసుములపై 30 శాతం వరకు రాయితీని ప్రకటిస్తోందని ఎల్ఐసి ఒక ప్రకటనలో పేర్కొంది. సూక్ష్మ, బీమా పథకాలకు 100 శాతం ఆలస్య రుసుం మినహాయింపు ఉంటుందని తెలిపింది. ఎల్ఐసికి చెందిన మొదట చెల్లించని ప్రీమియం తేదీ నుంచి 5 సంవత్సరాల వరకు పునరుద్ధరించనున్నట్లు పేర్కొంది. ఈ పునరుద్ధరణ కూడా పాలసీ నిబంధనలు, శరతులకు లోబడి ఉంటాయని పేర్కొంది.అయితే ఈ పునరుద్ధరణ సాధారణ,వైద్య,ఆరోగ్య అవసరాలకు లోబడిఉంటుందని,ఆ విషయంలో ఎటువంటి రాయితీలు ఉండవని పేర్కొంది. ఆర్ధిక లేదా, వ్యక్తిత ఇబ్బందుల కారనంగా చెల్లింపులు చేయడం డిఫాల్ట్ అయిన పాలసీదారులను ప్రోత్సహించే కార్యాక్రమంలో భాగంగా ఈ రివైవల్ పాలసీని ప్రవేశపెట్టి నట్లు తెలిపింది. ఈ పాలసిని పునరుద్దరించడం ద్వారా బీమా కవరేజ్‌ను పునరుద్దరించడమే కాకుండా సదరు కుటుంబాలకు ఆర్థికభద్రతను కూడా కల్పిస్తుందని పేర్కొంది. పాల సీదారుల అవకాశాన్ని సద్వినియోగంచేసుకోవాలని ఒక ప్రకటనలో కోరింది.



## పాకిస్థాన్‌లో ప్రకృతి విలయం
# 1,000 దాటిన మృతుల సంఖ్య

**ఇస్లామాబాద్, ఆగస్టు 18:** ప్రకృతి ప్రకోపానికి పాకిస్థాన్ అల్లాడుతోంది. ఖైబర్‌ఫఖ్తున్‌ఖ్వా ప్రావిన్స్‌లో బీభత్సమైన వర్షాలు, వరదల కారణంగా వందల మంది మరణించారు. మృతుల సంఖ్య 1,000కిపైగానే ఉండొచ్చని ఉన్నతస్థాయి అధికారి ఇఖ్తీయార్ వలీఖాన్ ఆందోళన వ్యక్తం చేశారు. ముంపునకు గురైన ప్రాంతాలను తాను స్వయంగా సందర్శించానని ఆయన తెలిపారు. అనేక గ్రామాలు వరదల్లో తుడిచిపెట్టుకుపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. బునర్ జిల్లా ఛర్గాజీ గ్రామంలో ఊహకు అందని స్థాయిలో విధ్వంసం సంభవించిందని చెప్పారు. బాషోనీ అనే గ్రామం ఆనవాళ్లు లేకుండా తుడిచిపెట్టుకుపోయిందని అన్నారు. భారీ ట్రక్కులంత సైజులో ఉన్న రాళ్లు వరదల కారణంగా జనావాసాలపై వైపు దూసుకొచ్చాయని చెప్పారు. ఈ వరదల బారిన పడ్డ కొన్ని కుటుంబాలు ఏమైపోయాయో కూడా తెలియట్లేదని చెప్పారు. అధికారిక లెక్కల ప్రకారం, మృతుల సంఖ్య 300గా ఉన్నప్పటికీ అనేక కేసుల గురించి రికార్డుల్లోకే ఎక్కలేదని తెలిపారు. ఈ వర్షాలు, వరదలు అత్యంత వినాశకర ప్రకృతి విపత్తులని పేర్కొన్నారు. ఒక్క దిర్ ప్రాంతంలోనే మరణాల సంఖ్య వెయ్యి దాటే అవకాశం ఉందని విచారం వ్యక్తం చేశారు. మృతదేహాల సామూహిక ఖననాలు జరుగుతున్నట్లు కూడా చెప్పారు. అక్కడ ఉండే సుమారు 1000 మంది స్థానికుల అచూకీ ఇంకా తెలియరాలేదని అన్నారు. 'బునర్ నుంచి ఇప్పుడే తిరిగొచ్చా. ఆ భయానక దృశ్యాలను స్వయంగా చూశా' అంటూ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. పాక్ జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ ప్రకారం, వర్షాలు, వరదల కారణంగానే జూన్ 26 నుంచి ఇప్పటివరకూ అక్కడ 657 మంది మృతి చెందారు. మృతుల్లో 392 మంది పురుషులు ఉన్నారు. మరెఒ 939 మంది గాయాలపాలయ్యారు.క్షతగాత్రుల్లో 437 మంది పురుషులు, 256 మంది చిన్నారులు, 236 మంది మహిళలు ఉన్నారు. స్థానిక అధికారులతో కలిసి సహాయక చర్యలుచేపడుతున్నామని జాతీయవిపత్తు నిర్వహణసంస్థ పేర్కొంది.

# గుజరాత్‌లో రూ. 25 కోట్ల విలువైన వజ్రాల చోరీ




**సూరత్, ఆగస్టు 18:** గుజరాత్‌లోని సూరత్‌లో ఉన్న ఓ వజ్రాల కంపెనీలో జరిగిన భారీ చోరీ ఇప్పుడు దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మూడు రోజులపాటు కంపెనీ మూసి ఉండగా.. తెరిచి చూసిన తర్వాత దొంగతనం జరిగినట్లు గుర్తించారు. దీంతో ఆ కంపెనీ యజమాని ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు.. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు చేస్తున్నారు. గుర్తుతెలియని వ్యక్తులే.. కంపెనీ మూసి ఉన్న సమయంలో.. అందులోకి చొరబడి వజ్రాలను ఎత్తుకెళ్లి ఉంటారని పోలీసులు ప్రథమికంగా అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మన దేశంలో వజ్రాలకు కేంద్రం అంటే గుజరాత్ రాష్ట్రమే గుర్తుకువస్తుంది. ఇక సూరత్ నగరంలో చాలా డైమండ్ కంపెనీలు ఉన్నాయి. వజ్రాల పరిశ్రమ అనేది గుజరాత్ ఆర్థిక వ్యవస్థకు ఒక జీవనాడి వంటిది. కొన్ని లక్షల మంది ఈ డైమండ్ పరిశ్రమపై ఆధారపడి జీవిస్తుంటారు. ఇక్కడి వజ్రాలు విదేశాలకు కూడా ఎగుమతి అవుతుంటాయి. అయితే అలాంటి గుజరాత్‌లో ఇప్పుడు ఒక భారీ వజ్రాల దొంగతనం ఘటన చోటుచేసుకోవడం అందర్నీ షాక్‌కు గురి చేసింది. సూరత్ నగరంలోని డికె అండ్ సన్స్ డైమండ్ కంపెనీలో ఏకంగా రూ. 25 కోట్ల విలువ గల వజ్రాలను గుర్తుతెలియని వ్యక్తులు దోచుకోవడం సంచలనంగా మారింది.

సూరత్ కపోద్రా ప్రాంతంలో ఉన్న డికె అండ్ సన్స్ డైమండ్ కంపెనీ ఆఫీస్ కమ్ పాలిషింగ్ యూనిట్‌లో ఈ చోరీ జరిగిందని పోలీసులు వెల్లడించారు. ఈ నెల 15వ తేదీ నుంచి 17వ తేదీ మధ్య ఈ భారీ దొంగతనం జరిగినట్లు తెలిపారు. ఇక దోపిడీ సమయంలో దుండగులు సిసిటివి కెమెరాలన కూడా పూర్తిగా ధ్వంసం చేసినట్లు చెప్పారు. ఈ నెల 15 నుంచి 17 వరకు వరుసగా మూడు రోజులపాటు కంపెనీకు సెలవులు ఇవ్వడంతో ఉద్యోగులు, సెక్యూరిటీ సిబ్బంది ఎవరూ విధుల్లో లేరు. దీంతో ఇదే సరైన సమయం అని భావించిన దుండగులు.. ఈ భారీ దొంగతనానికి తెరలేపినట్లు తెలుస్తోంది. మొదటగా కంపెనీ గ్రౌండ్ ఫ్లోర్‌లోని మెయిన్ డోర్‌ను బద్దలు కొట్టిన దుండగులు.. ఆ తర్వాత మెటల్ సేఫ్ ఉంచిన మూడో ఫ్లోర్‌లోని ప్రవేశించినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. ఆ తర్వాత గ్యాస్ కట్టర్‌తో మెటల్ సేఫ్‌ను కట్ చేసి.. అందులో ఉన్న వజ్రాలను ఎత్తుకెళ్లిపోయారు. ఇక మూడు రోజుల సెలవుల తర్వాత కంపెనీకి వెళ్లిన యజమానికి చోరీ జరిగిన సంగతి.. సోమవారం తెలిసింది. దీంతో వెంటనే పోలీస్ స్టేషన్‌కు వెళ్లి జరిగిన విషయం చెప్పి ఫిర్యాదు చేయగా.. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటనలో దాదాపు రూ. 25 కోట్ల విలువైన వజ్రాలు చోరీ అయ్యాయని ప్రాథమిక దర్యాప్తులో తేలిందని.. దీనిపై మరింత దర్యాప్తు కొనసాగుతున్నట్లు సూరత్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీసు అలోక్‌కుమార్ వెల్లడించారు.

## వేదోక్తంగా రెండోరోజూ
# శ్రీనివాస విశ్వశాంతిమహాయాగం

**తిరుమల,ఆగస్టు 18ప్రభాతవార్తప్రతినిధి:** లోకక్షేమం కాంక్షిస్తూ తిరుమల ధర్మగిరి వేంకటేశ్వర వేదవిజ్ఞానపీఠంలో జరుగుతున్న సంగోపాంగ శ్రీనివాస విశ్వశాంతి మహాయాగం రెండోరోజూ సోమవారం వేదోక్తంగా కొనసాగింది. సోమవారం ఉదయం యధాప్రకారం ఎస్వీవేదవిజ్ఞానపీఠం ప్రిన్సిపాల్ కుప్పాశివసుబ్రమణ్యం అవధాని ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా 32మంది వేదపండితులు వేదమంత్రాలతో వేదపారాయణం, సుందరకాండపారాయణం వైదిక క్రతువులు నిర్వహించారు.



# బహుజన పోరాట యోధుడు పాపన్న

## గాంధీ కుటుంబం ఈ దేశానికి గొప్పవరం : సిఎం రేవంత్‌రెడ్డి

## అధికారికంగా జరిగిన పాపన్నగౌడ్ 375వ జయంతి వేడుకలు

## పాల్గొన్న డి.సిఎం భట్టి, పలువురు మంత్రులు



జయంతి వేడుకల్లో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు భట్టివిక్రమార్క, పొన్నంప్రభాకర్, కృష్ణారావు, మహేష్‌కుమార్‌గౌడ్, కె.కె., మధుయాష్కి తదితర నాయకులు

**హైదరాబాద్ (రవీంద్రభారతి), ఆగస్టు 18 ప్రభాతవార్త :** గాంధీ కుటుంబం భారతదేశానికి దొరికిన ఒక గొప్పవరమని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. రవి అస్తమించని బ్రిటిషనసామ్రాజ్యాన్ని శాంతితో ఒక యుద్ధాన్ని గెలువచ్చని నిరూపించిన మహాత్మగాంధీ నుండి మొదలుపెడితే స్వతంత్ర దేశంలో దేశంకోసం ప్రాణాలర్పించిన ఇందిరాగాంధీ, దేశసమగ్రత కోసం ప్రాణాలర్పించిన రాజీవ్‌గాంధీ, దేశాన్ని అభివృద్ధిపథం వైపు నడిపించి ప్రపంచంలో బలమైన ఆర్థిక వ్యవస్థగల దేశంగా రాణించాలని ప్రధానమంత్రి, రాష్ట్రపతి పదవులను త్యాగం చేసిన సోనియాగాంధీ, మన్మోహన్‌సింగ్‌ను దేశప్రధానిగా, ప్రణబ్ ముఖర్జీని రాష్ట్రపతిగా అవకాశం కల్పించిన రాహుల్‌గాంధీలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అతిపెద్ద 3వ వ్యవస్థగా భారత్‌ను తీర్చిదిద్దిన గొప్పనాయకత్వాన్ని గాంధీ కుటుంబం అందించిందని విశదీకరించారు. ఆనాడే బహుజనుల సామ్రాజ్యాన్ని స్థాపించిన గొప్పపోరాటయోధుడు సర్దార్‌సర్వాయి పాపన్నగౌడ్ అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్‌కు సరైన గుర్తింపు ఉండాలని, ఆయన విగ్రహం బహుజనులకే కాదు తెలంగాణ సమాజానికి ఆదర్శంగా నిలబడాలి నిలబెట్టాలని, విగ్రహం కేవలం జయంతులు వర్ధంతులు జరుపుకోడానికి కాదు అందరికీ స్ఫూర్తిగా ఉండాలని రాష్ట్ర సచివాలయం వద్ద పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఏర్పాటుకు శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు.

తెలంగాణ ప్రభుత్వ వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ, పాపన్నగౌడ్ జయంతి ఉత్సవ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం మధ్యాహ్నం రవీంద్రభారతి ప్రధాన మందిరంలో తొలి తెలుగు బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ మహరాజ్ 375వ జయంతి వేడుకలు ప్రభుత్వపరంగా అధికారికంగా జరిగాయి. తెలంగాణ రాష్ట్ర బిసి సంక్షేమశాఖ, రవాణాశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ సభాధ్యక్షతన బిసి కార్పొరేషన్ ఛైర్మన్ శేఖర్‌గౌడ్ నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి విశిష్ట అతిథి రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, విశిష్ట అతిథులు పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, మంత్రులు జూపల్లి కష్ణారావు, అడ్లూరి లక్ష్మణ్, వి.శ్రీహరి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కె.కేశవరావు, బిసి కమిషన్ ఛైర్మన్ నిరంజన్, మాజీ ఎంపి మధుయాష్కిగౌడ్, మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ శారద, నగర మేయర్ విజయలక్ష్మి, బిసి సంక్షేమ సంఘం జాతీయాధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లు, వివిధ కమిషన్ల ఛైర్మన్లు తదితరులతో కలిసి పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాలవేసి జ్యోతిప్రకాసనం చేసి ఘననివాళులర్పించి ప్రసంగించారు. గాంధీ కుటుంబం మాటిచ్చిందంటే శిలాశాసనమేనని, రాహుల్‌గాంధీ ఇచ్చిన మాటప్రకారం తెలంగాణలోని కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం పక్కా ప్రణాళికతో శాస్త్రీయంగా కులగణనచేసి చూపించి దేశానికే ఆదర్శంగా నిలిచామన్నారు. తద్వారా బహుజనుల సంఖ్య 56.33శాతంగా తేల్చి విద్య, ఉద్యోగ, ఉపాధితోపాటు రాజకీయాల్లో బిసిలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రెండే వేర్వేరు చట్టాలుచేసి కేంద్రానికి పంపామన్నారు. బిసిలకు శాపంగా మారిన గత ప్రభుత్వంలో కెసిఆర్ చేసిన చట్టాన్ని సవరిస్తూ ఆర్డినెన్స్‌ను గవర్నర్‌కు పంపితే, గవర్నర్ రాష్ట్రపతికి పంపారు... 5నెలలు గడిచినా ఆమోదించకపోవడంతో ఢిల్లీలో బహుజనుల కోసం ధర్నాచేస్తే బిజెపి, బిఆర్ఎస్‌లు రాలేదని, బిసి బహుజనుల రిజర్వేషన్లను మతం ముసుగులో కిషన్‌రెడ్డి, మోదీలు అడ్డుకుంటున్నారని ఆరోపించారు.

ఓటుహక్కును దొంగిలించిన వారిని శిక్షించాలని రాహుల్‌గాంధీ పాదయాత్ర చేస్తున్నారని, త్వరలో తాను, భట్టివిక్రమార్కలు ఆ పాదయాత్రలో పాల్గొని మద్దతు ఇస్తామన్నారు. సభకు శేఖర్‌గౌడ్ స్వాగతం పలుకగా పొన్నం ప్రభాకర్ సభాధ్యక్షతన వహించారు. సామాజిక న్యాయానికి కట్టుబడిన ప్రజాప్రభుత్వం తెలంగాణలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తోందని, ఆ నిర్ణయాలే భారతదేశానికి దశదిశ నిర్దేశం చేసేంతస్థాయిలో సామాజికపరమైన నిర్ణయాలు జరుగుతున్నాయని ఉపముఖ్యమంత్రి భట్టువిక్రమార్క తెలిపారు.

# ములుగు జిల్లాలో దంచికొట్టిన వాన

**కాల్వపెల్లి వాగులో మహిళ గల్లంతు**

**మంగపేట మండలంలో అత్యధికంగా 182.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు**

**మత్తడి పోస్తున్న లక్నవరం చెరువు**

**31 అడుగులకు చేరిన రామప్ప నీటిమట్టం**

**లోతట్టు ప్రాంతాలలో పర్యటించిన మంత్రి సీతక్క**

**జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు**





**ములుగు జిల్లా బ్యూరో, ప్రభాత వార్త:** ఆకాశానికి చిల్లుపడిందా అనే విధంగా ములుగు జిల్లాలోని మంగపేట,ఏటూరునాగారం మండలావర్షం కురిసింది.క్లౌడ్ బరస్ట్ జరిగిందా అనే విధంగా సోమవారం తెల్లవారుజాము నుండి వర్షం దంచికొట్టింది.దీంతో రహదారులు జలమయం కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గోవిందరావుపేట, వెంకటాపూర్ ఏటూరునాగారం, వాజేడు,వెంకటాపురం, మంగపేట,తాడ్వాయి మండలాల పరిధిలో కురిసిన అతి భారీ వర్షాలకు ఏజెన్సీ ప్రాంతంలోని లోతట్టు వంతెనల పై నుండి ప్రమాదకరంగా వరద ఉధృతి ప్రవహించింది.కాల్వపెల్లి వాగులో మహిళ గల్లంతు..మృతితాడ్వాయి మండలం కాల్వపెల్లి గ్రామ తుమ్మల వాగులో సారమ్మ (48) అనే మహిళా ఆదివారం రాత్రి గల్లంతై మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. మహిళ బహుర్భూమికి వెల్లిందని సమాచారం.భారీ వర్షానికి ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులో కొట్టుకుపోయిందని గ్రామస్తులు తెలిపారు.తనతల్లి ఇంటికి తిరిగి రాకపోవడంతొ కూతురు గ్రామస్తులకు ఈవిషయాన్ని తెలిపింది. అప్పటికే చీకటిపడింది. మరుసటిరోజైన సోమవారం గ్రామస్తులు ఊరి వెనుక ఉన్న వాగువెంబడి వెతకసాగారు కొద్దిదూరంలో వాగులో మృతదేహం చెట్టుకు చిక్కుకుని కనిపించింది. ఈవిషయాన్ని పోలీసులకు తెలిపారు.మృతదేహన్ని ఇంటికి తరలించారు.మృతదేహనికి పోస్టుమార్టం నిర్వహించి కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.ఈ ఘటన జిల్లా వ్యాప్తంగా సంచలనం సృష్టించింది.అధికారులు, పోలీసులు లోతట్టు ప్రాంతాల్లో పర్యటించి వాగులు,చెరువుల వద్దకి ప్రజలు వెళ్లొద్దని హెచ్చరికలు చేసారు.మంగపేట మండలంలో అత్యధికంగా 182.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు...మంగపేట మండలంలో అత్యధికంగా 182.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది.ఈ ఆకస్మిక వర్షం కారణంగా వచ్చిన వరదల కారణంగా మంగపేట మండల కేంద్రంలోని పలు నివాస గృహాలు జలమయమయ్యాయి. కమలాపురం గ్రామంలో ఉన్న ముంపు ప్రాంతాలలో ఉన్న 15 కుటుంబాలకు చెందిన 60 మందిని పునరావాస కేంద్రాలకు తరలించారు .నరసింహసాగర్ గ్రామంలో ఎనిమిది కుటుంబాలకు చెందిన 40 మంది వ్యక్తులను గ్రామపంచాయతీ నరసింహసాగర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిపునరావస కేంద్రానికి తరలించారు. సమాచారం తెలిసిన వెంటనే మంత్రి సీతక్క ముంపు ప్రాంతాల ప్రజలను పరామర్శించారు..ఇదే క్రమంలో 25 అడుగుల నీటి సామర్థం కలిగిన గుండ్ల వాగు ప్రాజెక్ట్ మత్తడి పోస్తుంది.గత 20 రోజుల క్రితం గంగారం, కొత్తగూడెం మండలాలలో భారీ వర్షాలు కురిసిన నేపథ్యంలో గుండ్ల ప్రాజెక్టులోకి భారీగా వరద రావడంతో మత్తడి పడింది.163 జాతీయ రహదారి గుండ్ల బ్రిడ్జి, కర్లపల్లి, లక్షీ మ్రపురం, నేతాజీ నగర్, టప్పమంచ, ప్రాజెక్ట్ నగర్ గ్రామాలలో ఉన్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పశువులు, మేకలు, వాగులు పొంగిపొలుతున్నందున కాపలదారులు జాగ్రత్తగా ఉండాలని వాగులు దాటవద్దని హెచ్చరికలు జారీ చేశారు. వెంకటాపూర్ మండలంలోని ప్రపంచ వారసత్వ సంపద అయిన రామప్ప ఆలయం సమీపంలో ఉన్న రామప్ప చెరువులో నీటి మట్టం 31 అడుగులకు చేరింది.మారేడుకొండ చెరు వు మత్తడి పోస్తుంది. జిల్లాలో వరద ప్రభావిత ప్రాంతాల్లో తీసుకోవాల్సిన చర్యలపై మంత్రి సీతక్క అధికారులతో సమీక్షి ంచారు. 24 గంటలు అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉంటూ సమన్వయంతో పనిచేయాలని ఆదేశాలు జారీచేశారు.పునరవాస కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజలకి

## చేనేత ఉత్పత్తులపై జిఎస్టీ తొలగించండి
## ప్రధానికి మంత్రి తుమ్మల లేఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, ఆగస్టు18:** చేనేత ఉత్పత్తులపై వెంటనే జిఎస్టీని తొలగించాలని, ప్రధాని నరేంద్రమోడికి, కేంద్ర చేనేత, జౌళి శాఖ మంత్రికి రాష్ట్ర వ్యవసాయ,చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం లేఖ రాశారు. తెలంగాణ రాష్ట్ర హస్తకళల పరిశ్రమకు ఊపిరిలాంటి చేనేత రంగం, చేనేత ఉత్పత్తులపై కేంద్రం విధించిన 5 శాతం జిఎస్టీ వలన ప్రస్తుతం చేనేత రంగం తీవ్రమైన సమస్యలను ఎదుర్కొంటోందని తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. వ్యవసాయం తర్వాత ఎక్కువమందికి ఉపాధి కల్పించే ఈ రంగం, గ్రామీణ ప్రాంతాల్లో వేలాది మంది కార్మికులకు జీవనాధారం అవుతున్నదన్నారు. పోచంపల్లి ఇక్కత్, గద్వాల్ కాటన్, పట్టు చీరలు, నారాయణపేట కాటన్, పట్టు చీరలు,సిద్దిపేట గొల్లభామ చీరలు, వరంగల్ దర్రీస్, కరీంనగర్ డబుల్ క్లాత్ చెద్దర్లు, ఇతర చేనేత వస్త్రాలు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందాయని, వీటిలో ఆరు ఉత్పత్తులు జియోగ్రాఫికల్ ఇండికేషన్ కింద నమోదు అయ్యాయని మంత్రి వివరించారు. రాష్ట్రంలో ప్రస్తుతం 23,046 మంది చేనేత కార్మికులు, 34,569 మంది అనుబంధ కార్మికులు ఈ రంగంలో పని చేస్తున్నారని చెప్పారు.అయితే,ముడి సరుకుల ధరలు పెరగడం,పవర్‌లూమ్ మిల్ రంగాలు తక్కువ ఉత్పత్తి వ్యయంతో వస్త్రాలు తయారుచేయడంతో, మార్కెట్లో చేనేత వస్త్రాలు తయారుచేసే నేత కార్మికులకు గిరాకి లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి తోడు 5శాతం జిఎస్టి విధించడం వల్ల చేనేత ఉత్పత్తుల ధరలు పెరిగి వినియోగం తగ్గిపోతుందని,కార్మికుల జీవనాధారం సంక్షోభంలో పడుతోందని ఆయన తెలిపారు.జిఎస్టి కారణంగా నష్టపోతున్న నేతన్నలు తమ సంప్రదాయ వృత్తిని వదిలి వలస వెళ్ళాల్సిన పరిస్థితి వస్తోందన్నారు. ఖాదీ రంగం, చేనేత రంగం రెండూ సహజసిద్ధమైన గ్రామీణ పరిశ్రమలుగా ఒకే విధంగా ఉన్నప్పటికీ, ఖాదీ ఉత్పత్తులపై జిఎస్టి మినహాయింపు ఉండగా, చేనేత ఉత్పత్తులపై 5శాతం జిఎస్టి కొనసాగించడం అన్యాయమని మంత్రి పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్రంలోని చేనేత సహకార సంఘాలు ఉత్పత్తిదారుల సంఘాలు మరియు కార్మికులు ఈ పన్నును వ్యతిరేకిస్తూ నిరసనలు వ్యక్తం చేస్తున్నాయని ఆయన తెలిపారు.

# దేశ ఆర్థిక వ్యవస్థకు మరింత ఊతం అవసరం

## తదుపరి తరం సంస్కరణలపై ప్రధాని మోడీ ఉన్నత స్థాయి సమావేశం



**న్యూఢిల్లీ, ఆగస్టు 18 :** వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలో భాగంగా ఇండియా నెక్స్ జనరేషన్ రిఫామ్స్‌కు సంబంధించిన రోడ్‌మ్యాప్‌పై చర్చించేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలో ఉన్నత స్థాయి సమావేశం సోమవారం సాయంత్రం నిర్వహించారు. ఢిల్లీలోని ప్రధాని నివాసంలో జరిగిన ఈ సమావేశంలో హోం మంత్రి అమిత్‌షా, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, రోడ్ ట్రాన్స్‌పోర్ట్ మంత్రి నితిన్ గడ్కరి, వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయెల్ తదితరులు పాల్గొన్నారు. భారతదేశ ఆర్థిక వ్యవస్థకు మరింత ఊతం ఇవ్వడం, మౌలిక వసతులను మెరుగుపరచడం, గవర్నన్స్ పటిష్టత దిశగా వ్యూహాత్మక విధానాల రూపకల్పను ఉద్దేశించి ఈ సమావేశం నిర్వహించారు. ఈజీ ఆఫ్ లివింగ్, ఈజీ ఆఫ్ డూయింగ్ బిజినెస్, సర్వతోముఖాభివృద్ధి దిశగా వివిధ రంగాల్లో వేగవంతమైన సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరాన్ని మోడీ ఈ సందర్భంగా ప్రస్తావించారు. అనంతరం సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఈ విషయాలను మోదీ తెలియజేశారు. నెక్స్ జనరేషన్ రిఫామ్స్ కోసం రోడ్‌మ్యాప్ తెచ్చేందుకు జరిపిన సమావేశానికి అధ్యక్షత వహించానని, అన్నిరంగాల్లోనూ వేగవంతమైన సంస్కరణలు తాము కట్టుబడి ఉన్నామని ఆయన తెలిపారు. చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యి భారత్‌లో రెండ్రోజుల అధికార పర్యటనలో భాగంగా భారత్ చేరుకున్న నేపథ్యంలో మోదీ సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది.

అమెరికాతో వాణిజ్య సంబధాల్లో అనిశ్చితి, బీజింగ్, మాస్కోలతో వాణిజ్య సంబంధాలు పెంచుకునేందురు భారత్ ప్రయత్నిస్తున్న క్రమంలో కూడా ఈ సమావేశానికి ప్రాధాన్యతం ఏర్పడింది.

# కోటి మందికి ఎఐ ఆధారిత పౌర సేవలు

## 2027 నాటికి అందించాలన్నదే మా ప్రభుత్వ సంకల్పం

## 20 శాఖలకు చెందిన 250 మంది అధికారులకు ప్రత్యేక శిక్షణ

## రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు




**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఆగస్టు18:** 2027 నాటికి ఏఐ ఆధారిత పౌర సేవలను కోటి మంది ప్రజలకు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. 'ఏఐ లెడ్ డిజిటల్ ట్రాన్స్ఫర్మేషన్ ఛాంపియన్స్ కాటలిస్ట్స్ ప్రోగ్రామ్' పేరిట ఎమర్జింగ్ టెక్నాలజీస్ వింగ్(ఐటీ శాఖ) ఆధ్వర్యంలో ప్రభుత్వాధికారులకు జూబ్లీహిల్స్‌లోని డా.ఎంసీఆర్ హెచ్ఆర్డీ ఇన్స్టిట్యూట్ లో 3 రోజుల పాటు నిర్వహించనున్న శిక్షణా కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... తమది సమస్య వచ్చిన తర్వాత స్పందించే ప్రభుత్వం కాదన్నారు. ముందుగానే ఊహించి పరిష్కరించే చురుకైన, పారదర్శకమైన, ముందుచూపున్న ప్రభుత్వమన్నారు. ఏఐ సహకారంతో ప్రజలు అడగకుండానే వారి ముంగిటకు పౌర సేవలను చేర్చే సరికొత్త తెలంగాణను నిర్మించాలన్నదే తమ సంకల్పమన్నారు. ఈ కొత్త తెలంగాణ 5 బిలియన్ డాలర్ల ఏఐ ఆర్థిక వ్యవస్థకు కేంద్రంగా మారుతుందని, వేలాది ఉద్యోగాలను సృష్టిస్తుందని వివరించారు. ఏఐ క్యాపిటల్ ఆఫ్ ది గ్లోబ్ గా తెలంగాణను తీర్చిదిద్దేందుకు అంతర్జాతీయ ప్రమాణాలతో ఏఐ సిటీ, ఏఐ యూనివర్సిటీ, తెలంగాణ ఏఐ ఇన్నోవేషన్ హబ్‌ను అందుబాటులోకి తేబోతున్నామని చెప్పారు. దేశంలోనే తొలిసారిగా ఏఐ ఆధారిత తెలంగాణ డేటా ఎక్స్ఛేంజ్ ను ప్రారంభించి ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్ గా నిలిచామన్నారు. ఇదే స్ఫూర్తితో 20 ప్రభుత్వ శాఖలకు చెందిన 300 రకాల పౌర సేవలను ఏఐ ఆధారిత ప్లాట్ ఫాంపై అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందుకోసం ఆయా శాఖల నుంచి 250 మంది అధికారులను ఎంపిక చేసి... ఏఐ వినియోగంపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. వీరికి మూడు నెలల పాటు ఏఐ నిపుణులు మెంటార్లుగా వ్యవహరించి మార్గదర్శకత్వం చేస్తారని వివరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణ రావు, స్పెషల్ సీఎస్ సంజయ్ కుమార్, డిప్యూటీ సెక్రెటరీ భవేష్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

# పుతిన్, ట్రంప్‌తో భేటీకి జెలెన్‌స్కీ గ్రీన్ సిగ్నల్

**వాషింగ్టన్, ఆగస్టు 18:** రష్యా ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించే దిశగా జరుగుతున్న ప్రయత్నాల్లో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. తాజాగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ శ్వేతసౌధంలో భేటీ అయ్యారు. జెలెన్‌స్కీ వైట్‌హౌస్‌కు వచ్చినప్పుడు ట్రంప్ ఆయనకు స్వయంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ట్రంప్ మాట్లాడుతూ, దీర్ఘకాలిక శాంతి స్థాపన కోసం ఉక్రెయిన్‌తో సహ అందరితోనూ తాము కలిసి పనిచేస్తామని అన్నారు. ఈ సందర్భంగా ట్రంప్, జెలెన్‌స్కీల మధ్య త్రైపాక్షిక సమావేశం గురించి చర్చ వచ్చింది. ట్రంప్ మాట్లాడుతూ, రష్యాతో యుద్ధాన్ని ముగించేందుకు త్రైపాక్షిక సమావేశం జరగాల్సిన అవసరం ఉందన్నారు. 'త్వరలోనే రష్యాతో కలిసి త్రైపాక్షిక సమావేశం ఏర్పాటు చేస్తాం. ఆ భేటీ సవ్యంగా జరిగితే యుద్ధాన్ని ముగించేందుకు సహేతుకమైన అవకాశాలు ఉంటాయి' అని ట్రంప్ ఆశాభావం వ్యక్తం చేశారు.

**పుతిన్‌తో భేటీకి ఓకే** ఇక జెలెన్‌స్కీ మాట్లాడుతూ, యుద్ధాన్ని ఆపేందుకు,ప్రజల ప్రాణాలు కాపాడేందుకు చొరవ తీసుకుంటున్న డొనాల్డ్ ట్రంప్‌నకు ధన్యవాదాలు తెలిపారు. ట్రంప్ ఆలోచనను తాను సమర్థిస్తున్నాని తెలిపారు. రష్యా, అమెరికాతో తాము త్రైపాక్షిక సమావేశానికి సిద్ధంగా ఉన్నట్లు జెలెన్‌స్కీ పేర్కొన్నారు. ఇటీవల అలాస్కా వేదికగా రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ట్రంప్ సమావేశం జరిగింది. దీని తరువాత ట్రంప్, జెలెన్‌స్కీ భేటీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది.మాటల యుద్ధం తరువాత ఈ ఏడాది ఫిబ్రవరిలో ఓవల్ ఆఫీస్ వేదికగా ట్రంప్ జెలెన్‌స్కీ మధ్య తీవ్ర వాగ్వాదం జరిగిన విషయం తెలిసిందే. కానీ తరువాత చాలా పరిణామాలు జరిగాయి. ఈ నేపథ్యంలో డొనాల్డ్ ట్రంప్‌తో భేటీ అయ్యేందుకు ఈసారి పెద్దఎత్తున ఐరోపా, నాటో నేతలు తరలివచ్చారు.

ఐరోపా కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్‌డెర్, నాటో చీఫ్ మార్క్ రుట్టె, బ్రిటన్ ప్రధాని స్టార్మర్, ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్, ఇటలీ ప్రధాని జార్జియా మెలోని, ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్, తదితరులు శ్వేతసౌధానికి చేరుకున్నారు. ఈ కీలక సమావేశం వేళ ఉక్రెయిన్ రాజధాని కీవ్‌లో సైరన్ల మోత మోగడం గమనార్హం.

# 'హేభగవాన్!' ఖచ్చితంగా హిట్ సినిమా!



ప్రస్తుతం నూతన దర్శకుడు గోపి అచ్చర దర్శకత్వంలో కొత్త ప్రాజెక్ట్‌లో నటిస్తున్నారు. ఈ కంప్లీట్ ఎంటర్‌టైనర్‌ను త్రిశూల్ విజనరీ స్టూడియోస్ బ్యానర్‌పై బి. నరేంద్ర రెడ్డి నిర్మిస్తున్నారు, ఇది వారి ప్రొడక్షన్ నంబర్ 2. రైటర్ పద్మభూషణ్ ఫేం షణ్ముక ప్రశాంత్ ఈ కథను రాశారు. సుహాస్ పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ ఈ చిత్రం టైటిల్ టీజర్‌ను లాంచ్ చేసి ఫన్ ని డబుల్ చేశారు. ఈ చిత్రానికి హే భగవాన్! అనే టైటిల్ పెట్టారు. ఈ టీజర్ సస్పెన్స్, కామెడీతో అదిరిపోయింది. ఒక టీమ్ వీడియో బయటికి వస్తే ఫ్యామిలీ సీక్రెట్ బిజినెస్ బయటపడిపోతుందని నరేష్ పిఎ హెచ్చరించే సన్నివేశంతో టైటిల్ టీజర్ ప్రారంభమవుతుంది. సుహాస్ స్టైలిష్ ఎంట్రీ ఆకట్టుకుంది. సుహాస్, శివానీ నగరం మధ్య సీక్రెట్ ఫ్యామిలీ బిజినెస్ పై జరిగే ఓఆర్గ్యుమెంట్ హిలేరియస్‌గా వుంది. డైరెక్టర్ గోపీ అచ్చర టీజర్‌ని స్మార్ట్‌గా కట్ చేశారు. మిస్టరీ బయటపెట్టకుండా, సిట్యుయేషన్స్, క్యారెక్టర్స్ తోనే లాఫ్స్ జనరేట్ చేశారు. సుహాస్ స్లీక్ లుక్‌లో కామెడీ టైమింగ్‌తో అదరగొట్టాడు. హీరోయిన్‌గా శివాని నాగరం గ్లామరస్‌గా కనిపించింది. సుహాస్ ఫాదర్‌గా నటించిన సీనియర్ నరేశ్ తన నేచురల్ కామెడీతోఆకట్టుకున్నాడు. సుదర్శన్ కూడా తన కామెడీతో ఎంటర్టైన్మెంట్ డబుల్ చేశాడు. మాహిరెడ్డి పందుగుల సినిమాటోగ్రఫీ సినిమాకి కలర్, ఎనర్జీ ఇచ్చింది. వివేక్‌సాగర్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌తోఎంటర్టైన్మెంట్‌ను రెట్టింపు చేశాడు. ఎడిటింగ్ విప్లవ్ నైషదం, ఆర్ట్ డైరెక్షన్ ఏ.రామ్ కుమార్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా రమణా రెడ్డి. మొత్తానికి ఎంగేజింగ్ టీజర్ 'హే భగవాన్! ఫుల్ ఎంటర్టైన్మెంట్ ప్యాకేజీ అవుతుందనే హైప్ క్రియేట్ చేసింది. టైటిల్ గ్లింప్స్ లాంచ్ ఈవెంట్‌లో హీరో సుహాస్ మాట్లాడుతూ, హే భగవాన్ షూటింగు మంచి ఫ్లోలో స్టార్ట్ అయింది. ఈ సినిమాలో సుదర్శన్ నా ఫ్రెండ్ క్యారెక్టర్ చేశాడు. మా ఇద్దరి కాంబినేషన్ చాలా అద్భుతంగా వచ్చింది. తనకి ఈ సినిమాతో చాలా మంచి పేరు వస్తుందని నమ్మకం ఉంది. శివానితో వర్క్ చేయడం రెండోసారి. సినిమాలో మరింత మంచి పేరు వస్తుంది. ప్రొడ్యూసర్ నరేంద్రకి థాంక్యూ. .కథ చెప్పిన వెంటనే పట్టాలెక్కించారు. ఆయన ప్రొడక్షన్లో మరో సినిమా చేస్తున్నాను. త్వరలోనే అది అనౌన్స్ అవుతుంది. ఈ సినిమాకి సపోర్ట్‌గా నిలిచిన వంశీకిధన్యవాదములు. ఆయన చెప్పినట్టు కచ్చితంగా ఈ సినిమా చాలా పెద్ద బ్లాక్ బస్టర్ అవుతుంది. కచ్చితంగా మంచి హిట్ కొడతాం. నా ఫేవరెట్ నరేష్‌తో పనిచేయడం చాలా ఆనందాన్ని ఇచ్చింది. ఈ సినిమాని యాక్సెప్ట్ చేసినందుకు నరేష్‌కి థాంక్యూ సో మచ్. హీరోయిన్ శివాని మాట్లాడుతూసుహాస్‌తో నాకు ఇది సెకండ్ ఫిల్మ్. నాకు ఈ అవకాశం ఇచ్చిన దర్శక నిర్మాతలకు కృతజ్ఞతలు. సుహాస్ చాలా న్యూ లుక్ లో కనిపిస్తున్నారు. నరేష్‌తో వర్క్ చేయడం చాలా ఆనందాన్నిచ్చింది.. డాక్టర్ నరేష్ వి కె మాట్లాడుతూ,. నేను చాలా బిజీగా ఉన్నప్పుడు సామజవరగమన సినిమా వచ్చింది. డేట్స్ అడ్జస్ట్ కావేమో అనుకున్నాను. కానీ రెండు నెలల ఆగి ఆ సినిమా చేయడం జరిగింది. అ సినిమా నాకు నా కెరీర్లో మర్చిపోలేని సినిమా అయింది. హే భగవాన్ కూడా అలాంటి సినిమా అవుతుంది. నాకోసం డేట్స్‌ని అడ్జస్ట్ చేశారు. ఈ సినిమా చేయకపోతే నిజంగా ఒక అద్భుతమైన సినిమా, క్యారెక్టర్‌ని మిస్ అయ్యేవాడిని. హే భగవాన్ ఈ టైటిల్ ఎందుకు పెట్టామో మీరు సినిమా చూసి తెలుసుకోవాలి. డైరెక్టర్ గోపికి చాలా అద్భుతమైన భవిష్యత్తు ఉంటుంది. నిర్మాత నరేందర్ రెడ్డికి అద్భుతమైన విజయాలు రావాలని కోరుకుంటున్నాను. సినిమాలో పనిచేసిన అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. ఈ సినిమాల్లో పార్ట్ కావడం చాలా ఆనందంగా ఉంది. హే భగవాన్ మాస్ ఫ్యామిలీ వంశీ నందిపాటి మాట్లాడుతూ, ఈ సినిమా నిర్మాతలకు అభినందనలు. వారి ప్రొడక్షన్ హౌస్ మరింత గొప్ప స్థాయికి వెళ్లాలని కోరుకుంటున్నాను. సుహాస్ జర్నీ చాలా ఇన్స్పిరేషనల్‌గా ఉంటుంది. తను ఇప్పుడు వరకు చాలా అద్భుతమైన సినిమాలు చేశారు. ఇకపై కూడా సుహాస్ 2.0 చూస్తారు. దానికి పునాది హే భగవాన్ అవుతుంది. నరేష్ అప్పటికి ఇప్పటికీ ఒకే ఎనర్జీతో ఉన్నారు. ఈ సినిమాల్లో కూడా అద్భుతంగా పెర్ఫాం చేశారు. చాలా మంచి టీంతో వస్తున్న సినిమా ఇది. తప్పకుండా మంచి విజయాన్ని సాధించాలని కోరుకుంటున్నాను. తారాగణం: సుహాస్, శివాని నగరం, నరేష్, సుదర్శన్, అన్నపూర్ణమ్మ తదితరులు.



## నిధిఅగర్వాల్ స్పెషల్ పోస్టర్ రిలీజ్

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ తో కలిసి హైబడ్జెట్ స్పెక్టికల్ హరి హర వీర మల్లులో నటించిన నటి నిధి అగర్వాల్, ప్రస్తుతం రెబల్ స్టార్ ప్రభాస్ మోస్ట్ ఎవైటెడ్ మూవీ 'రాజా సాబ్‌లో కీలక పాత్రలో కనిపించనున్నారు. వరుస ఎక్సయిటింగ్ ప్రాజెక్టులతో తన అభిమానులను అలరుస్తున్న నిధి అగర్వాల్ ఇప్పుడు ఓ గ్రిప్పింగ్ హారర్ థ్రిల్లర్‌కి సైన్ చేశారు. నిధి అగర్వాల్ లీడ్ రోల్ లో చేస్తున్న ఈ సినిమాని తన పుట్టినరోజు సందర్భంగా అధికారికంగా అనౌన్స్ చేశారు. ఈ చిత్రాన్ని జ్యోతి క్రియేషన్స్ బ్యానర్ కింద శ్రీపుప్పాల అప్పల రాజు (ఎ.ఆర్.) నిర్మిస్తున్నారు, ఇది వారి ప్రొడక్షన్ నంబర్1. ఈ ఎక్సయిటింగ్ ప్రాజెక్ట్‌తో దర్శకుడిగా నిఖిల్ కార్తీక్.ఎన్ అరంగేట్రం చేస్తున్నారు. నిధి స్పెషల్ డేను సెలబ్రేట్ చేస్తూ మేకర్స్ ఓ స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఆ పోస్టర్ ద్వారా నిధికి విషెస్ చెప్తూ, రాబోయే సినిమా హారర్ థ్రిల్ ని ముందుగానే టోన్ సెట్ చేశారు. ఈ సినిమా భారీ స్థాయిలో తెరకెక్కనుంది.

## రాజమౌళి లాంచ్ చేసిన రావుబహదూర్

దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి లాంచ్ చేసిన జీఎంబి ఎంటర్‌టైనమెంట్ ప్రెజెంట్స్, సత్య దేవ్, వెంకటేష్ మహా, ఎ+ఎస్ మూవీస్‌శ్రీచక్రాస్ ఎంటర్‌టైనమెంట్స్ 'రావు బహదూర్ర్ నాట్ ఈవెన్ ఎ టీజర్ సూపర్‌స్టార్‌మహేష్ బాబు, నమ్రతా శిరోద్కర్ జీఎంబి ఎంటర్‌టైన్ మెంట్ ఫిల్మ్ మేకర్ వెంకటేష్ మహా కొత్త చిత్రంరావు బహదూర్‌ను గర్వంగా ప్రజెంట్ చేస్తోంది. ఇందులో వెర్సటైల్ హీరో సత్య దేవ్ ప్రధాన పాత్రలో నటించారు. కేరాఫ్ కంచరపాలెం, ఉమా మహేశ్వరఉగ్రరూపస్య చిత్రాలతో విమర్శకుల ప్రశంసలు పొందిన వెంకటేష్ మహా ఇప్పుడు తెలుగుసినిమా బౌండరీలు దాటే ఒక ఎక్సయిటింగ్ సైకాలజిక్ డ్రామాలోకి అడుగు పెడుతున్నారు. పరిశ్రమలో నిఅత్యంత విజయ వంతమైన రెండు బ్యానర్‌లు ఎ+ఎస్ మూవీస్, శ్రీచక్రాస్ ఎంటర్‌టైన్ మెంట్స్‌తో కలిసి నిర్మిస్తున్న రావు బహదూర్ ఇప్పటికే సంచలనాలు సృష్టిస్తోంది. టైటిల్ ఫస్ట్‌లుక్ పోస్టర్ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఈరోజు దర్శక ధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి 'నాట్ ఈవెన్ ఎ టీజర్' లాంచ్ చేశారు. జమీందారీ నేపథ్యంలో ఈ కథ సాగుతుంది. ఓ పాత కోటలో ఒంటరిగా జీవిస్తున్న హీరోని పరిచయం చేస్తారు. తనకి అనుమానం అనే భూతం పట్టుకుందని నమ్ముతాడు. ఆ అనుమాన భూతమే తన జీవితాన్ని మార్చేస్తుంది. నిజం, భ్రమ మధ్య గీతే కనిపించకుండా చేస్తుంది. అతని గతంలో ఒక రహస్యమైన ప్రేమకథ కూడా ఉంటుంది. ఆ ప్రేమకథలోనూ లోతైన భావోద్వేగాలు, సైకాలజికల్ లేయర్స్ దాగి ఉంటాయి. మరోవైపు పోలీస్ ఇన్వెస్టిగేషన్ లైన్ కూడా నడుస్తుంది. కానీ వాళ్ల ప్రశ్నలతో క్లారిటీ రాకుండా, మిస్టరీ మరింత పెరుగుతుంది. ఇవన్నీ కేవలం స్టార్ట్ మాత్రమే, ఇక్కడి నుంచి ఇంకా టెర్రిఫిక్ ట్విస్ట్ మొదలౌతుంది. . తన ప్రత్యేకమైన నేరేషన్‌తో వెంకటేశ్ మహా మరోసారి తన స్టోరీటెల్లింగ్‌కి స్పెషల్ మార్క్ వేశారు. డ్రామా, సైకాలజికల్ థ్రిల్, డార్క్ హ్యూమర్ థ్రిల్ చేశాయి. హీరో సత్యదేవ్ అద్భుతమైన పెర్ఫార్మెన్స్ ఇచ్చాడు. యవ్వనం నుంచి వృద్ధాప్యం వరకు వేర్వేరు లుక్స్‌లో, వేర్వేరు భావాలతో పాత్రను అద్భుతంగా పోషించాడు. అతని నటనలోని డెప్త్, న్యూయాన్స్ కట్టిపడేశాయి. అతనితో పాటు వికాస్ ముప్పాల, దీపా థామస్, ఆనంద్ భారతి లాంటి ప్రధాన పాత్రలను కూడా పరిచయం చేశారు. సినిమాటోగ్రాఫర్ కార్తిక్ పర్మార్ విజువల్స్ ట్రీట్ ఇచ్చారు. మ్యూజిక్ డైరెక్టర్ స్మరన్ సాయి బ్యాక్‌డ్రాప్‌ని ఎలివేట్ చేశారు. ప్రొడక్షన్ డిజైనర్ రోహన్ సింగ్ సెట్‌లతో రియలిస్టిక్ ఫీల్ ఇచ్చాడు. మొత్తంగా గ్రాండ్ సినిమాటిక్ విజన్ కనపడుతుంది. నాట్ ఈవెన్ ఎ టీజర్"తో క్యురియాసిటీ రెట్టింపైంది. రావు బహదూర్ తెలుగుతో పాటు ఇతర భాషల సబ్టైటిల్స్‌తో 2026 సమ్మర్‌లో ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ అవుతుంది. తారాగణం: సత్య దేవ్, వికాస్ ముప్పాల, దీపా థామస్, బాల పరాసర్, ఆనంద్ భారతి, ప్రణయ్‌వాక, మాస్టర్ కిరణ్, సాంకేతికసిబ్బంది: రచన, దర్శకత్వం, ఎడిటర్: వెంకటేష్ మహాసమర్పణ: మహేష్‌బాబు, నమ్రత శిరోద్కర్ జీఎమ్‌బి ఎంటర్‌టైన్‌మెంట్ ,నిర్మాతలు: చింతా గోపాలకృష్ణ రెడ్డి, అనురాగ్ రెడ్డి ,శరత్ చంద్ర ప్రొడక్షన్ బ్యానర్స్: ఎ+ఎస్‌మూవీస్, శ్రీచక్రాస్ ఎంటర్‌టైన్‌మెంట్స్.



## 'సుందరకాండ్ల లో స్ట్రాంగ్ క్యారెక్టర్‌చేశా

హీరో నారా రోహిత్ మైల్ స్టోన్ 20వమూవీ 'సుందరకాండ'. నూతన దర్శకుడు వెంకటేష్ నిమ్మల పూడి దర్శకత్వం వహిస్తున్నారు. సందీప్ పిక్చర్ ప్యాలెస్ (ఎస్ పి పి) బ్యానర్‌పై సంతోష్ చిన్నపొల్ల, గౌతమ్ రెడ్డి, రాకేష్ మహంకాళి నిర్మిస్తున్నారు. వృతి వాఘాని, శ్రీదేవి విజయ్‌కుమార్ హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. టీజర్, పాటలు, ట్రైలర్ స్ట్రాంగ్ బజ్‌ను క్రియేట్ చేశాయి. ఈ సినిమా ఆగస్టు 27న విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ శ్రీదేవి విజయ్ కుమార్ విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.



**రీఎంట్రీలో కూడా హీరోయిన్‌గా వస్తున్నారు. ఎలా ఫీలవుతున్నారు?**


చాలా హ్యాపీగా ఉంది. ఏ యాక్టర్ కైన మంచి క్యారెక్టర్ చేయాలని ఉంటుంది. ఏదైనా క్యారెక్టర్ స్ట్రాంగ్‌గా ఉండాలి. ఇందులో చాలా మీనింగ్ ఫుల్ క్యారెక్టర్ చేస్తున్నాను. అన్నిచోట్ల నుంచి చాలా మంచి అప్రిషియేషన్స్ వస్తున్నాయి. ఇది చాలా ఆనందాన్ని ఇచ్చింది. చాలా కొత్త పాయింట్ తో వస్తున్న ప్రాజెక్ట్. ఒక ఆడియన్‌గా ఈ సినిమా నాకు చాలా నచ్చింది. అవుట్ ఫుట్ చాలా అద్భుతంగా వచ్చింది. చాలా ఫ్రెష్ కంటెంట్. అందరూ థియేటర్ కి వెళ్లి చాలా ఎంజాయ్ చేయొచ్చు.

**మీరు సినిమాలకి బ్రేక్ ఇవ్వడానికి కారణం ఏమిటి?**


నేను హీరోయిన్‌గా చేస్తున్న రోజుల్లోనే పెళ్లి చేసుకున్నాను. పెళ్లి ఇంట్లో ముందుగానే ప్లాన్ చేశారు. తర్వాత అమ్మాయి పుట్టింది. అలా సినిమాలకి ఒక బ్రేక్ వచ్చింది. ఆ తర్వాత టీవీలోకొన్నిప్రోగ్రామ్స్ చేశాను. ఇన్నిసంవత్స రాలగ్యాప్‌తర్వాత స్క్రీన్ మీదచూసుకోవడంచాలా ఎక్సైటింగ్‌గా ఉంది. లాస్ట్ ఇయర్ ఈశ్వర్ సినిమా రీరిలీజ్ అయింది. అదికూడా చాలా మంచి ఎక్స్పీరియన్స్ ఇచ్చింది. ఇప్పుడుమా అమ్మాయి ఎద్దదయింది. మరిన్నిసినిమాలు చేయడానికి అవకాశం దొరికింది. సుందర కాండలో మీ క్యారెక్టర్ చెప్పినప్పుడు ఎలా అనిపించింది? డైరెక్టర్ ఈ కథ చెప్పగానే షాక్ అయ్యాను. చాలా కొత్త స్క్రిప్ట్. కొంచెం సమయం కావాలని అడిగాను. కానీడైరెక్టర్‌అంత టైం ఇవ్వలేదు. ఆయన చాలా కాన్ఫిడెంట్‌గా ఉన్నారు. చెప్పినట్టే అద్భుతంగా తీశారు. సినిమా చాలా బాగా వచ్చింది. మంచి ఎంటర్టైనర్ ఇది.

## సోనీ పిక్చర్స్‌ఎంటర్‌టైన్‌మెంట్ "డీమన్ స్లేయర్ : విడుదల

క్రంచిరోల్, సోనీ పిక్చర్స్ ఎంటర్‌టైన్‌మెంట్, ఈ ఎపిక్ ట్రైలజీ యొక్క మొదటి చిత్రాన్ని భారతదేశంలోని థియేటర్లలో 2025 సెప్టెంబర్ 12న విడుదల అవుతుంది. ప్రపంచవ్యాప్తంగా యానిమేకు ఒక బెంచ్ మార్క్ అయిన క్రంచిరోల్, ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'డీమన్ స్లేయర్: కిమెట్సు నో యైబా - ఇన్ఫినిటీ క్యాసిల్" తమిళ, తెలుగు ట్రైలర్లను రిలీజ్ చేసింది. ఈ ఎపిక్ ట్రైలజీ యొక్క ఫస్ట్ పార్ట్ ని భారతదేశంలో 2025 సెప్టెంబర్ 12న ప్రత్యేకంగా థియేటర్లలో మాత్రమే విడుదల అవుతుంది. ఇందులో, ఇంకా ప్రీమియం లార్జ్ ఫార్మాట్‌లలో కూడా రిలీజ్ కాబోతుంది. ఈ సినిమా జపనీస్‌లో ఇంగ్లీష్ సబ్‌టైటిల్స్‌తో పాటు, ఇంగ్లీష్, హిందీ, తమిళ్, తెలుగు భాషల్లో డబ్బింగ్ చేశారు. కథ విషయానికి వస్తే: టాంజిరో కామాడో అనే పిల్లోడి ఫ్యామిలీని ఒక రాక్షసుడు చంపేస్తాడు. అతని చెల్లెలు నెజుకో రాక్షసిగా మారుతుంది. ఆమెను మళ్లీ మామూలు మనిషిలా తిరిగి మార్చాలనే సంకల్పంతో టాంజిరో డీమన్ స్లేయర్ కార్ప్స్ చేరతాడు. ఈ సిరీస్, మనుషులు, రాక్షసుల మధ్య జరిగే విషాదగాథ, కత్తి యుద్ధాలు, ఆకట్టుకునే కారక్టర్స్, కామెడీ సీన్స్‌తో ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులను అలరిస్తుంది. ఈ సినిమా మొత్తం త్రీ పార్ట్‌లో రానుంది: ఈ త్రీ పార్ట్ సినిమాటిక్ మూవీ, అత్యంత ప్రజాదరణ పొందిన అవార్డు గెలుచుకున్న షోనెన్ యానిమే సిరీస్ యొక్క లాస్ట్ ఆర్క్ గా నిలుస్తుంది. ఈ చిత్రాన్ని జపాన్ కొన్ని ఆసియా దేశాల్లో తప్ప, ప్రపంచవ్యాప్తంగా క్రంచిరోల్ సోనీ పిక్చర్స్ ఎంటర్‌టైన్‌మెంట్ వాళ్ళు రిలీజ్ చేయనున్నారు.



## పరదా నా కెరీర్ లో బెస్ట్ ఫిల్మ్




సినిమా బండి ఫేమ్ డైరెక్టర్ ప్రవీణ్ కాండ్రేగుల 'పరద్దా అనే మరో ఎక్సయిటింగ్ ప్రాజెక్ట్ తో వస్తున్నారు. 'ది ఫ్యామిలీ మ్యాన్' సిరీస్ మేకర్స్ రాజ్, డికె మద్దతు ఇస్తున్నారు. అనుపమ పరమేశ్వరన్ కథానాయికగా, దర్శన రాజేంద్రన్‌తో పాటు, సంగీత ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. రాగ్ మయూర్ ముఖ్యమైన పాత్ర పోషించారు. ఆనంద మీడియా బ్యానర్‌పై శ్రీనివాసులు పివి, శ్రీధర్ మక్కువతో కలిసి విజయ్ డొంకడ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా టీజర్ ట్రైలర్ పాటలు మంచి బజ్ క్రియేట్ చేశాయి. 'పరద్దాఆగస్ట్ 22న థియేటర్స్‌లో రిలీజ్ అవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ గ్రాండ్ గా ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ప్రీరిలీజ్ ఈవెంట్ లో హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. డైరెక్టర్ ప్రవీణ్ చాలా ప్యాషన్‌తో ఈ సినిమా తీశారు. ఆయన ఎప్పుడూ సినిమా గురించే ఆలోచిస్తారు. నిర్మాతలు విజయ్ శ్రీధర్ ఎన్ని అడ్డంకులు వచ్చినా ఈ సినిమాని బలంగా నమ్మి ఎక్కడ రాజీ పడకుండా చాలా అద్భుతంగా నిర్మించారు. చిరంజీవి బర్తే డే ఆగస్టు 22 నఈ సినిమా థియేటర్స్ లో రిలీజ్ అవుతుంది. దర్శనకి తెలుగు ఇండస్ట్రీకి వెల్కమ్ చెప్తున్నాను. దర్శన ఈ సినిమా కోసం చాలా హార్డ్ వర్క్ చేసింది. ఒక తెలుగు అమ్మాయిలాగే డైలాగ్స్ అన్నీ నేర్చుకుంది. సంగీత ఈ సినిమాకి మరో బిగ్ పిల్లర్. అందరూ రిలేట్ చేసుకునే క్యారెక్టర్ చేశారు. ఈ సినిమాలో పనిచేసిన నటీనటులకు టెక్నీషియన్స్‌కి అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. నా కెరీర్ లోనే బెస్ట్ ఫిలిం పరదా. ఆగస్టు 22 మీరు కూడా అదే చెప్తారని నమ్మకం నాకుంది. మీరు సినిమా చూడండి. నచ్చితే ఫ్రెండ్స్‌కి సజెస్ట్ చేయండి. రివ్యూస్ చూసే థియేటర్స్‌కి వెళ్ళండి. మీకు తప్పకుండా సినిమా నచ్చుతుంది. అందరికీ థాంక్యూ. దర్శన రాజేంద్రన్ మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. పరదా చాలా స్పెషల్ ఫిలిం. ఆగస్టు 22న తప్పకుండా ఈ సినిమా చూడండి. ఒక మ్యాజిక్ ని ఎక్స్పీరియన్స్ చేస్తారు. అనుపమ స్క్రీన్ పై గ్రేట్ మ్యాజిక్ చేస్తుంది. ఈ సినిమాల్లో పనిచేసిన అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. తప్పకుండా ఈ సినిమా చూడండి. చాలా ఎంజాయ్ చేస్తారు. మీకు చాలా గ్రేట్ ఎక్స్పీరియన్స్ ఇస్తుంది. డైరెక్టర్ ప్రవీణ్ కాండ్రేగుల మాట్లాడుతూ, పరదా చాలా మంచి ఫిలిం. తెలుగులో విమెన్ సెంట్రిక్ ఫిలిమ్స్ చాలా తక్కువగా వస్తాయి. ఈ సినిమా సక్సెస్ అయితే ఇలాంటి మరెన్నో సినిమాలు వస్తాయి. అనుపమ కూడా పెద్ద స్టార్. మీరందరూ కూడా ఫ్యామిలీతో కలిసి వెళ్లి ఈ సినిమా చూడండి. అనుపమ సంగీత దర్శన ఇలా అద్భుతమైన పెర్ఫార్మన్స్ తో ఈ సినిమా తీయడం జరిగింది. ఈ సినిమా డబ్బులు వస్తే మిగతా ప్రొడ్యూసర్స్‌కి ఒక మంచి హోప్‌ని ఇస్తుందని భావిస్తున్నాను. పరదా సినిమా మలయాళం లో బ్లాక్ బస్టర్ అవ్వాలి. మన తెలుగు సినిమా మలయాళం లో బ్లాక్ బస్టర్ అవ్వాలి. అది నా కోరిక.

## అమర్ దీప్ ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల

విజన్ మూవీ మేకర్స్ బ్యానర్‌పై కొమ్మాలపాటి శ్రీధర్ సమర్పణలో కొమ్మాలపాటి సాయి సుధాకర్ నిర్మిస్తున్న'సుమతీ శతకం'నుంచి కృష్ణాష్టమి సందర్భంగా అమర్ దీప్ ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల..విజన్ మూవీ మేకర్స్ బ్యానర్‌పై కొమ్మాలపాటి శ్రీధర్ సమర్పణలో కొమ్మాలపాటి సాయి సుధాకర్ నిర్మిస్తున్న'సుమతీ శతకం'నుంచి కృష్ణాష్టమి సందర్భంగా అమర్ దీప్‌ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల. విజన్ మూవీ మేకర్స్ బ్యానర్‌పై అమర్ దీప్, సైలీ హీరో హీరోయిన్లుగా కొమ్మాలపాటి శ్రీధర్ సమర్పణలో కొమ్మాలపాటి సాయి సుధాకర్ నిర్మిస్తున్న చిత్రం సుమతీ శతకం ఈ సినిమాకు ఎం.ఎం. నాయుడు దర్శకత్వం వహిస్తున్నారు. గత కొన్ని రోజుల క్రితం ఈ మూవీ నుంచి హీరోయిన్ సైలీ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేసి అందరినీ ఆకట్టుకున్న సంగతి తెలిసిందే. కృష్ణాష్టమి సందర్భంగా నేడు (ఆగస్ట్ 16) హీరో పాత్రని పరిచయం చేశారు. అమర్ దీప్ ఇందులో ఓ మిడిల్ క్లాస్ కుర్రాడిలా కనిపించబోతున్నారు. ఇక ఈ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను చూస్తుంటే కుటుంబ సమేతంగా చూడదగ్గ చిత్రమని అర్థం అవుతోంది. అమర్ దీప్ మెడలో కూరగాయలతో అల్లిన దండలు, ఆ బ్యాక్ గ్రౌండ్ వాతావరణం, ఆయన క్యాస్టూమ్స్ ఇలా అన్నీ కూడా ఇదొక ఫీల్ గుడ్ ఎంటర్టైనర్ అని చెప్పకనే చెప్పేస్తున్నాయి. ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ పూర్తయింది. త్వరలోనే టీజర్, ట్రైలర్‌ను కూడా ఆడియెన్స్ ముందుకు తీసుకు రాబోతోన్నారు. పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాల్ని వీలైనంత త్వరగా పూర్తిచేసి విడుదల తేదీని ప్రకటించాలని మేకర్లు భావిస్తున్నారు. దసరాకి విడుదల చేయాలనే లక్ష్యంతో సినిమా యూనిట్ అహర్నిశలు కష్టపడుతోంది. ఈ చిత్రానికి మ్యూజిక్ డైరెక్టర్‌గా సుభాష్ ఆనంద్, డైలాగ్స్ రైటర్‌గా బండారు నాయుడు, ఎడిటర్‌గా నాహిద్ మొహమ్మద్, ఆర్ట్ డైరెక్టర్‌గా విశ్వ ప్రసాద్, కెమెరామెన్‌గా హరేష్ పని చేస్తున్నారు.



## మ్యూజికల్ లవ్ స్టోరీ



'మేఘాలు చెప్పిన ప్రేమ కథ' చాలా మంచి మ్యూజికల్ లవ్ స్టోరీ. కథ, మ్యూజిక్, విజువల్స్ ఆడియన్స్‌కి గొప్ప థియేట్రికల్ ఎక్స్ పీరియన్స్ ఇస్తాయి: నిర్మాత ఉమా దేవి కోట డైరెక్టర్ విపిన్ యంగ్ హీరోనరేష్అగస్త్య, దర్శకుడువిపిన్ దర్శకత్వంలో, సునేత్ర ఎంటర్టైన్మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్ పైఉమాదేవి కోటనిర్మించిన మ్యూజికల రొమాంటి క్డ్రామా 'మేఘాలు చెప్పిన ప్రేమ కథ'లో ప్రేక్షకులను అలరించడానికి సిద్ధంగా ఉన్నారు. చిత్రంలో రబియా తూన్ కథా నాయిక. ఇప్పటికే రిలీజ్ అయినరెండు టీజర్లు, సాంగ్స్ సినిమాపై అంచనాలను పెంచాయి. ఈ చిత్రం ఆగస్ట్ 22న గ్రాండ్ గా విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్మాత ఉమా దేవి కోట, డైరెక్టర్ విపిన్ విలేకరులు సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

**మా డైరెక్టర్ తెలుగు ప్రియుడు, కవి.ఈ ప్రేమ కథలో కొత్తదనం ఏమిటి?**

ఒక మనిషి మరో మనిషి చూసినప్పుడు ఎలా ఇన్స్పైర్ అవుతారు .ప్రేమ ఎలా పుడుతుంది అనేది ఈ కథలో మీరు చూస్తారు. ప్రేమ ఇన్స్పైర్ తో పాటు కొన్నిసార్లు ఇన్ఫ్లుయెన్స్ కూడా చేస్తుంది. ఆ ఆ కోణం కూడా ఈ కథలో ఉంటుంది.

**రాధిక క్యారెక్టర్ ఎలా ఉండబోతుంది?**

-ఇందులో రాధిక హీరో గ్రాండ్ మదర్‌గా కనిపిస్తారు. ఆవిడ చాలా మంచి సింగర్. కానీ కొన్ని కారణాల వల్ల పాడడం మానేసి మామూలు ఫ్యామిలీ లైఫ్ గడుపుతారు.

**అలా గడిపినప్పుడు ఆవిడ ఎంత ఫీలై ఉంటారు?**

ఆ క్యారెక్టర్‌లో చాలా అద్భుతంగా చూపించడం జరిగింది. రాధిక స్క్రీన్ ప్రజెన్స్ చాలా అద్భుతంగా ఉంటుంది ఒక డివైన్ ఫీలింగ్ వస్తుంది. హీరో క్యారెక్టర్ ని ఇన్స్పైర్ చేసే క్యారెక్టర్ అది. ఈ సినిమా రోలింగ్ వరకు కూడా చూడాలని కోరుకుంటున్నాను. రోలింగ్ టైటిల్ వచ్చే సీన్ అందరికీ నచ్చుతుంది.

**ఇది మ్యూజికల్ స్టోరీనా?**

-ఇందులో హీరోది మ్యూజికల్‌గా ప్రూవ్ చేసుకోవాలనుకునే క్యారెక్టర్. ఈ సినిమా కోసం ట్రావెన్ కోర్ ప్రిన్స్‌ని నటింప చేయడం జరిగింది. ఆయన శాస్త్రీయ సంగీతం కోసం చేసిన సేవ మనం ఊహించలేము. అలాంటి ఒక క్యారెక్టర్‌ని పరిచయం చేయడం చాలా ఆనందాన్ని ఇచ్చింది. **భవిష్యత్తులో ఇంకా ఎలాంటి సినిమాలు నిర్మించాలనుకుంటున్నారు?**

నాకురియలిస్టిక్‌డ్రామఉండేసినిమాలుఅంటేఇష్టం. భవిష్యత్తులో కూడా రియల్ ఎమోషన్స్ ఉండే సినిమాలు తీయాలని వుంది . థాంక్ యూ.

# ఇ-ఫాస్టింగ్ అవసరమే !



డైటింగ్ కోసమో, భక్తి పేరుతోనో అప్పుడప్పుడూ ఓ పూట అయినా ఉపవాసం చేస్తుంటాం. అలానే మన మానసిక ఆరోగ్యం కోసం వారంలో ఓ రోజు ఈ-ఉపవాసమూ చేయమంటున్నారు నిపుణులు. అసలేమిటిది? ఎందుకో తెలుసుకుందామా!

ఆ మధ్య మధ్యప్రదేశ్ బేగంగంజ్ ప్రాంతంలో కొందరు జైనులు.. పర్యూషణ్ పర్వ్ సందర్భాన్ని పురస్కరించుకుని ఆ రోజు డిజిటల్ ఫాస్టింగ్ చేశారు. ఆధ్యాత్మిక భావనలో గడిపేశారు. ఆత్మశుద్ధి చేసుకోగలగడం, ఆత్మ పరిశీలనకు అవకాశం కలగడంతోపాటు ఆధ్యాత్మికంగా తమను తాము మెరుగుపర్చుకోవడానికి అవకాశముంటుందని ఈ ప్రయోగం చేశారట.

**అసలేంటిది:** కొన్ని గంటలు లేదా ఓరోజు పూర్తిగా ఎలక్ట్రానిక్ వస్తువులు, గ్యాడ్జెట్లకు దూరంగా ఉండటమే ఈ-ఫాస్టింగ్! దీనివల్ల ఒత్తిడి అదుపులో ఉంటుంది. అశాంతి ఆమడ దూరం పారిపోతుంది. అందుకే, నెలలో కనీసం రెండు రోజులైనా దీన్నిపాటించాలంటున్నారు నిపుణులు.

**ఏం చేద్దాం ...** ఈ ఫాస్టింగ్‌కు అలవాటు పడటం అంత సులువేం కాదు. ముందు మీ రోజువారీ అవసరాలేంటి? ఎలక్ట్రానిక్ వస్తువులైన ఫోన్, ల్యాప్‌టాప్, స్మార్ట్ వాచ్.. ఇలా ఏదీ లేకుండా ఉండగలమా లేదా? అన్నది గమనించుకోండి. దానికి కొన్ని రోజుల ముందు నుంచే చిన్నగా ఒక్కో అలవాటునీ తప్పించుకోండి. ఉదయం నిద్ర లేవడానికి గడియారంలోనే అలారం పెట్టండి. ఫోన్‌లో కాలక్షేపానికి వినియోగించే అనవసరమైన యాప్స్‌ను తొలగించండి. సామాజిక మాధ్యమ ఖాతాలను సైన్‌అవుట్ చేసేయండి.

**ప్రయోజనాలెన్నో..** నిద్రలేచిన వెంటనే ఫోన్ లేకుండా.. ఆరుబయట అందాలను ఆస్వాదించొచ్చు. నులివెచ్చని సూర్యోదయాన్ని చూస్తూ కాఫీ తాగుతూ ఉల్లాసంగా గడిపేయొచ్చు. చిన్న చిన్న స్ట్రెచ్‌లు, నడక, యోగాసనాలు ప్రయత్నిస్తూ శరీరాన్ని దృఢంగా ఉంచుకోవచ్చు.

- ఆపై రోజువారీ ప్రణాళిక చేసుకోవడం, సకాలంలో పనులు పూర్తిచేయడం వంటివన్నీ చకచకా పూర్తయిపోతాయి.
- పత్రికలు, మ్యాగజీన్‌లు చదవండి. చుట్టుపక్కల వారితో మాట్లాడండి. ఇవన్నీ మీకో కొత్త ప్రపంచాన్ని పరిచయం చేస్తాయి. అదీ లేదంటే ఆసక్తి ఉన్న మరో అంశంపై దృష్టిపెట్టండి.
- విరామమో, విశ్రాంతో అంటూ.. గ్యాడ్జెట్స్‌తో గడిపేసిన మీరు కుటుంబానికి తగిన సమయం కేటాయించి ఉండకపోవచ్చు. ఇందుకు ఈ టైమ్‌ని వాడండి. కలిసి భోజనం చేయండి. అంతా కలిసి ఆటలాడండి. ఇవన్నీ మీలో ఆందోళనల్ని దూరం చేస్తాయి. ఆత్మవిశ్వాసాన్ని నింపుతాయి. నిద్రలేమి సమస్యను తగ్గించి మానసిక ప్రశాంతతను అందిస్తాయి. ◻

# వారి స్ఫూర్తికి జాతీయ స్థాయిలో పురస్కారాలు

మహిళలు సంఘటితమైతే అసాధ్యాన్ని సుసాధ్యం చేయగలరు. అందుకు ఉదాహరణే... విజయనగరం జిల్లా గంట్యాడ, రాజాం మండలాల స్వయం సహాయక సంఘాల సభ్యులు. స్వయంకృషితో పేదరికాన్ని దూరం చేసుకుంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు. తాజాగా కేంద్ర గ్రామీణాభి వృద్ధిని అందించే ఆత్మనిర్భర్ సంఘటన్ పురస్కారాలకూ ఎంపికయ్యాయి. జాతీయ స్థాయిలో ప్రథమ, తృతీయ స్థానాల్లో నిలిచాయి సంఘాలు. పొదుపు ఉద్యమంలో చేరితే జీవితాలు మారతాయన్న అధికారుల మాట నమ్మి గంట్యాడ అయితే కొందరు మహిళలు ముందుకొచ్చారు. శ్రీలక్ష్మి మహిళా పొదుపు సంఘంగా ఏర్పడి, రోజుకు రూపాయి చొప్పున నెలకు రూ.30 పొదుపు చేశారు. ఆరు తర్వాత రూ.25 వేలు నెలల రుణం తీసుకున్నారు. చిరు వ్యాపారాలు ప్రారంభించి పొదుపు కొనసాగిస్తూనే... వాయిదాలూ చెల్లించేవారు. సకాలంలో అప్పు తీర్చడంతో బ్యాంకు ఇచ్చే రుణమొత్తం పెంచుతూ వచ్చింది. సంఘం సభ్యులు వివిధ వ్యాపారాలు ప్రారంభించి అంచెలంచెలుగా ఎదిగారు. ఆర్థికంగా ఎదుగుతోన్న వీళ్లను చూసి, మిగిలిన మహిళలూ ప్రేరణ పొందారు. అలా సభ్యుల సంఖ్య పెరుగుతూ వచ్చింది. పొదుపు ఉద్యమంలో చేరి కుటుంబాన్ని ప్రగతిపథంలో నడిపించడమే కాదు, అత్యవసరమైన సభ్యులకు తక్కువ వడ్డీకి రుణాలిస్తూ సమష్టిగా ముందుకు సాగుతున్నారు. ఆర్థిక స్వావలంబన సాధిస్తున్నారు. ప్రస్తుతం గంట్యాడ మండలంలో 1,701 స్వయం సహాయక సంఘాల్లో 18,333 మంది సభ్యులు... రాజాం మండలంలో 1,426 మంది స్వయం సహాయక సంఘాల్లో 14,553 మంది సభ్యులు ఉన్నారు.

**వరుసగా మూడోసారి...** గంట్యాడ ముండల మహిళా సమాఖ్య... ఏపీ మ్యాక్స్ చట్టం ప్రకారం స్వయం ప్రతిపత్తి సంఘంగా ఎదిగింది. మూడేళ్లుగా జాతీయ అవార్డుకు ఎంపికైంది. వాయిదా సమయంలో చెల్లించడం, ఆదాయంలో 30 శాతమే ఖర్చులుండేలా చూసుకోవడం వీరి విజయానికి కారణాలు, ఏటా తప్పకుండా ఆడిట్ నిర్వహించారు. దీనికి తగ్గట్టే అధికారుల డిజిటల్ నైపుణ్యంతోపాటు ఆర్థిక అక్షరాస్యత, బ్యాంకింగ్, లావాదేవీలపై మహిళలకు శిక్షణనివ్వడం వీరికి కలిసొచ్చింది. గంట్యాడ సమాఖ్య మహిళలు జ్యూట్ బ్యాగులు, బేకరీ, డెయిరీ ఉత్పత్తులు, సబ్బులు, ఫినాయిల్, లిక్విడ్ సోప్ వంటివాటి తయారీతో ఆదాయం పొందుతున్నారు.





ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సమర్థంగా చేసింది. సెర్ఫ్, డీఆర్డీఏ సంస్థల ప్రదర్శన, విక్రయానికి వీరికి అవకాశం కల్పిస్తున్నాయి. రాష్ట్రంలోని ప్రధాన నగరాలకు ఉత్పత్తులు పంపడమే కాదు... గ్రామ, మండల స్థాయిల్లో వ్యాపారులతో ఒప్పం దాలు చేసుకుని విక్రయాలు పెంచుకుంటు న్నారు. ప్రైవేటు సంస్థలతోనూ భాగస్వామ్య ఒప్పందాలు చేసుకుంటున్నారు.

**సేవలోనూ ముందే....** రాజాం మండల సమాఖ్య... రైతులకు అవసరమైన టార్పాలిన్లు అమ్ముతోంది. దళారులకు అవకాశం లేకుండా ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు చేసి, రైతులకు సరైన ధర అందేలా చూస్తోంది. అంతేకాదు, ఈ మహిళల కుటుంబ సమస్యలను దగ్గరుండి పరిష్కరిస్తారు. కిచెన్ గార్డెన్స్ని ప్రోత్సహి స్తున్నారు. నిరుద్యోగ యువతకు ఆసక్తి ఉన్న రంగాల్లో శిక్షణ, ఆరోగ్యం, పోషకాహారం వంటివాటిపై ప్రజలకు అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలు చేస్తున్నారు. ◻

# టైమ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలి..



మనం స్నేహితులను కలవడానికి వెళ్తున్నప్పుడు ట్రాఫిక్ జామ్ అయిదనుకోండి. అప్పుడు మీకు ఏమనిపిస్తుంది? అబ్బా ఈ ట్రాఫిక్‌లో ఎంతసేపూ సమయం గడవదే అనే కదా! అదే మరి స్నేహితులతో సరదాగా ముచ్చట్లాడు తుంటే ఏమనిపిస్తుంది. అప్పుడు టైమ్ అయి పోయిందా! అని కదా. సమయం ఎప్పుడూ ఒకలానే ఉంటుంది. మరిమనికి ఎందుకు అలా అనిపిస్తుందో తెలుసా! 'సమయమే డబ్బు', 'సమయాన్ని ఆదా చేయడం, ఖర్చుచేయడం' లాంటి మాటలు ప్రస్తుత జీవనశైలిలో మనం సమయానికి ఇచ్చే ప్రాధాన్యతను తెలియజేస్తున్నాయి. ముఖ్యంగా ఇవి పట్టణ వాతావరణంలో నివసించే వారికి బాగాసరిపోతాయి.

ఎందుకంటే వీళ్ల ప్రకృతి సూచనల కంటే ఇంట్లో గడియారాన్ని అనుసరించే రోజువారీ పనులు చేసుకుంటారు కాబట్టి. నిజానికి సమయంపై ఇంతలాధారపడడం, మన ఆరోగ్యంపైనా ప్రతికూల ప్రభావం చూపిస్తుందని టుర్కూ యూనివర్సిటీ చేసిన పరిశోధనల్లో వెల్లడైంది. సమయం సరిపోవట్లేదు అనే భావనా ఇందులో నుంచి వచ్చిందేనట. అందుకే నగారల్లో ఉండేవారు ఎక్కువగా ప్రకృతిలో ఎక్కువ సమయం గడిపేలా చూసుకోవాలి. అప్పుడే మనకు 'బ్యాలెన్స్‌డ్ సెన్స్ ఆఫ్ టైమ్ వస్తుంది. సహజసిద్ధ వాతావరణంలో ఉండేవారికీ, పట్టణ వాతావరణంలో ఉండేవారికీ సమయాన్ని గడపడంలో తేడా ఉంటుందట. అంతేకాదు కొంతమందిని గతంలో జరిగిన చేదు విషయాలూ, చెడు సంఘటనలూ వర్తమానంలో పదేపదే గుర్తుకు వస్తూ వేధిస్తుంటాయి. అటువంటి వారూ ప్రకృతిలో గడపడం వల్ల వాటినుంచి బయటపడ గలుగుతారట. ◻

# ఇంట్లోనే పాప్‌కార్న్ !

సినిమాకి వెళ్లాలంటే ఇంటర్వెల్లో పాప్‌కార్న్ ఉండాల్సిందే లేదంటే.. ఏదో వెలితిగా, చక్కగా ఉంటుంది. ఈ పేలాలు థియేటరుకే పరిమితం కాదు. ఇంట్లోనూ ఇష్టంగా తినేస్తాం. అంత ఇష్టమైన పాప్‌కార్న్ బయట కొనుక్కుంటే. ప్యాకెట్ తెరిచాక వెంటనే తినేయాలి. లేదంటే క్రిస్పీనెస్ ఉండదు. సాగినట్లవుతాయి. అంతకంటే ముఖ్యంగా.. అవి నిలవుండేందుకు రసాయనాలు ఉపయోగిస్తారు. అలాంటి ఇబ్బందులు లేకుండా ఇంట్లోనే చేసుకుంటే బాగుంటుంది కదూ! ఎలాగంటారా.. ఎండు మొక్కజొన్న గింజలు కొన్నిటిని ఒక పాత్రలోకి తీసుకుని.. అందులో ఆలివ్ నూనె లేదా వెన్న, కొంచెం ఉప్పు వేసి కలియ తిప్పాలి. వీటిని అవెన్‌కు అనుకూలమైన పేపర్ బ్యాగ్‌లో వేసి, చివర్లో మూసేయాలి. ఇప్పుడు అవెన్‌లో పెట్టి, నిమిషం పాటు ఉంచితే సరి. ఘుమఘుమలాడే వేడి వేడి పాప్‌కార్న్ సిద్ధం. ఇక తిని ఆనందించడమే తరువాయి. ◻



# ఉలవలు తింటున్నారా ?

ఉలవలు అనగానే.. వాటిని పశువులకు దాణాగా పెడతారనీ, కొన్ని ప్రాంతాల్లో ఉలవచారు తయారు చేస్తారనీ మాత్రమే అనుకుంటాం. కానీ, పోషకాలు పుష్కలంగా ఉండే ఈ సూపర్‌ఫుడ్‌తో చాట్‌లు, వడలు.. వంటి మరెన్నో రకాల వంటకాలనూ చేసుకోవచ్చు. ఉలవల్లో సాల్యుబుల్ ఫైబర్ సమృద్ధిగా ఉంటుంది. ఈ గింజల్ని డైట్‌లో చేర్చుకోవడం వల్ల మలబద్ధకం, గ్యాస్‌వంటి జీర్ణ సంబంధిత సమస్యలూ ఎదురు కావు. ఆకలినీ పెంచుతాయి. అధికబరువునీ నియంత్రిస్తాయి. పైగా వీటిల్లో గ్లైసమిక్ ఇండెక్స్ తక్కువగా ఉండటం వల్ల రక్తపోటు, చక్కెర వ్యాధి అదుపులో ఉంటాయి.



- ఉలవల్ని, కొత్త బియ్యాన్ని సమానంగా తీసుకుని జావ చేసుకుని తాగితే కాల్షియం లభిస్తుంది. ఎముకలకు కండరాలకు తక్షణ శక్తి లభిస్తుంది. అలానే, వీటికి యాంటీ మైక్రోబియల్ లక్షణాలు ఉండటం వల్ల గాయాలు త్వరగా మానతాయి.
- ఈ గింజల్లోని ఫెనోలిక్ సమ్మేళనాలు కొలెస్ట్రాల్‌ని కరిగిస్తే, ఇవి యాంటీ లిథోజెనిక్‌గా పనిచేయడం వల్ల గుండె ఆరోగ్యంగా ఉంటుంది. అలానే ప్రొటీన్లు, కార్బోహైడ్రేట్లు, కాల్షియం, ఐరన్, ఫాస్ఫరస్ వంటివాటితో పాటు బి1,బి2, బి6, సి విటమిన్లు సమృద్ధిగా లభిస్తాయి. దీనివల్ల మాంసాహారానికి సమానంగా ప్రొటీన్ కూడా దొరుకుతుంది. ఇక, రక్తహీనతతో, ఎముకల బలహీనతతో బాధపడే మహిళలు, చిన్నారులు రోజూ సుప్‌లా తాగితే సరి. సమస్యలు తగ్గుముఖం పడతాయి. వ్యాధినిరోధకశక్తీ మెరుగ్గా పనిచేస్తుంది. ◻

# ఆ జ్ఞాపకాలు ఏమవుతాయ్ ?

అమ్మ కడుపులో మొదలవు తుంది బిడ్డ ప్రాణం. భూమి మీదకు వచ్చాక, శిశువులుగా, పసిపిల్లలుగా అనేక విషయాలు నేర్చుకుం టారు. కానీ, పెరిగి పెద్దయ్యాక మన సంభాషణలన్నీ... 'ఊహ జెసినప్పటి నుంచి.' అంటూ మొదలవుతాయి. మరి అంతకుముందు వరకూ చూసిన, విన్న, సుభ వించిన జ్ఞాపకాలు లేవా? అంటే ఉన్నాయ్.... మరి అవేవీ మనకు ఎందుకు గుర్తుండవు?! అనుమానం మీకెప్పుడైనా వచ్చిందా? అందుకు 'ది నేచర్' పరిశోధనలు ఏం చేస్తున్నాయంటే... పసిపిల్లలుగా ఉన్నప్పటి విషయాలు గుర్తులేకపోవటాన్నే ఇన్‌ఫాంటైల్ 'మీసియా' గా పిలు స్తారు. శాస్త్రవేత్తలు. ఈ పరిస్థితికి కారణం... అప్పటికి పిల్లల మెదడులోని హిప్పోక్యాంపస్, దీర్ఘకాల జ్ఞాపకాలు ఏర్పరచే బ్రెయిన్ నిర్మాణం పూర్తిగా అభివృద్ధి చెందడమేనట. పిల్లలకి జ్ఞాపకశక్తి కనిపిస్తుంది, మెదడును చూసే తీరు కూడా పెద్దలకంటే ఉంటుందట. పైగా వేగంగా డెవలప్ అయ్యే న్యూరాన్లు, హిప్పోక్యాంపస్లో మార్పులూ కీలకపాత్ర పోషిస్తాయి. అంతేకాదు, జ్ఞాపకాలు గుర్తుతెచ్చు కునేందుకు కావాల్సిన భాషానైపుణ్యాలు, సెన్స్ ఆఫ్ సెల్ఫ్ అప్పటికి వారిలో డెవలప్ అవ్వకపోవటమూ ఓ కారణమట. బయటి ప్రపంచాన్ని అర్థం చేసుకోవడం, కొత్త విషయాలు, భాషా నైపుణ్యాలు, సామాజిక బంధాలు, మోటార్ స్కిల్స్... నేర్చుకోవడంపై మెదడు దృష్టి పెడుతుందట. ఈ డెవలప్మెంట్లో భాగంగా, వారి మెదడు పాత జ్ఞాపకాలను, మర్చిపోతుందట. అందుకే... పసి పిల్లలుగా ఉన్నప్పటి విషయాలు ఏవీ మనకు గుర్తుండవట. ◻



# భగవంతుడి దగ్గరకు..




మనసు మాట విన్నామంటే పిల్లవాడు చెప్పిన సలహా పండితుడు పాటించినట్లుంటుంది. 18 క్షణాల పాటు ఆలోచనా రహిత స్థితిని సాధిస్తే ఆత్మజ్ఞానం సిద్ధించినట్లే అన్నాడో ఆధ్యాత్మికవేత్త. అదంత సులభం కాదు మరి. అందుకెంతో సాధన అవసరం. కోపతాపాలు శరీరంతోపాటు మనసునూ ప్రభావితం చేస్తాయి. కోపం, కామం విశ్వామిత్రుణ్ణి సైతం సాధనలో ఆటంకపరిచాయి. వందల సంవత్స రాల కఠోర తపస్సు నిరుపయోగమైంది. తీవ్ర తపస్సు వల్ల లోకానికి ముప్పు వాటిల్లు తుందని వశిష్టుడు వచ్చి చెబితే అప్పుడు తపస్సు విరమించాడు. విజయ గర్వితుడయ్యాడు. తర్వాత నిజానిజాలు గ్రహించి తనకన్నా అతడే గప్పవాడని తెలుసుకున్నాడు.

సాధనాలు సదా ప్రశాంతంగా ఉండేందుకు ప్రయత్నిస్తారు. ఇతరులు ఏమైనా ఇబ్బంది కలిగించినా సహనం చూపి ఔదార్యాన్నీ, ఔన్నత్యాన్నీ చాటు కుంటారు. ముఖ్యంగా ఈర్ష్య, ద్వేషాలు మనిషిని దిగజారుస్తాయి. ఉద్వేగస్థితిలో ఎదుటివారి సంపద, పదవి, గౌరవాలు చూస్తే ఈర్ష్య కలుగు తుంటుంది. రాజసూయ యాగంతో పాండవులకు లభించిన సంపదలు, గౌరవాలు చూసి అసూయ చెందిన దుర్యోధ నుడు వైరానికి దిగడంతో కురుక్షేత్ర సంగ్రామం సంభ వించింది. వినాశనానికి దారితీసే అసూయను తృప్తితో, అశాంతి కలిగించే ద్వేషాన్ని ప్రేమతో జయించాలి. ప్రేమ శత్రువులను కూడా మిత్రులుగా మారుస్తుంది. సుఖాలకు ఆనందం, దుఃఖాలకు విచారం సాధకుడికి కూడదు. అవి అంటని ద్వంద్వాతీత స్థితి వస్తేనే సాధకుడి ప్రయాణం గాడిలో పడినట్లవుతుంది. అలాగే పుట్టుకను మరణం వెంటాడు తుందనే ఆలోచన భయాన్ని కలిగిస్తుంది. అది సహజమని అర్థంచేసుకుని ఆధ్యాత్మికంగా పురోగమిస్తే ప్రేమ, సహనం, కరుణ, శాంతి లభిస్తాయి. జీవుడు, దేవుడు ఒకరేనన్న భావన ఏర్పడాలి. ఆ అద్వైతం లోంచి సర్వవ్యాపకత్వం వస్తుంది. అక్కడే ఆత్మజ్ఞాన అంకురం మొల కెత్తు తుంది. ఆదే సాధనలో మహావృక్షమై భగవంతుడి దగ్గరకు చేరుస్తుంది. ◻

ఆధ్యాత్మికం

# పిల్లలకు తాజా పాలు

పిల్లల పోషణ.. పాలతో పరిపూర్ణ మవు తుంది. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో తాజా పాలు దొరకడం కొంచెం కష్టమే. దాంతో చాలా మంది.. ముఖ్యంగా పట్టణాలూ, నగరాల్లోని వాళ్లు ప్యాకెట్ పాలను వాడటానికే మొగ్గు చూపుతుంటారు. అయితే వీటి ఎంపికలో ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా అనారోగ్యాలు తప్పవని హెచ్చరిస్తున్నారు నిపుణులు. దీని మీద కార్నెల్ యూనివర్సిటీ చేసిన పరిశోధనలో ఎన్నో ఆశ్చర్యకర విషయాలు వెల్లడయ్యాయి. పేపర్‌బోర్డు లేదా టెట్రా ప్యాకింగుతో తయారైన పాల డబ్బాల్లో బ్యాక్టీరియా శాతం అధికంగా ఉన్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు.



కారణాలను అన్వేషిస్తే.. పాలను శుద్ధిచేసిన తరవాత వాటిని డబ్బాల్లో నింపడానికి వినియోగించే మెషిన్లే ఇందుకు కారణమని తేల్చిరు. ఇందులో భాగంగా మిల్క్ ప్రాసెసింగ్ యూనిట్లలో పాల శాంపిళ్లను తీసుకుని పరీక్షించారు. వారం తరవాత వాటిల్లోని పాలు 30 శాతం పాడైతే, రెండు వారాలకల్లా 41 శాతం పాడైనట్లు గుర్తించారు. అంతే కాదు రుచిలోనూ తేడాను గమనించారట. మరో విషయం ఏంటంటే.. పెద్ద కంటైనర్లలోని పాలకంటే చిన్న కంటైనర్లలోని పాలు త్వరగా పాడవుతున్నాయనీ చెబుతున్నారు. యంత్రాల వాడకం పెరగడం, వాటిని శుభ్రం చేయడం క్లిష్టతరంగా ఉండటమే ఈ పరిస్థితికి దారితీస్తోంది. ఈ మెషిన్లను మరింతశ్రద్ధతో శుభ్రం చేయాలనీ, అవసరమైతే వాటి డిజైన్‌లోనూ మార్పులు చేయాలని ఆయా సంస్థకు సూచిస్తున్నారు పరిశోధకులు. వినియాఎగదారులు ఈ టెట్రా ప్యాకెట్లనూ, పేపర్‌బోర్డు కంటైనర్లనూ వినియోగించడంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలంటున్నారు. ముఖ్యంగాగర్భిణులూ, పిల్లలూ వీటిని వాడేటప్పుడు అప్రమత్తంగా ఉండాలట. ◻

# వర్షాల్లో కురులు పదిలమిలా !

ఎన్నిసార్లు శుభ్రం చేసుకున్నా ముఖం జిడ్డుగా మారడం, ఎంత దువ్వుకున్నా జుట్టు పిచ్చుక గూడులా తయారవడం.. వర్షాకాలంలో అధిక హ్యుమిడిటీ వల్ల తలెత్తే సమస్యలివి! ఇలాంటి వాతావరణాన్ని ఎదుర్కొని అందాన్ని సంరక్షించుకోవడమంటే సవాలనే చెప్పాలి. ముఖ్యంగా కుదుళ్లు జిడ్డుగా మారడం, జుట్టు రాలడం, గడ్డిలా తయారవడం.. వంటి కేశ సంబంధిత సమస్యలు ఈ కాలంలో అమ్మాయి లకు ఎక్కువగా ఎదురవు తుంటాయి. అయితే జుట్టు ఆరోగ్యాన్ని సంరక్షించుకునే క్రమంలో కొన్ని చిట్కాలు పాటిస్తే హ్యుమిడిటీలోనూ కేశాల పట్టులా మెరిపించచ్చని చెబుతున్నారు సౌందర్య నిపుణులు. మరి, ఆ చిట్కాలేంటో తెలుసుకుందాం..




**వానలో తడిశారా? ...** వానలో తడవడమంటే అందరికీ ఇష్టమే.. ముఖ్యంగా అమ్మాయిలైతే వర్షానినన మరింతగా ఎంజాయ్ చేస్తారు. అయితే ఇలా తడిసిన తర్వాత జుట్టును అలాగే ఆరబెట్టుకోవడం మనలో చాలామందికి అలవాటు. కానీ అలా చేయకుండా చల్లటి నీటితో ఓసారి తలస్నానంన చేసి జుట్టు ఆరబెట్టు కోమంటున్నారు నిపుణులు. ఎందుకంటే సాధారణంగానే వర్షపు నీటిలో కొన్ని ఆమ్ల గుణాలుంటాయట! అసలే ఈ కాలంలో హ్యుమిడిటీ వల్ల కుదుళ్లు జిడ్డుగా మారి వివిధ రకాల ఇన్ఫెక్షన్లకు కారణమవుతాయి. వీటికి ఈఆమ్ల గుణాలుతోడవడం వల్ల సమస్య మరింత పెరుగుతుందని, అందుకే వర్షంలో తడిసిన తర్వాత శుభ్రంగా తలస్నానం .చేసి జుట్టును పొడిగా ఆరబెట్టుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. తద్వారా వర్షంలో తడిసినా జుట్టు ఆరోగ్యం దెబ్బతినకుండా జాగ్రత్తపడచ్చు.



**స్టైలింగా..?ణ వద్దే వద్దు....** జుట్టుతో రోజుకో రకమైన కొప్పు వేసుకోవడం లేదంటే వివిధ హెయిర్‌స్టైల్స్ ప్రయత్నించడం మనకు అలావాటే! అయితే ఈ క్రమంలో వేడి ఉత్పత్తి చేసే హెయిర్ స్టైలింగ్ టూల్స్ వాడక తప్పదు. అలాగని వాడితే జుట్టు ఆరోగ్యందెబ్బతినడం ఖాయం. అసలే హ్యుమిడిలీ కారణంగా జుట్టు గడ్డిలా తయారవుతుంది. దానిపై నుంచి హెయిర్‌స్టైలింగ్ చేశామంటే అది పిచ్చుక గూడులా మారిపోతుంది. కాబట్టి స్టైల్ అంటూ జుట్టును అలాగే వదిలేయడం, వివిధ రకాల హెయిర్ స్టైల్స్ ప్రయతిననంచడం, హెయిర్ స్టైలింగ్ టూల్స్ వాడడంకంటే.. చక్కగా పైకి ముడే సుకోవడం/బన్ వేసు కోవడం లేదంటే నీట్‌గా జడ వేసు కోవడం మంచిది.

**నూనె పెట్టుకోవద్దు !.....** జుట్టు, కుదుళ్లు ఆరోగ్యంగా ఉండానికి తరచే నూనె పెట్టుకోమని సూచిసుంటారు., నిపుణులు. అయితే వర్షాకాలంలో మాత్రం ఈ అలవాటును కాస్త తగ్గించుకోవడం మంచిదంటున్నారు. ఎందుకంటే నూనెకు వర్షాకాలంలో ఉండే హ్యుమిడిటీ కూడా తోడవడంతో జట్టు మరింత జిడ్డుగా మారుతుంది. దీనివల్ల కుదుళ్లలో చుండ్రు, ఇన్ఫెక్షన్లు వచ్చే ప్రమాదం ఎక్కువ మరి, జుట్టుకు నూనె లేకపోతే ఎలా? అనుకోకడి. నూనెకు బదులు నీటి ఆధారిత సీరమ్స్ వాడవచ్చు. తద్వారా జిట్టుజిడుడ్డగా మారకుండా జాగ్రత్తపడచ్చు. అయితే మరీ అంతగా నూనె పెట్టుకోవాలనుకునే వర్షానిరాత్రి పడుకునే ముందు కుదుళ్ళుజిట్టుకు నూనె పట్టించి.. ఉదయాన్నే గాఢత తక్కువగా ఉండే షాంపూతో తలస్నానం చేసేయాలి.




**ఇలాంటప్పుడు సీరమ్ మంచిదే !..** కొంతమంది జుట్టు ఎంత దువ్వినా కాసేపటికే చెదిరిపోతుంది. దీంతో పదే పదే దువ్వుకోవడం, ఎక్కడికక్కడ హెయిర్ పిన్స్/క్లిప్స్ పెట్టేయడం.. వంటివి చేస్తుంటారు. నిజానికి దీనివల్ల జుట్టు చెదిరిపోకుండా ఉండడమేమో గానీ.. పిన్స్/క్లిప్స్ పెట్టేయడం.. వంటివి చేస్తుంటాయి నిజినాకి దీనివల్ల జుట్టు చెదిరిపోకుండా ఉండడమేమో గానీ.. పిన్స్ తీసేశాక మరింత గడ్డిలాగా మారుతుంది. అందుకే అలాటి వారు జడ/హెయిర్‌స్టైల్ వేసుకోవడానికి ముందు కాస్త హెయిర్ సీరమ్‌ని అప్లై చేసుఎకుంటే ఫలితం ఉంటుందంట! అంతేకాదు.. ఈ కాలలలో జుట్టు, కుదుళ్లలో ఉన్న తేమ, జిడ్డును తొలిగించి జుట్టును మృదువుగా మార్చడంలోనూ ఇది సమాయపడుతుంది. ◻

### ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో

# భారత్‌కు రజతం

**న్యూఢిల్లీ:** ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్, 10 మీటర్ల ఎయిర్ పిస్టల్‌లో భారత్ జట్టుకు రజతం దక్కింది. మొదటి రోజు క్వాలిఫికేషన్‌లో ఆర్పీఓ షూటర్లు మెరిసిపోవడంతో అన్మోల్ జైన్ ఫైనల్‌కు చేరుకోగా, సౌరభ్ చౌదరి ఈ రేసు నుంచి తప్పుకున్నాడు. కజకిస్తాన్‌లోని షిమ్‌కెంట్‌లో సోమవారం జరిగిన 16వ ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్‌ల ప్రారంభ రోజున భారత పురుషుల



షూటింగ్ జట్టు 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ జట్టు రజత పతకాన్ని గెలుచుకుంది. భారత త్రయం అన్మోల్ జైన్, ఆదిత్య మల్రా మరియు సౌరభ్ చౌదరి మొత్తం 1735 స్కోరుతో రజతం గెలుచుకున్నారు. చైనా 1744 స్కోరుతో పోడియంలో అగ్రస్థానంలో ఉండగా, ఇరాన్ 1733 స్కోరుతో కాంస్య పతకాన్ని గెలుచుకుంది. జట్టు మొత్తం మీద బలమైన ప్రదర్శన ఇచ్చినప్పటికీ, 2016 యూత్ ఆసియా ఛాంపియన్ అన్మోల్ జైన్ దేశం నుండి వ్యక్తిగత ఫైనల్‌కు చేరుకున్న ఏకైక షూటర్. అతను 580 స్కోరుతో (ఆర్పీఓ లేకుండా) ఏడవ స్థానంలో అర్హత సాధించాడు. అలాగే ఆదిత్య మల్రా (579) మరియు సౌరభ్ చౌదరి (576) అర్హత రౌండ్‌లో (ఆర్పీఓ లేకుండా) వరుసగా 11వ మరియు 19వ స్థానాల్లో నిలిచారు. అమిత్ శర్మ 588 స్కోరుతో అర్హత రౌండ్‌లో అగ్రస్థానంలో, వరుణ్ తోమర్ 584 స్కోరుతో నాల్గవ స్థానంలో నిలిచాడు.

## శ్రీరామ్, రిత్విక్ జోడీ ఓటమి

**న్యూఢిల్లీ:** ఎటిపి 125 ఛాలెంజర్-2025లో భారత్ టెన్నిస్ పురుషుల డబుల్స్ జోడీ బొల్లిపల్లి రిత్విక్, శ్రీరామ్ బాలజీ ఓటమి పాలైయ్యారు. అమెరికాలోని సమ్టర్‌లో జరిగిన ఈ టోర్నమెంట్ ఫైనల్లో భారత్ ద్వయం అమెరికా జంట చేతిలో పరాభం చెందారు. ఫైనల్లో రెండో సీడ్ భారత్ జంట రిత్విక్, శ్రీరామ్ 4-6, (3) 6-7 తేడాతో అమెరికా జంట ర్యాన్ సెగర్మాన్, పాట్రిక్ ట్రాక్ తో జరిగిన పోరులో వరుస సెట్లలో ఓడిపోయింది. మ్యాచ్ తొలి గేమ్‌లోనే బాలాజీ, బొల్లిపల్లి సర్వీస్ బ్రేక్ అవ్వడంతో నాల్గవ సీడ్ అమెరికన్లపై




అత్యుత్తమ ఆరంభాలను పొందలేకపోయారు. తదుపరి సెగర్‌మాన్, ట్రాక్ ఎటువంటి తప్పిదానికి అవకాశం ఇవ్వకపోవడంతో భారత జట్టు క్యాచ్‌అప్ ఆడింది. మొదటి సెట్‌లో బాలాజీ, బొల్లిపల్లి ఆ పాయింట్ నుండి మ్యాచ్‌ను సమం చేయడంలో విఫలమయ్యారు. అంతేకాకుండా దాన్ని 4-6తో వదులుకున్నారు. బాలాజీ, బొల్లిపల్లి రెండవ సెట్‌లో తమ మంచి ప్రదర్శన కొనసాగించి వారి అన్ని సర్వీస్‌లను నిలుపుకున్నారు. అయితే, మొదటి సెట్‌లో జరిగినట్లుగా, వారు బ్రేక్ చేయడంలో విఫలమయ్యారు. దీని వలన సెట్ టైబ్రేకర్ అయింది. దీంతో సెగర్మాన్, ట్రాక్ టైబ్రేకర్లలో చాలా దూకుడుగా వ్యవహరించి టర్నీని 3-7 తేడాతో గెలుచుకుని టైటిల్‌ను దక్కించుకున్నారు.




### మలేసియా ఇంటర్నేషనల్ ఛాలెంజ్..

# దేవికకు టైటిల్

**న్యూఢిల్లీ:** తొలి ఇంటర్నేషనల్ ఛాలెంజ్-2025 టైటిల్‌ను భారత్‌కు చెందిన దేవికా సిహాగ్ కైవసం చేసుకుంది. మహిళల సింగిల్స్ ఫైనల్లో దేవికా తన ప్రత్యర్థి ఇషారాణి బారువాను ఓడించింది. మలేషియాలో సోమవారం జరిగిన మలేషియా ఇంటర్నేషనల్ ఛాలెంజ్-2025లో భారత షట్లర్ దేవికా సిహాగ్ (20) మహిళల సింగిల్స్ టైటిల్‌ను గెలుచుకుంది. ఇపోహ్‌లోని అరేనా బ్యాడ్మింటన్ పెరాక్‌లో జరిగిన ఈ టోర్నమెంట్‌లో, దేవిక ఆల్ ఇండియన్ ఫైనల్‌లో 15-7, 15-12తో స్వదేశానికి చెందిన ఇషారాణి బారువాను ఓడించింది. ఈ మ్యాచ్ బిడబ్ల్యూఎఫ్ ప్రయోగాత్మక 3+15 స్కోరింగ్ ఫార్మాట్ కింద జరిగింది. ప్రపంచ ర్యాంకింగ్ 100తో ఉన్న దేవిక ఉన్నత ర్యాంక్ ఉన్న ప్రత్యర్థులను ఓడించడం ద్వారా ముందుకు సాగింది. క్వార్టర్ ఫైనల్స్‌లో, ఆమె జపాన్‌కు చెందిన ప్రపంచ 36వ ర్యాంకర్ మనామి సుయిజును 15-10, 15-11 తేడాతో ఓడించింది. ఆ తర్వాత ఆమె సెమీఫైనల్లో మాజీ జూనియర్ ప్రపంచ నంబర్ 1 తస్నిమ్ మీర్‌పై 11-15, 15-9, 161-4 స్కోరుతో విజయం సాధించింది. ఇక మహిళల సింగిల్స్ డ్రాలో, అష్మితా చలిహా తన రౌండ్ 32 మ్యాచ్‌లో గెలిచింది కానీ రౌండ్ ఆఫ్ 16లో ఓడిపోయింది, ఇరా శర్మ కూడా రౌండ్ ఆఫ్ 16కి చేరుకుంది. క్వార్టర్ ఫైనల్స్‌లో ఇషారాణి బారుహ్ ముటియారా ఆయు పుష్పితారిని, సెమీ ఫైనల్స్‌లో కీషా ఫాతిమాను ఓడించిన తర్వాత ఫైనల్ చేరుకుంది. కాగా పురుషుల సింగిల్స్ ఈవెంట్‌లో మిథున్ మంజునాథ్ అద్భుతమైన ప్రదర్శన ఇచ్చి సెమీఫైనల్‌కు చేరుకున్నాడు. క్వార్టర్ ఫైనల్స్‌లో అతను 13-15, 15-11, 15-5 స్కోరుతో అడే రెస్కీ ద్విచాయోను ఓడించాడు. సెమీఫైనల్లో జాన్ జిరే లీ చేతిలో 16-18, 3-15 స్కోరుతో అతను ఓడిపోయాడు. మన్రాజ్ సింగ్ మరియు అలప్ మిశ్రా కూడా ఓడిపోయే ముందు క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నారు.

# టీమిండియాలో ఫ్యూచర్ ఫాస్ట్ బౌలర్స్

### డేంజరస్ ప్లేయర్ల ఎంట్రీ

### 22 మందిని సిద్ధం చేసిన బిసిసిఐ



**న్యూఢిల్లీ:** టీమిండియాలో కొత్త రక్తం ఎక్కించి పటిష్టం చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా భారత క్రికెట్ నియంత్రణ మండలి (బిసిసిఐ) దేశంలో కొత్త తరం ఫాస్ట్ బౌలర్లను అభివృద్ధి చేయడానికి తీవ్రంగా కృషి చేస్తోంది. బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ( నేషనల్ క్రికెట్ అకాడమీ)లో 22 మంది యువ, అండర్19 ఫాస్ట్ బౌలర్లుకు శిక్షణ ఇస్తోంది. ఈ బౌలర్లు ఫిట్‌నెస్ కసరత్తులు, నైపుణ్యాలను మెరుగుపరచడం, వ్యూహాలను రూపొందించడంలో నిమగ్నమయ్యారు. ఈ శిక్షణకు ఫాస్ట్ బౌలింగ్ కోచ్ ట్రాయ్ కూలీ నాయకత్వం వహిస్తున్నాడు. గత కొన్ని సంవత్సరాలుగా భారత ఫాస్ట్ బౌలింగ్ దాడి చాలా పురోగతి సాధించిన సంగతి తెలిసిందే. ముఖ్యంగా రవిశాస్త్రి, భరత్ అరుణ్ శిక్షణ, మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ నాయకత్వంలో రాటు దేలిన సంగతి తెలిసిందే. టెస్ట్ మ్యాచ్‌లలో కూడా టీం ఇండియా బౌలర్లు తమదైన శైలిలో ఉన్నారు. కానీ ఇటీవల ఇంగ్లండ్‌లో జరిగిన అండర్సన్-టెండూల్కర్ ట్రోఫీ సందర్భంగా ఆకాష్ దీప్, అర్షదీప్ సింగ్ గాయాల కారణంగా జట్టు ఇబ్బందులను ఎదుర్కొంది. దీని కారణంగా హర్యానా యువ బౌలర్ అన్షుల్ కాంబోజ్‌ను పిలిచారు. కానీ అతను తన మొదటి మ్యాచ్‌లో బాగా రాణించలేకపోయాడు. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఫాస్ట్ బౌలింగ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లో 14 మందిని లక్ష్యంగా చేసుకుని, 8 మంది అండర్ 19 ఫాస్ట్ బౌలర్లకు శిక్షణ ఇస్తున్నారు. ఇటీవల సంవత్సరాల్లో ఈ కార్యక్రమం ముఖ్యమైన అడుగు. ఆటగాళ్ల ఫిట్‌నెస్‌ను పరీక్షించడంతో పాఉట, వారు తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటున్నారు. రాబోయే సీజన్‌కు పూర్తిగా సిద్ధం కావడానికి కోచ్ ట్రాయ్ కూలీ పర్యవేక్షణలో శిక్షణ పొందుతున్నారు. తుషార్ దేశ్‌పాండే, సిమర్‌జీత్ సింగ్ వంటి బౌలర్లతో పాటు, సీనియర్ వన్డే బ్యాట్స్‌మన్ శ్రేయాస్ అయ్యర్ కూడా ఇందులో పాల్గొంటున్నారు. కానీ మయాంక్ యాదవ్, ఉమ్రాన్ మాలిక్ వంటి బౌలర్లు దీర్ఘకాలిక గాయం కారణంగా లేకపోవడం ఫిట్‌నెస్ నిర్వహణ గురించి ప్రశ్నలను లేవనెత్తింది. కాగా అండర్ 19 జట్టు వచ్చే నెలలో ఆస్ట్రేలియాలో పర్యటిస్తుంది. సెప్టెంబర్‌లో జరిగే ఆస్ట్రేలియా పర్యటనలో ఈ యువ బౌలర్లలో కొంతమందిని టీమిండియాలో ఎంపిక చేస్తున్నారు. భారత అండర్19 జట్టు సెప్టెంబర్ 21 నుంచి అక్టోబర్ 7 వరకు అక్కడ మూడు వన్డేలు, రెండు మల్టీడే మ్యాచ్‌లు ఆడనుంది.

# కరేబియన్ ప్రీమియర్ లీగ్‌లో నైట్ రైడర్స్ గెలుపు

### 12 రన్స్ తేడాతో సెయింట్ కిట్స్ ఓటమి

**న్యూఢిల్లీ:** కరేబియన్ ప్రీమియర్ లీగ్-2025 సీజన్‌లో ట్రిన్‌బాగో నైట్ రైడర్స్ 12 రన్స్ తేడాతో సెయింట్ కిట్స్‌ను ఓడించింది. ఈ లీగ్‌లో నైట్ రైడర్స్ తమ తొలి మ్యాచ్‌లో భాగంగా సెయింట్స్ కిట్స్ జట్టుతో తలపడింది.






వార్నర్ పార్క్ వేదికగా టాస్ గెలిచిన సెయింట్ కిట్స్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన నైట్ రైడర్స్‌కు ఓపెనర్లు కొలిన్ మున్రో, అలెక్స్ హేల్స్ అదిరిపోయే ఆరంభం అందించాడు. మున్రో 50 బంతుల్లోనే శతక మార్కు అందుకున్నాడు. మొత్తంగా 57 బంతులు ఎదుర్కొని 14 ఫక్షర్లు, 6 సిక్సర్ల సాయంతో ఏకంగా 120 పరుగులు చేశాడు. అయితే కెప్టెన్ నికోలస్ పూరన్ (13)తో పాటు, కీరన్ పొలార్డ్ (19) విఫలం కాగా, కేసీ కార్టీ ఆఖర్లో మెరుపులు (8 బంతుల్లో 16 నాటౌట్) మెరిపించాడు. ఫలితంగా నిర్ణీత 20 ఓవర్లలో నైట్ రైడర్స్ 5 వికెట్లు నష్టానికి 231 పరులుగు చేసింది. సెయింట్ కిట్స్ బౌలర్లలో కెప్టెన్ జేసన్ హోల్డర్, వకార్ సలామ్‌ఖీల్ రెండేసి, డొమినిక్ డ్రేక్స్ ఒక వికెట్ దక్కించుకున్నాడు. ఇక లక్ష్య ఛేదనకు దిగిన సెయింట్స్ కిట్స్‌కు మెరుగైన ఆరంభం దక్కింది. ఓపెనర్లు కైలీ మేయర్స్ (22 బంతుల్లో 32), ఆండ్రీ ఫ్లెచర్ (26 బంతుల్లో 41) రాణించగా, వన్‌డౌన్ బ్యాటర్ రీసీ రోసోవ్ (24 బంతుల్లో 38) కూడా ఫర్వాలేదనిపించాడు. ఇక కెప్టెన్ జేసన్ (22 బంతుల్లో 44) ధనాధన్ దంచికొట్టగా, మిగిలిన వారిలో డొమినిక్ డ్రేక్స్ (12 బంతుల్లో 20 నాటౌట్), నసీం షా (5 బంతుల్లో 17 నాటౌట్) జట్టును విజయతీరాలకు చేర్చే ప్రయత్నం చేశారు.
అయితే నైట్ రైడర్స్ బౌలర్ల విజృంభణ కారణంగా సెయింట్స్ కిట్స్ గెలుపుకు 12 పరుగుల దూరంలో నిలిచిపోయింది. ఫలితంగా నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు నష్టానికి 219 పరుగులు చేసిన సెయింట్స్ కిట్స్, నైట్ రైడర్స్ చేతిలో ఓటమిపాలైంది.

## వాణిజ్యం



# భారత్‌లో ‘ఐఫోన్ల’ ల తయారీ

**హైదరాబాద్, ఆగస్టు18, ప్రభాతవార్త:** భారత్‌లో ఐఫోన్ తయారిని ప్రారంభించినట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. బెంగళూర్‌లో ఐఫోన్ 17ఉత్పత్తిని చెన్నైలో ఒక ప్లాంట్ ఉన్న తైవాన్ ఎల్రక్ట్రానిక్స్ సంస్థ ఫాక్స్‌కాన్ 2.8బిలియన్ డాలర్ల (దాదాపు 25వేల కోట్లు) పెట్టుబడితో ఏర్పాటు చేశారు. 2024-2025 సంవత్సరంలో 3.5 కోట్ల నుంచి 4కోట్ల వరకు తయారీకి యాపిల్ నిర్ణయించింది.
ఈ ఏడాదిలో వాటిని 6కోట్లకు పెంచాలని భావిస్తుంది. అయితే వందలమంది చైనీస్ ఇంజనీర్లు ఆకస్మాత్తుగా తిరిగి వెళ్లడంతో ఉత్పత్తి ప్రారంభానికి ఆలస్యమైందని వివరించింది. వేర్వేరు దేశాల నుంచి ఇంజనీర్లను ఆహ్వానించడం ద్వారా ఉత్పత్తి ప్రక్రియ సజావుగా సాగేలా ఫాక్స్‌కాన్ చర్యలు చేపట్టింది. గత ఆర్థిక ఏడాదిలో యాపిల్ 22బిలియన్ డాలర్ల విలువైన ఐఫోన్లను అసెంబుల్ చేసిందని పేర్కొంది. 2025 జూన్ త్రైమాసికంలో అమెరికాలో విక్రయమైన ఐఫోన్లన్ని భారత్‌లో తయారైనవేనని సంస్థ సీఈవో టిమ్‌కుక్ బోర్డు సమావేశంలో వెల్లడించారు. 2024లో 7.59కోట్ల ఐఫోన్లు అమెరికాలో అమ్ముడుపోయాయని ఎస్ అండ్ గ్లోబల్ వివరించారు. మన దేశంలో ఐఫోన్ల సరఫరాలు 21.5శాతం పెరిగి 2025లో 59లక్షలకు చేరాయని పేర్కొన్నారు.

# వాడిన వంటనూనెతో ‘విమాన ఇంధనంగ్లా

### -ఐఒసి చైర్మన్ అరవిందర్ సింగ్



**హైదరాబాద్,ఆగస్టు18, ప్రభాతవార్త:** సంపన్నుల ఇళ్లు, బడా స్టార్ హోటళ్లలో వంటకు ఒకసారి ఉపయోగించిన వంటనూనెను మళ్లీ వాడకుండా పారబోస్తారు. అయితే వృధాగా పోతున్న వంటనూనెతో సుస్థిర విమాన ఇంధనం (ఎస్ఎఎఫ్) ఉత్పత్తి చేసేందుకు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఒసి) రిఫైనరి సర్టిఫికేషన్ పొందిందని కంపెనీ చైర్మన్ అరవిందర్ సింగ్ సాహ్నీ వెల్లడించారు. సంప్రదాయ విమాన ఇంధనాన్ని (ఎటిఎఫ్)కు ప్రత్యామ్నాయంగా వినియోగించే వీలున్న ఇంధనం ఎస్ఎఎఫ్‌ను పెట్రోలియంయేతర ఉత్పత్తుల నుంచి తయారు చేస్తారు. లభ్యతకు అనుగుణంగా ఎటిఎఫ్‌లో 50శాతం వరకు కలపవచ్చున్నారు. 2027 నుంచి అంతార్జాతీయ విమానయాన సంస్థలకు విక్రయించే విమాన ఇంధనంలో 1శాతం ఎస్ఏఎఫ్ కలపడాన్ని మనదేశం తప్పనిసరి చేసింది. ఈ నేపథ్యంలో ఎస్ఏఎఫ్ తయారికి సంబంధించి హరియాణలోని ఐఒసి పానిపట్ రిఫైనరి, అంతర్జాతీయ సివిల్ ఏవియేషన్ సంస్థ ఐఎస్‌సిసి కార్సియా సర్టిఫికేషన్‌ను పొందిందని వివరించారు. దేశంలో ఇది పొందిన ఏకైక సంస్థ ఐఒసినే అని పేర్కొన్నారు. ఈ ఏడాది డిసెంబరు నుంచి వార్షికంగా 35,000 టన్నుల ఎస్ఏఎఫ్‌ను రిఫైనరి నుంచి తయారి చేయాలనేది లక్ష్యమని వెల్లడించారు.2027లో 1శాతం బ్లెండింగ్ నిబంధనలను అందుకోడానికి ఈ ఉత్పత్తి సరిపోందన్నారు. అయితే వంటనూనె సమీకరణను హోటళ్లు, రెస్టారెంట్లు, హల్దీరామ్ వంటి స్నాక్స్, స్వీట్స్ తయారి సంస్థల నుంచి ఎజన్సీలు సేకరించి ఐఒసీ పానిపట్ రిఫైనరికి సరఫరా చేస్తాయి. దీంతోనే ఎస్ఎఎఫ్‌ను సిద్ధం చేస్తారు. రంగుల తయారిలో ఉపయోగించే బుటైల్ అక్రిలేట్‌ను ఉత్పత్తి చేసేందుకు గుజరాత్‌లోని కొయాలీ రిఫైనరీలో రూ.5వేల కోట్లతో ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. బీపిసిఎల్ కోచి రిఫైనరీ తర్వాత మనదేశంలో ఇదే పెద్దదని, వార్షిక సామార్థ్యం 1లక్ష 50వేల టన్నులు. ప్రస్తుతం దేశంలో 3లక్షల 20వేల టన్నుల బుటైల్ అక్రిలేట్‌ను దిగుమతి చేసుకుంటూ..తగ్గిస్తుందన్నారు. ఏడాదికి 10వేల టన్నుల హరిత హైడ్రోజన్‌ను ఉత్పత్తి చేసే యూనిట్‌నూ పానిపట్ రిఫైనరీ వద్ద ఏర్పాటు చేసి ఎల్అండ్‌టీ నిర్మిస్తున్న ఈ ప్లాంట్ వచ్చే రెండుఏళ్లలో ఏర్పాటుచేయనున్నారని వివరించారు.

## జిఎస్టి తగ్గింపుతో చౌకగా వాహన ధరలు

**హైదరాబాద్,ఆగస్టు18, ప్రభాతవార్త:** జీఎస్టి విధానంలో మార్పులు తీసుకొచ్చేందుకు కేంద్రప్రభుత్వం భావిస్తుంది. ప్రస్తుత విధానంలో నాలుగు పన్ను శ్లాబులు (5,12,18,28) శాతాలు ఉండగా ఇకపై




రెండు శ్లాబులు (5,18)శాతకే పరిమితం చేయనుంది. అయితే హానికరమైన వస్తువులపై మాత్రం 40శాతం పన్ను ఉంటుందని సమాచారం. ప్రస్తుతం సంప్రదాయ వాహనరంగం అత్యధిక పన్ను రేటు 28శాతం శ్లాబ్‌లో ఉందని, అయితే అదనంగా వాహన రకాన్ని బట్టి 1-22శాతం వరకు సెస్ విధిస్తున్నారు. ఫలితంగా ఇంజిన్ సామార్థ్యం, పొడవు ప్రకారం చిన్న పెట్రోల్ కార్లపై 29శాతం నుంచి ఎస్‌యూవీలపై 50శాతం వరకు పన్ను ఉంది. అయితే విద్యుత్తు వాహనాలపై మాత్రం 5శాతం ఉంది. దీపావళి వరకు జీఎస్టి రేట్లు తగ్గితే అందుబాటు ధరలో వాహనాలు ఉంటాయని నిపుణులు పేర్కొంటున్నారు.
ప్రస్తుత జీఎస్‌టి విదానంలో ఇంజిన్ సామార్థ్యం, వాహన పరిమాణానికి సంబంధించిన వర్గీకరణ వివాదాలను కొత్త పన్ను రేట్ల ప్రతిపాదన పరిష్కరిస్తుందని భావిస్తున్నారు. ఇంజిన్ సామార్థ్యం, పొడవు ఆధారంగా వర్గీకరణతో వివాదాలను పరిష్కరించేందుకు అన్ని వాహనాలను ఒకేశ్లాబ్ విధానం ఉంచే అవకాశం ఉందని తెలుస్తుంది. తక్కువ జీఎస్‌టి రేటుతో కార్లధరలు తగ్గనున్నాయి.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.